ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుల గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 298 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | శనివారం 24 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

### సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళుతున్న వెండి!

వెండి ధరలు దూసుకెళుతున్నాయి. పెట్టుబడిదారుల ఆసక్తిని ఆకర్షిస్తూ ఈ తెల్లని లోహం సరికొత్త రికార్డులను తాకుతోంది. ఈ జనవరి నెలలోనే ఇప్పటివరకు 22 శాతం మేర వెండి ధర పెరిగింది. ప్రధాన పెట్టుబడి సాధనాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 3 లక్షల మైలురాయికి అత్యంత చేరువలో ఉంది.గత శుక్రవారం ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ. 2,87,762 వద్ద ముగిసింది.

### భారత కంపెనీలకు పోటీతత్వమే కీలకం

అయిదు రోజుల పాటు దావోస్ జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలకు భారత్ నుంచి వ్యాపార ప్రముఖులు హాజరు కానున్నారు. కంపెనీలకు ఖర్చు, స్థాయి, సామర్థ్యాల్లో పోటీతత్వాన్ని తీసుకురావడమే కీలకంగా మారిందని కన్సల్టెన్సీ సంస్థ బీసీజీ ఇండియా అధిపతి రాహుల్ జైన్ తెలిపారు. 2030 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచే అవకాశం ఉందన్నారు.

# కాంగ్రెస్‌లో దండుపాళ్యం ముఠా



- మేం ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు
- పిచ్చోడి చేతిలో రాయిలా.. అసమర్థుడి జీవన యాత్రలా కాంగ్రెస్ పాలన ఉంది
- ఒక్కో రోజు ఒక్కో డ్రామాతో నెట్టుకొస్తున్నారు
- మేం ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు
- అక్రమ, అనైతిక పనులు చేయలేదు
- అయినా నాపై తీవ్ర వ్యక్తిత్వ హననం చేస్తున్నారు.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు



## డీఎంకే పార్టీకి కౌంట్‌డౌన్ మొదలైంది

- తమిళనాడు ప్రజలు ఈ పార్టీని వేరులతో సహా పెకిలించి మార్పు కోసం ఓటు వేయాలని నిర్ణయించుకున్నారు
- డీఎంకే ప్రభుత్వం కేవలం ఒకే కుటుంబం కోసం పనిచేస్తోంది
- 2014 కంటే ముందు కేంద్రంలో కాంగ్రెస్, డీఎంకే అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన నిధుల కంటే, తమ ప్రభుత్వం తమిళనాడుకు మూడు రెట్లు ఎక్కువ నిధులు కేటాయించింది
- ఎన్డీయేకు వేసే ప్రతి ఓటు తమిళనాడును మాదకద్రవ్యాల ముప్పు నుంచి విముక్తి చేస్తుంది
- ప్రధాని మోదీ

## ఏఐ ఆవిష్కరణల అమలుకు

# ఐకమ్

- దావోస్ వేదికగా ఆవిష్కరించిన సీఎం రేవంత్
- ఇన్నోవేషన్ సంస్థను దావోస్‌లో ఆవిష్కరించిన సీఎం రేవంత్‌రెడ్డి
- కృత్రిమ మేధను ప్రయోగాల దశ నుంచి ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యమని వెల్లడి

  ఏఐ ఆవిష్కరణలకు తెలంగాణను ప్రపంచ వేదికగా నిలబెడుతుంది
- తెలంగాణలో ప్రయోగాలతోపాటు ఆయా ఆవిష్కరణల అమలుకు కూడా అధిక ప్రాధాన్యమిస్తున్నాం



**హైదరాబాద్**

ఇప్పటి వరకు ఏఐ(కృత్రిమ మేధ) అంటే ప్రయోగాలు, స్టార్టప్ డెమోలు, పైలట్ ప్రాజెక్టులకు పరిమితమైంది. ప్రస్తుతం ప్రపంచం ఒక కీలక మలుపులో నిలిచింది. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను బాధ్యతాయుతంగా, విశ్వసనీయంగా ప్రజల జీవితాల్లోకి తీసుకెళ్లి ఏవిధంగా అమలు చేయాలన్నదే అసలైన సవాల్. దీనికి పరిష్కారంగా తెలంగాణ ప్రభుత్వం తీసుకొస్తున్న భారత్‌లోనే తొలి ఎకోసిస్టమ్ ఆధారిత ఓపెన్ ఇన్నోవేషన్ సంస్థే 'ఐకమ్'. ఇది బిగ్ డేటా వినియోగం, ఏఐ నైపుణ్యాల విస్తృత అభివృద్ధి, ప్రపంచ స్థాయి స్టార్టప్‌లకు ప్రోత్సాహం, అత్యాధునిక కంప్యూటింగ్ మౌలిక వసతులతో బాధ్యతాయుత ఏఐ ఆవిష్కరణలకు తెలంగాణను ప్రపంచ వేదికగా నిలబెడుతుంది అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఐకమ్'ను రేవంత్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో - మిగతా3లో

### ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధం: ఇరాన్



- తన వల్లే ఇరాన్‌లో 800 మందికి పైగా ఉరిశిక్షలు ఆగిపోయాయన్న ట్రంప్
- తాము మరణ శిక్షల నిర్ణయమే తీసుకోలేదన్న మొవాహెది
- తప్పుదారి పట్టించే ప్రచారం చేయవద్దని మీడియాకు విన్నపం

### 'మోదీ చరిత్రను వక్రీకరిస్తున్నారు



- గాంధీని మర్చిపోయేలా చేస్తున్నారు'
- నేతాజీ జయంతి వేళ కాంగ్రెస్ విమర్శలు
- ప్రధాని మోదీపై జైరాం రమేశ్ కీలక వ్యాఖ్యలు
- ఆయనో 'డిస్టోరియన్', చరిత్రను తనకు నచ్చినట్లు మార్చేస్తున్నారంటూ ఆరోపణలు

### డబ్ల్యూహెచ్ఓకు బకాయిపడిన అమెరికా



- ప్రపంచ ఆరోగ్య సంస్థ విషయంలో అమెరికా కీలక నిర్ణయం
- డబ్ల్యూహెచ్ఓ నుంచి వైదొలుగుతున్నట్లు తెలిపిన అమెరికా
- నిధులు నిలిపివేస్తున్నట్లు అమెరికా వెల్లడి
- సంస్థకు 260 మిలియన్ డాలర్లు బకాయి పడిన అమెరికా

## మేడారం మహాజాతరకు

# సర్వం సిద్ధం



- ఈ రూట్లలో వెళితే మరింత సులువుగా చేరుకోవచ్చు!
- మేడారం మహా జాతరకు ఏర్పాట్లు పూర్తి
- ఆధునిక సాంకేతికతతో సర్వ సన్నద్ధం
- ఈ నెల 28వ నుంచి 31 వరకు మేడారం జాతర
- పకడ్బందీగా పోలీసు ప్రణాళిక

**హైదరాబాద్**

ఈ నెల 28 నుంచి మేడారం మహాజాతర జరగనున్న విషయం తెలిసిందే. యాత్రను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేస్తున్న ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయి. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన మేడారం జాతర ప్రసిద్ధి పొందింది. ఈ మహా జాతరకు కోటి మంది భక్తులు తరలి వస్తారని అధికారుల అంచనా వేస్తున్నారు. దీనికి తగ్గట్లుగా ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ రాష్ట్ర పండగగా గుర్తింపు పొందిన మేడారం జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివెళ్తున్నారు. కొంతమంది నెలరోజుల ముందు నుంచే గద్దెల వద్ద మొక్కులు - మిగతా3లో



### గణతంత్ర వేడుకల్లో 'ఆపరేషన్ సిందూర్' శకటం

- ఏఐ కళ్లజోళ్లతో సెక్యూరిటీ- క్షణాల్లో నేరగాళ్లను కనిపెట్టొచ్చు!
- భద్రత దృష్ట్యా ఈ సారి గణతంత్ర వేడుకల్లో అత్యాధునిక టెక్నాలజీ వినియోగించనున్న పోలీసులు
- దీనివల్ల భౌతిక తనిఖీలు లేకుండానే, క్షణాల్లో నేరస్థులను గుర్తించి అదుపులోకి తీసుకునే అవకాశం
- గగనతల రక్షణకు ఉద్దేశించిన ఎల్-70 గన్స్, ఆకాశ్ వ్యవస్థను ఏర్పాటు చేశాం

## సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేసిన ఘనత బీఆర్ఎస్‌దే

- చట్ట ప్రకారమే కేసుల దర్యాప్తు ఉంటుంది
- తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్
- గతంలో ప్రతిపక్ష నేతలవే కాదు సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేశారు
- బీఆర్ఎస్ హయాంలో ఫోన్లు మాట్లాడాలంటే భయపడేవాళ్లం
- జైలుకు వెళ్లాలని బీఆర్ఎస్ నేతలకు బాగా ఉబలాటంగా ఉంది
- సింగరేణిలో అక్రమాలు ఎప్పుడు జరిగాయో తేటతెల్లం అవుతుంది



**హైదరాబాద్**

తాము కక్ష సాధింపు రాజకీయాలు చేస్తే బీఆర్ఎస్ నేతలు జైల్లో ఉండేవారని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. చట్ట ప్రకారమే కేసుల దర్యాప్తు ఉంటుందని తెలిపారు. గతంలో ప్రతిపక్ష నేతలవే కాదు సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేశారని ఆరోపించారు. హైదరాబాద్ భూములను ప్రైవేట్ వాళ్లకు అక్రమంగా కట్టబెట్టారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఫోన్లు మాట్లాడాలంటే భయపడేవాళ్లమని వ్యాఖ్యానించారు. సింగరేణిలో అక్రమాలు ఎప్పుడు జరిగాయో తేటతెల్లం అవుతుందన్నారు. "నక్సల్స్ వంకతో తన ఫోన్ ట్యాపింగ్ చేశారని అధికారులు చెప్పారు. నటులు, వ్యాపారులు ఏమైనా తీవ్రవాదులా.. ఎందుకు ట్యాప్ చేశారు. కవిత బయటపెట్టిన వాటికి ఆధారాలు ఇవ్వాలని కోరుతున్నా. 547 మంది ఫోన్లను ట్యాప్ చేశారని అధికారులు - మిగతా3లో

## ఇరాన్‌పై కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు




- భారీగా ఆయుధాలు తరలిస్తున్న అమెరికా!
- ఇరాన్ అణు కార్యక్రమం కొనసాగిస్తే మళ్లీ దాడులు తప్పవన్న ట్రంప్
- అమెరికా హెచ్చరికలతోనే ఇరాన్ ఉరిశిక్షలు నిలిపివేసిందన్న వాదన
- మధ్యప్రాచ్యానికి తరలివస్తున్న భారీ యుద్ధ విమాన వాహక నౌకలు
- ఇరాన్ అల్లర్లలో 20 వేల మందికి పైగా మరణించినట్లు అంచనా
- శాంతి స్థాపన కోసం 'బోర్డ్ ఆఫ్ పీస్' ఏర్పాటు చేసినట్లు ప్రకటన

ధర్మఘంట

# సంపాదకీయం

## ఇరవై ఏళ్ల పోరాటం.. ఇంకా దక్కని పెన్షన్ హక్కు!

'దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించట్లేదు' అన్న నానుడి నేటి 2003 డీఎస్సీ ద్వారా ఎంపికై, 2004 సెప్టెంబర్ తర్వాత ఉద్యోగంలో చేరిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల పరిస్థితికి అచ్చుగుద్దినట్లు సరిపోతుంది. నియామక ప్రక్రియ ప్రభుత్వ వైఫల్యాల వల్ల ఆలస్యమైందన్న ఒకే ఒక్క కారణంతో వేలాది మంది ఉద్యోగులను బలవంతంగా నూతన పెన్షన్ విధానం (సీపీఎస్) పరిధిలోకి నెట్టివేయడం ఘోరమైన అన్యాయం. పెన్షన్ అనేది భిక్ష కాదు.. అది ఉద్యోగి హక్కు అని న్యాయస్థానాలు స్పష్టంగా చెప్పినా, ప్రభుత్వాలు నేటికీ ఆ వాస్తవాన్ని విస్మరించడమే ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర ఆందోళనకు కారణమవుతోంది. ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఉద్యోగ విర మణ అనంతరం తమ కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుందనుకున్న పెన్షన్ విధానాన్ని తొలగించడం దుర్మార్గమైన చర్యగా వారు పరిగణిస్తున్నారు. సుమారు ముప్పై సంవత్సరాలకు పైగా ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగికి పెన్షన్ అందించకపోవడం ఉద్యోగులను వంచించడమే అవుతుంది. 2004 కన్నా ముందు ప్రభుత్వాలు ఏ విధంగా ఉద్యోగులకు పెన్షన్ అందించాయి? అది ఇప్పుడు ఎందుకు సాధ్యపడడం లేదు? పీఎఫ్అర్డిఏ చట్టం ప్రకారం 2004 జనవరి 01 నుండి మన దేశంలో ప్రవేశ పెట్టిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమలులో భాగంగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2004 సెప్టెంబర్ 01 నుండి సీపీఎస్ విధానం అమలు అవుతోంది. అయితే, సీపీఎస్ అమలు తేదీ కంటే ముందే నోటిఫికేషన్లు విడుదలై నియామక ప్రక్రియ ఆలస్యం కావడం వలన సీపీఎస్ అమలు తేదీ తరువాత నియామకం జరిగిన ఉద్యోగులను బలవంతంగా నూతన పెన్షన్ పరిధిలోకి తీసుకురావడం జరిగింది. ఇలా తమకు జరిగిన అన్యాయం గురించి కేంద్రప్రభుత్వం దృష్టికి ఉద్యోగులు తీసుకువెళ్లిన నేపథ్యంలో వారికి న్యాయం చేకూరుస్తూ కేంద్రం 2004 జనవరి తరువాత జాయిన్ అయిన వారిని పాత పెన్షన్ పరిధిలోకి తీసుకువస్తూ మెమో విడుదల చేసింది. అలాగే 2003 డిసెంబర్ 22 నాటికి నోటిఫికేషన్ విడుదల అయి 2004 తర్వాత నియామకాలు జరిగి సీపీఎస్ విధానంలో కొనసాగుతున్న వారినందరినీ పాత పెన్షన్ పరిధిలోకి తీసుకు వెళ్లేలా ఉత్తర్వులు విడుదల చేయడం జరిగింది. పీఎఫ్ఆర్డిఏ చట్టం ప్రకారం కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే మార్పులు చేర్పులు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనుసరించవలసి ఉంటుంది. ఆ లెక్కన రాష్టంలో కూడా రాష్ట్రంలో సీపీఎస్ అమలు తేదీకి ముందు నోటిఫికేషన్ విడుదల అయిన నియామకం కాబడిన ఉద్యోగులను ఓపీఎస్ చేర్చాలి. కానీ వారిని సీపీఎస్ పరిధిలోకి వచ్చి అన్యాయం చేశారు. ఈ విషయమై రెండు దశాబ్దాలకు పైగా అనేక ధర్నాలు, ఉద్యమాలు, నిరసనలు చేసినప్పటికీ సమస్య సమస్యగానే మిగిలిపోవడం శోచనీయం. ప్రభుత్వాలు ఎన్ని మారినా సీపీఎస్ ఉద్యోగుల గోడు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు నూతన పెన్షన్ విధానం రద్దు కోసం చెయ్యని ధర్నా లేదు, కలవని పార్టీ లేదు. రద్దవడం మాట అటుంచితే ప్రభుత్వం దానిని రద్దు చేసే దిశగా ఆలోచన చేయడం మానేసి సరికొత్త స్కీంలను తీసుకురావడం విడ్డూరం.. ఆ కోవలో కేంద్ర ప్రభుత్వం యూనిఫైడ్ పెన్షన్ పథకం ప్రవేశపెట్టింది. ఇక రాష్ట్రాల్లోనైతే ప్రతీ ఐదేళ్ల కొకసారి రాజకీయ పార్టీలకు సీపీఎస్ విధానం రద్దుచేస్తామని తమ తమ మేనిఫెస్టోల్లో పెట్టుకొని ఉద్యోగుల ఓట్లు పొంది అధికారంలోకి వచ్చిన తదుపరి ఆ ఊసే ఎత్తక పోవడం పరిపాటిగా మారిపోయింది. కేవలం పంజాబ్, హర్యానా, ఛత్తీస్ ఘడ్, కర్ణాటక మొదలైన రాష్ట్రాలు నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాయి. ఈ నేపథ్యంలో మిగితా రాష్ట్రాలు కూడా ఆ దిశగా అడుగులు వేయాల్సిన ఆవశ్యకత ఉంది. కొత్త పెన్షన్ అమలు చేస్తున్న ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అధ్యయనం చెస్తే సీపీఎస్ రద్దు చేయడం సాధ్యమయ్యే ప్రక్రియే. ఈ రద్దు లక్షా అరవై వేల ఉద్యోగుల కుటుంబాలతో ముడిపడి ఉన్న అంశంగా ప్రభుత్వం పరిగణించి వెంటనే రద్దు దిశగా చర్యలు చేపట్టాలి. ప్రభుత్వం సమస్య తీవ్రతను అర్థం చేసుకోవాలి. రాష్ట్రోపాధ్యాయ సంఘం సీపీఎస్ రద్దును కోరుతూ 2018లోనే ఓరుగల్లు నడిబొడ్డున మహాధర్నా నిర్వహించి పాత పెన్షన్ ఆవశ్యకతను ప్రభుత్వానికి తెలియజేసింది. ఇక గత ఇరవై ఏళ్లుగా ఏటా సెప్టెంబర్ మొదటి తేదీన పెన్షన్ విద్రోహ దినంగా జరుపుతున్న నేటికి సీపీఎస్ విధానం రద్దుకాకపోవడం శోచనీయం. ప్రభుత్వాలు ఈ విధానం రద్దును ఒక రాజకీయ ప్రక్రియగా కాకుండా ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసాను కల్పించే దిశగా ఆలోచించి రద్దుకు చర్యలు చేపట్టాలి. తెలంగాణ ప్రభుత్వం కూడా ఎన్నికల సమయంలో పాత పెన్షన విధానాన్ని పునరుద్ధరిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలి. ఆ ప్రకారం ముందుగా కేంద్ర ప్రభుత్వం సూచించిన మాదిరిగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరిస్తూ

# బాలికా దినోత్సవం వెలుగులు నింపేనా!




జాతీయ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి 24న నిర్వహించబడుతుంది. సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై ఈ బాలికా దినోత్సవం రోజున అవగాహన కల్పిస్తారు. బాలికలపట్ల వివక్ష, అసమానత, చిన్నచూపు, లైంగిక వేదింపులు, అత్యాచారాల నుండి రక్షించడానికి కుటుంబం, మిత్రులు, సమాజం సన్నద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఆడపిల్ల అనగానే సమాజంలో చిన్నచూపు చూస్తున్నారు. అంతేకాకుండా కడుపులో బిడ్డ ఆడపిల్ల అని తెలియగానే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. పుట్టిన తరువాత అనేక ఆంక్షలు విధిస్తున్నారు. వాటిని నిర్మూలించి ఆడపిల్లలపై ప్రత్యేక దృష్టిసారించే దిశగా భారత ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్' పేరుతో ఒక కార్యక్రమం రూపొందించింది. అందులో భాగంగా 2008లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంతో జాతీయ బాలికా దినోత్సవంను ప్రారంభించడం జరిగింది. సమాజంలో బాలికలు ఎదుర్కొన్న సమస్యలు గురించి ప్రజలలో అవగాహన పెంచడానికి జరుపు కుంటారు. బాలిక శిశువు గురించి అసమానత్వం, విద్య, పోషణ, చట్టపరమైన హక్కులు, వైద్య సంరక్షణ, రక్షణ, గౌరవం, బాల్య వివాహంల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. బాలికల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్' పేరుతో ఓ కార్యక్రమం తెచ్చింది. బాలికల సంపూర్ణ ఎదుగుదల కోసం రకరకాల సదుపాయాలు కల్పిస్తోంది. వాటిలో భాగమే జాతీయ బాలికా దినోత్సవం. 2008 నుంచీ దీన్ని ఏటా నిర్వహిస్తోంది. సమాజంలో బాలికల సంరక్షణ, వాళ్ల హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై ఈ రోజున అవగాహన కల్పిస్తోంది. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక... "బేటీ బచావో బేటీ పడావో" స్కీం తెచ్చారు. తద్వారా బాలికల చదువు, పెంపకంపై మరిన్ని జాగ్రత్తలు తీసుకునేలా చేస్తున్నారు. సమాజంలో మహిళల హోదాను ప్రోత్సహించటానికి జరుపు కుంటారు. బాలికలు సాధారణంగా వారి జీవితంలో ఎదుర్కొనే వివిధ రకాల సాంఘిక వివక్ష, లైంగిక దోపిడీని నివారించడం అత్యవసరం. సమాజంలో మహిళల ప్రాదాన్యత, భాగస్వామ్యం గురించి అవగాహన పెంచడానికి, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, వివిధ రాజకీయ, సామాజిక, స్వచ్ఛంద సంస్థలు బాధ్యులు, సమాన విద్య, ప్రాథమిక స్వేచ్ఛ కోసం వివిధ కార్యక్రమాల ద్వారా వివరించడం జరుగుతుంది. బాలికల కంటే అబ్బాయిలకే ఎక్కువ ప్రాధాన్యత అధికంగా ఇవ్వడం సర్వత్రా వ్యక్తమవు తున్నది. ఇటీవల కాలంలో ఆడపిల్లగా పుట్టడం, పుట్టినా సురక్షితంగా మనుగడ సాగించడమే దుర్భరమైన దురవస్థ ఉంది. చైనా మొదలు అమెరికాతో సహా ఆధునికత వైపు అడుగులు వేస్తున్న భారత్‌లోనూ అమ్మాయిలపట్ల వివక్ష ఉంటుందని గ్లోబల్ ఎర్లీ అడలెసెంట్ స్టడీ పేరిట నిర్వహించిన ఒక అధ్యయనంలో భాగంగా... అమ్మాయిలు పదహారేళ్ల వయసుకు చేరుకున్నప్పటికీ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తేలింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, జాన్‌హాఫ్‌కిన్స్ బ్లూమ్ బెర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ కిడ్స్ సంయుక్తంగా 15 దేశాల్లో నిర్వహించిన సర్వేలో అమ్మాయిలు శారీరకంగా బలహీనులనే విషయం... చిన్న వయసులోనే ముద్ర పడేలా చేయడంలో తల్లిదండ్రులు, బంధువులు, మిత్రులు, టీచర్లు కీలకపాత్ర పోషిస్తున్నట్టు తేలింది. చిన్నారులపై లైంగిక వేధింపులు నేడు మహిళా సంఘాలు, ప్రభుత్వ యంత్రాంగం నిత్యం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా మైనర్లపై అత్యాచారాలు ఆగడంలేదు. సమాజంలో అమ్మాయిలు, మహిళలకు రక్షణ కరువ వుతున్నది. ఎంతోమంది ఆడ పిల్లలు ఈ లోకంలో అడుగుపెట్టక ముందే బలవంతపు మరణాలకు బలవు తున్నారు. ఆధునిక పరిజ్ఞానం ఎంత పెరిగినా మానవతా విలువలు మాత్రం పెరగడం లేదు. దానికి నిదర్శనం భ్రూణ హత్యలు. గర్భస్త శిశువుల లింగ నిర్ధారణను నిషేధించి తద్వారా ఆడపిల్లల భ్రూణ హత్యలు నివారణ కోసం 1994లోనే చట్టం తెచ్చినా అది ఏనాడూ పకడ్బందీగా అమలైన జాడలు లేవు. దేశంలో నానాటికీ అడపిల్లల సంఖ్య తగ్గిపోతూ, కొనసాగితే చాలా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందనేది కాదన లేని వాస్తవం. ఇదే కాక ప్రపంచంలో జరుగుతున్న బాల్య వివాహాల్లో 40% పైగా భారతదేశం లోనే జరుగుతున్నాయని ఇటీవలే యూనిసెఫ్ గణాంకాలను వెల్లడించింది. బాలికల ఉన్నత విద్య మరో సమస్యగా మారింది, ఇప్పటికి అధిక రాష్ట్రాల్లో 40%నికి పైగా పదో తరగతి కంటే ముందే బడి మాని వేస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్ని కార్యక్రమాలు చేసినా ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా, ఉన్నత విద్యలో డ్రాపౌట్స్ తగ్గడంలేదు. బాల్య వివాహం కారణంగా రాష్ట్రంలోని 28 శాతం మంది బాలికలకు పద్దెనిమిది సంవత్సరంలోపే వివాహాలు చేస్తున్నారు. యునెస్కో వెలువరించిన ప్రపంచ విద్య నివేదిక ప్రకారం భారత దేశంలో వయోజన నిరక్షరాస్యులలో మహిళలు 68 శాతం వున్నారు. పంతొమ్మిది ఏళ్లు నిండక ముందే దాంపత్య జీవితంలో అడుగు పెడుతున్నారు. బాలికల సంఖ్య 41 శాతం అని జనగణనలో తేలింది. బాల్య వివాహాలు, పాఠశాలలు చేరువ, అందుబాటులో పూర్తి స్థాయిలో లేకపోవడం, బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్ల కొరత, లైంగిక విచక్షణ వంటి సమస్యలు భారతావనిలో బాలిక విద్యకు శాపంగా పరిణ మించింది. పోషకాహార లోపం కారణంగా రక్తహీనతతో బాధపడుతున్న బాలికల సంఖ్య దేశంలో దాదాపు డెబ్బై శాతం అన్న అంచనాలు తీవ్రంగా కలవర పరుస్తున్నాయి. మహిళా కార్మిక శక్తి, వారి ఆదాయం, అక్షరాస్యాత స్థాయి, జననాల విషయం, తదితర అంశాల్లో అధమస్థాయిలో వున్న 20 దేశాల్లో మన దేశం ఒకటి కావడం ఆందోళనకర అంశం. మహిళలు పురుషులకన్నా ఎందులోనూ తక్కువ కాదు. ఆడపిల్లలు ప్రతి రంగంలో, చదువులో మొదలుకుని ఆటల దాకా, రాణిస్తున్నారు. పురుషులతో పోటీ పడుతున్నారు. బాలికలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలియ చేయడమే కాకుండా, ఆ సమస్యలు పరిష్కరించ బడినప్పుడు జరిగే పరిణామాల గురించి కూడా అవగాహన పెంచడానికి ఈ దినోత్సవం ఉపయోగ పడుతున్నది. ఆడపిల్లలకి తప్పనిసరి అవసరమైన భద్రత, సాంకేతిక విజ్ఞానాన్ని సేవల్ని అందుబాటులో వుంచాలి. బాలికలను విద్యావంతులను చేసి, బాల్య వివాహాలు తగ్గించడంలో, విద్యను అభ్యసించిన బాలికలు అధిక వేతనాలతో ఉద్యోగాలు పొందడంలో మార్గదర్శకంగా నిలవడం ద్వారా మహిళత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కూడా సహాయ పడు తున్నది. ప్రపంచ వ్యాప్తంగా బాల్య వివాహాల్లో నలభై శాతంకి పైగా భారత్‌లోనే జరుగుతున్నాయన్న చేదు నిజాన్ని యునిసెఫ్ స్పష్టం చేసింది. సమాజంలో చైతన్యం నింపాలంటే ముందు మహిళ జాగృతం కావాలి. స్త్రీ కళ్లు తెరిస్తే కుటుంబం, దానితో పాటు గ్రామం, రాష్ట్రం, దేశం పురోగతి బాట పడతాయి' అని భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గతంలో చేసిన వ్యాఖ్యలు గుర్తుంచు కోవాలి. కౌమారదశలో ఆడపిల్లలు, యువతులు ఎదుర్కొనే వివిధ రకాల హింసను అంతం చేయాలి. బాలికలు వారి చట్టపరమైన హక్కులు మరియు జీవిత వాస్తవాలను గురించి తెలుసు కోవాలి. వారు మంచి విద్య, పోషణ, ఆరోగ్య సంరక్షణ హక్కులను కలిగి ఉంటారని అవగాహన కల్పించాలి. గృహ హింస చట్టం 2009, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ 2006 నిషేధించడం మరియు కట్న నిషేధ చట్టం 2006 వంటి చట్టాల గురించి వారి సరైన హక్కులు పొందడానికి మరియు జీవితంలో అన్ని సవాళ్లను ఎదురుకొని ముందుకు వెళ్ళాలి.

# తెలుగు సినిమా స్వర్ణయుగ రారాణి



కృష్ణకుమారి (మార్చి 6, 1933 – జనవరి 24, 2018) పాత తరం సినిమా కథానాయిక. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో సుమారు 25 సంవత్సరాలకు పైగా 150 పై చిలుకు చిత్రాల్లో నటించారు. మూడు జాతీయ పురస్కారాలు, రాష్ట్ర ప్రభుత్వ నంది పురస్కారాలు అందుకున్నారు. సావిత్రికి సమకాలీన నటి అయిన ఆమె షావుకారి జానకికి సొంత చెల్లెలు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్,, కృష్ణ, శివాజీ గణేశన్ వంటి దిగ్గజాలతో ఆమె అనేక సినిమాల్లో నటించారు. పశ్చిమ బెంగాల్ లోని నైహతిలో ఓ తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో 1933లో జన్మించారు కృష్ణ కుమారి. వెంకోజి రావు, సచీ దేవి ఆమె తల్లిదండ్రులు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి వీరి స్వస్థలం. వేదాంతం జగన్నాథ శర్మ దగ్గర శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నారు. ఒకసారి ఆమె తల్లితో సహా స్వప్న సుందరి సినిమా చూడడానికి వెళితే అక్కడకి సౌందరరాజన్ గారి అమ్మాయి భూమాదేవి కూడా వచ్చింది. సినిమా హాల్లో కృష్ణ కుమారిని చూసిన ఆమె నవ్వితే నవరత్నాలు సినిమా కోసం అమా యకంగా కనిపించే కథా నాయిక కోసం వెతుకుతున్నట్లు చెప్పారు. తర్వాత రోజే వారు కృష్ణ కుమారి ఇంటికి వచ్చి తల్లిదండ్రుల అను మతి తీసుకొని ఆమెకు ఆ పాత్ర నిచ్చారు. అలా తెలుగు సినిమా తెరకు 1951 లో నిర్మించిన నవ్వితే నవరత్నాలు సినిమా ద్వారా పరిచయం అయ్యా రు. కానీ దానికంటే ముందు మంత్ర దండం అనే సినిమా విడుదలైంది. తొలి చిత్రంలో నటిస్తుండగానే ఆమెకు 14 సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. అప్పటికి ఆమె వయసు కేవలం 16 ఏళ్ళు మాత్రమే. తర్వా త 1953లో తాతినేని ప్రకాశరావు యన్.ఎ.టి.వారి పిచ్చి పుల్లయ్యలో కథానాయిక వేషం వేయించారు. అందులో మంచి నటన ప్రదర్శించిన కృష్ణకుమారికి పినిశెట్టిగారి పల్లె పడుచు, బంగారు పాప వంటి మంచి చిత్రాలతో పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. జానపద చిత్రాల కథానాయికగా, అభినయ రాజకుమారిగా తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సొంతం చేసుకున్నారు నటి కృష్ణకుమారి. అసమాన నటన తో ఎన్నో వైవిధ్యమైన పాత్రలకు ప్రాణప్రతిష్ట చేసిన ఆమె తెలుగు చిత్రసీమలో విలక్షణ నటిగా తనకంటూ ప్రత్యేకతను చాటు కున్నారు. తరువాత ఇలవేల్పు, జయ విజయ, అభిమానం, దేవాం తకుడు మొదలైన చిత్రాలలో వివిధ కథానాయకుల సరసన నటించినా, తన నటనకు గుర్తింపుతెచ్చిన చిత్రా లు కె.ప్రత్యగాత్మగారి భార్యాభర్తలు (1961), కులగోత్రాలు (1962). 1963లో లక్షాధికారి, బందిపోటు, ఎదురీత, కానిస్టేబుల్ కూతురు చిత్రాల్లో వైవిధ్యం ఉన్న పాత్రలు వేశారు. ప్రభుత్వ బహుమతి పొందిన జగపతీ పిక్చర్స్ వారి అంతస్థులులో నాయికగా నటిం చారు. 1967–68 మధ్య కాలంలో ఉమ్మడి కుటుంబం, భువన సుందరి కథ, రహస్యం, చిక్కడు దొరకడు, స్త్రీ జన్మ వంటి చిత్రాలలో వైవిధ్యమున్న పాత్రలు పోషించారు. వరకట్నంలో నాయికగా గ్లామరస్ పాత్ర తర్వాత చిత్రాలు తగ్గి 1970 దశాబ్దంలో కొన్ని చిత్రాలలో నటించ గలిగారు. సుమారు రెండు దశాబ్దాల నట జీవితంలో ఆమె సుమారు 150 సినిమాలలో నటించారు. వాటిలో ఎక్కువగా తెలుగు సినిమాలైతే, 15 కన్నడ చిత్రాలు, కొన్ని తమిళ భాషా చిత్రాలు. మూడు భాషల చిత్రా ల్లోనూ ఆమే స్వయంగా డబ్బింగ్ చెప్పు కోవడం విశేషం. ఆమె ఆనాటి నందమూరి తారక రామారావు, అక్కినేని నాగేశ్వర రావు, కాంతారావు, కృష్ణంరాజు, జగ్గయ్య, హరనాథ్, అందరు మహా నటులతోను నటించి మెప్పించారు. కాంతారావుతో కలిసి 28 జానపద చిత్రాల్లో నటించారు. 1963 లో కృష్ణ కుమారి 16 సినిమాల్లో కథానాయి కగా నటించారు. ఒక్క ఏడాదిలో అత్యధిక సినిమాల్లో కథానాయికగా నటించడంలో ఆమె రికార్డు ఇప్పటికీ పదిలంగా ఉంది. ఇందు కోసం ఆమె మూడు నెలలపాటు మూడు షిఫ్టులు ఖాళీ లేకుండా పనిచేశారు. బాలీవుడ్ లో కిశోర్ కుమార్ తో ఒకే ఒక సినిమాలో కథానాయికగా నటించారు. అప్పటికి హిందీ చిత్ర పరిశ్రమలో కృష్ణకుమారి పేరుతో వేరే నటి ఉండటంతో రతి అనే పేరుతో పరిచయం అయినారు. వద్దంటే పెళ్లి, గంగా గౌరీ సంవాదం, సతీ సుకన్య, రమా సుందరి, జయ విజయ, పెళ్లి కానుక, దేవాంత కుడు, వినాయక చవితి, ఇరుగు పొరుగు, అగ్గిపిడుగు, మర్మయోగి, ఉమ్మడి కుటుంబం, లక్షాధికారి, బందిపోటు, బంగారు భూమి, గుణవంతుడు, జేబుదొంగ, యశోద కృష్ణ, దేవదాసు, నేరము శిక్ష, మానవుడు దానవుడు, భార్య బిడ్డలు, తల్లా పెళ్లామా, శ్రీకృష్ణావ తారం, అంతస్తులు, గుడి గంటలు, డాక్టర్ చక్రవర్తి, చదువుకున్న అమ్మా యిలు ఎదురీత, కులగోత్రాలు, భార్యాభర్తలు, శభాష్‌రాజా, దీపా వళితో పాటు పలు సినిమాలు ఆమె నటనా ప్రతిభకు తార్కా ణాలుగా నిలిచాయి. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ మాజీ ఎడిటర్, స్క్రీన్ మేగజైన్ వ్యవ స్థాపకులు, బిజినెస్ మాన్ అయిన కర్ణాటకకు చెందిన అజయ్ మోహన్ ఖైతాన్ ను కృష్ణ కుమారి పెళ్లి చేసు కున్నారు. ఆమెకు చిన్నప్పటి నుండి భానుమతి అంటే చాలా ఇష్టం. ఆమెతో కలిసి కులగోత్రాలు, పుణ్య వతి సినిమాల్లో నటించినపుడు ఎంతో థ్రిల్ ఫీలయ్యానని, మహా నటి సావిత్రి తనను స్వంత చెల్లెల్లా చూసుకొనేదని చేపుతుండే వారు. ఆమెకు మూడుసార్లు జాతీయ అవార్డులు, రాష్ట్రస్థాయిలో నంది అవార్డులు వచ్చాయి. ఆమె కాంచన మాల, సావిత్రి, ఎన్టీయార్ అవార్డులు గెలుచుకున్నారు. బ్రిటన్ లోని బర్మింగ్ హాం సంస్థ వారి లైఫ్ టైం అచీవ్‌ట్ అవార్డు పొందారు. కృష్ణ కుమారి 2018, జనవరి 24 ఉదయం బెంగుళూరులో అనారోగ్యంతో మరణించారు.

# గణతంత్ర వేడుకల్లో 'ఆపరేషన్ సిందూర్' శకటం



దేశ రాజధాని ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో ఈసారి శకటాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సైనికదళాలు ఆపరేషన్ సిందూర్ శకటాన్ని ప్రదర్శించనున్నాయి. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన సైన్యం పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. భీకర వైమానికదాడులతో బెంబేలెత్తిపోయిన దాయాది దేశం కాళ్లబేరానికి వచ్చి కాల్పుల విరమణ ఒప్పందం చేసుకుంది. ఆపరేషన్ సిందూర్ భారత ఆయుధ సంపత్తితోపాటు త్రివిధ దళాల పరాక్రమాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. ఈ నేపథ్యంలో గణతంత్ర వేడుకల పరేడ్‌లో ఆపరేషన్ సిందూర్ శకటాన్ని సైనిక బలగాలు ప్రదర్శించనున్నాయి. "ఆపరేషన్ సిందూర్‌ను ఈ శకటం ద్వారా ప్రదర్శించబోతున్నాం. కేవలం 88 గంటల్లో పాకిస్థాన్‌పై ఎలా విజయం సాధించామో చెప్పబోతున్నాం. ప్రధాన టార్గెట్లను ధ్వంసం చేశాం. మొదటిరోజు రాత్రి 9 ఉగ్రస్థావరాలపై దాడులు చేసిన విషయాన్ని చూపబోతున్నాం. గగనతల రక్షణకు ఉద్దేశించిన ఎల్-70 గన్స్, ఆకాశ్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. ఆర్టిలరీ ఆయుధాలు, మొదటిరోజే ఉపయోగించిన రఫేల్ ఫైటర్లను శకటంలో ఏర్పాటు చేశాం. బ్రహ్మోస్ క్షిపణుల ద్వారా పాక్ వైమానిక స్థావరాలు, హ్యాంగర్లు, ఎయిర్‌క్రాఫ్ట్‌లు, రన్‌వేలను ధ్వంసం చేశాం. ఎస్-400 క్షిపణి అత్యంత దూరంలో ఉన్న పాకిస్థాన్‌కు చెందిన ఏడబ్ల్యూసీ ఎయిర్‌క్రాఫ్ట్‌ను ధ్వంసం చేసింది. 300కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని ఛేదించింది." అని సైనిక కమాండర్ మనీశ్ పేర్కొన్నారు.

మరోవైపు ఈ ఏడాది జరగబోయే గణతంత్ర వేడుకల కోసం పోలీసులు ఈసారి అత్యాధునిక సాంకేతికతను వినియోగించనున్నారు. దేశంలో ఉగ్ర దాడులు చేసేందుకు పాకిస్థాన్ ప్రణాళిక రచిస్తున్నట్లు నిఘా సంస్థలు హెచ్చరించిన వేళ పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేస్తున్నారు. అందులో భాగంగా అత్యంత ఆధునాతన ఏఐ ఆధారిత కళ్లజోళ్లను ఢిల్లీ పోలీసులు తొలిసారిగా గణతంత్ర దినోత్సవాల్లో ఉపయోగించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఫేషియల్ రికగ్నిషన్, థర్మల్ ఇమేజింగ్ వంటి అత్యాధునిక టెక్నాలజీలు కలిగి ఉన్న ఈ స్మార్ట్ గ్లాసెస్ ద్వారా అనుమానితుల కదలికలపై పోలీసులు నిరంతర నిఘా పెట్టనున్నారు. ఈ కళ్లజోళ్ల ద్వారా పోలీసుల మొబైల్ ఫోన్లకు నేరగాళ్ల డేటాబేస్ అనుసంధానమై ఉంటుంది. రద్దీ ప్రాంతాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే, వారి ముఖాలను స్కాన్ చేసి క్షణాల్లో వారి వివరాలను అందిస్తాయి.

కళ్లజోడు ధరించిన పోలీసు అధికారికి నేర చరిత్ర లేని వ్యక్తి కనిపిస్తే మొబైల్‌లో 'గ్రీన్ బాక్స్' కనిపిస్తుంది. ఒకవేళ పోలీసు రికార్డుల్లో ఉన్న నేరగాడు అయితే వెంటనే 'రెడ్ బాక్స్' కనిపిస్తూ హెచ్చరిస్తుంది. దీనివల్ల భౌతిక తనిఖీలు లేకుండానే, క్షణాల్లో నేరస్థులను గుర్తించి అదుపులోకి తీసుకునే అవకాశం ఉంటుంది. ఒక నేరగాడు 20 ఏళ్ల క్రితం ఫోటో పోలీసు రికార్డుల్లో ఉండి ఇప్పుడు తన రూపాన్ని మార్చుకున్నా ఈ కళ్లజోడు నేరస్థులను గుర్తుపడుతుందని అడిషనల్ పోలీస్ కమీషనర్ దేవేష్ కుమార్ తెలిపారు. ముఖాలను గుర్తించడమే కాకుండా ఈ కళ్లజోడుకు ఉన్న 'థర్మల్ ఇమేజింగ్' టెక్నాలజీ ద్వారా దుస్తుల లోపల దాచుకున్న ఇనుప వస్తువులు, మారణాయుధాలను కూడా ఇవి పసిగట్టగలవని చెప్పారు. కానిస్టేబుల్ స్థాయి అధికారి నుంచి ఈ కళ్లద్దాలను వాడుతారని తెలిపారు. పోలీస్ పెట్రోలింగ్ వాహనాల్లో కూడా ాా× ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థను అమరుస్తామని వెల్లడించారు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు కంటికి కనిపించని ముప్పును గుర్తించడానికి ఈ కళ్లజోళ్లు బాగా ఉపయోగపడుతాయని పేర్కొన్నారు.

వర్షాన్ని లెక్కచేయకుండా కవాతు కొనసాగిస్తోన్న సైన్యం

మరోవైపు, గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఢిల్లీలో పరేడ్ కోసం భారత త్రివిధ దళాలు సిద్ధమౌతున్నాయి. ఈ సందర్భంగా కర్తవ్యపథ్‌లో భారీ సన్నాహాలు జరుగుతున్నాయి. ఓ వైపు వర్షం కురుసి నేల జారుడుగా మారినప్పటికీ, సైనిక దళాలు మాత్రం కవాతును ఆపలేదు. వర్షంలో తడిసిన యూనిఫాం, బూట్లతోనే సైనిక బృందాలు సాధన చేశాయి. గుర్రాలు, ట్యాంకర్లు సహా ఆయా బృందాలు వర్షాన్ని లెక్కచేయకుండా ముందుకు సాగడం, వివిధ ఆర్మీ కంటింజెంట్లు కవాతు చేయడంతో ఆ ప్రాంతమంతా దేశభక్తి గీతాలతో మార్మోగింది.

# 'మోదీ చరిత్రను వక్రీకరిస్తున్నారు



భారత ప్రధాని నరేంద్ర మోదీ 'చరిత్రను వక్రీకరించే వ్యక్తి' అంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 129వ జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన ప్రధానిపై అనేక విమర్శలు చేశారు. గత నెలలో పార్లమెంటు వేదికగా 'వందేమాతరం' గీతంపై జరిగిన చర్చలో మోదీ చరిత్రను వక్రీకరించారని, రవీంద్రనాథ్ ఠాగూర్‌కు అపఖ్యాతి తెచ్చేలా వ్యవహరించారని ఆయన మండిపడ్డారు. అంతేకాకుండా, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడం ద్వారా, జాతిపిత మహాత్మా గాంధీ జ్ఞాపకాలను, వారసత్వాన్ని మోదీ తుడిచిపెట్టేస్తున్నారని ఆరోపించారు.

### అసలేం జరిగింది?

జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా ప్రధానిపై విరుచుకుపడ్డారు. "గత నెలలో పార్లమెంటులో జాతీయ గేయంపై చర్చ జరిగింది. ఆ సమయంలో ప్రధాని, ఆయన సహచరులు వాస్తవాలను వక్రీకరించారు. గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడారు. కానీ చివరికి వారి బండారం బయటపడింది. ప్రధాని ఉద్దేశపూర్వకంగానే చరిత్రను తప్పుదోవ పట్టిస్తున్నారు. అందుకే ఆయన దేశంలోనే 'గ్రేటెస్ట్ డిస్టోరియన్' (చరిత్రను వక్రీకరించేవాడు)" అని జైరాం రమేశ్ ఘాటుగా విమర్శించారు.

### నేతాజీ పాత్రను దాచిపెట్టారు

నేతాజీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని జైరాం రమేశ్ కొన్ని చారిత్రక అంశాలను ప్రస్తావించారు. "1937లో వందేమాతరం గీతంలోని తర్వాతి చరణాలపై ఒక వివాదం నడిచింది. ఆ వివాదాన్ని పరిష్కరించడంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ కీలక పాత్ర పోషించారు. కానీ పార్లమెంటు చర్చలో ప్రధాని మోదీ ఈ విషయాన్ని ఉద్దేశపూర్వకంగానే దాచిపెట్టారు. ప్రజలకు నిజాలు తెలియకుండా చేశారు" అని ఆరోపించారు.

### జనగణమన, జై హింద్

నేతాజీకి సంబంధించిన మరికొన్ని ఆసక్తికర విషయాలను ఆయన గుర్తు చేశారు. ప్రముఖ చరిత్రకారుడు, నేతాజీ మనవడు సుగత బోస్ రాసిన విషయాలను జైరాం రమేశ్ ఉదాహరించారు. 1942 నవంబర్ 2న బెర్లిన్‌లో 'ఫ్రీ ఇండియా సెంటర్'ను నేతాజీ ప్రారంభించారు. అక్కడే ఆయన 'జనగణమన'ను జాతీయ గీతంగా ఎంపిక చేశారు. అలాగే 1943 అక్టోబర్ 2న సింగపూర్‌లో ఆజాద్ హింద్ ప్రభుత్వ నినాదంగా 'జై హింద్'ను ఎంచుకున్నారు. "దురదృష్టవశాత్తు ప్రధాని మోదీ గానీ, ఆయన పార్టీ నేతలు గానీ ఎప్పుడూ 'జై హింద్' అనే నినాదాన్ని నోటితో పలకరు. స్వాతంత్ర్య సమర యోధుల స్ఫూర్తిని వారు విస్మరిస్తున్నారు" అని విమర్శించారు.


### 'మహాత్ముడిని చంపేస్తున్నారు'

గాంధీజీ వారసత్వంపై మోదీ సర్కార్ దాడి చేస్తోందని కాంగ్రెస్ మండిపడింది. "1944 జూలై 6న సింగపూర్ రేడియో నుంచి మాట్లాడుతూ, నేతాజీ తొలిసారిగా మహాత్మా గాంధీని 'జాతిపిత' అని సంబోధించారు. కానీ నేటి ప్రధాని మోదీ, ఆ జాతిపిత ఆశయాలను సమాధి చేస్తున్నారు. గాంధీ పేరును ప్రజల జ్ఞాపకాల నుంచి చెరిపేయాలని చూస్తున్నారు. ఉపాధి హామీ పథకం రద్దు చేయడమే ఇందుకు తాజా నిదర్శనం. ఇది గాంధీ వారసత్వాన్ని దెబ్బతీయడమే" అని జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### వందేమాతరంపై రచ్చ

గత నెలలో జరిగిన పార్లమెంటు సమావేశాల్లో 'వందేమాతరం' గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రోజంతా చర్చ జరిగింది. ఈ చర్చలో అధికార, విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. జాతీయవాదం అంశంపై మాటల యుద్ధం నడిచింది. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ వాద్రా ఈ చర్చలో పాల్గొని బీజేపీకి గట్టి కౌంటర్ ఇచ్చారు. నెహ్రూ విధానాలను సమర్థించుకుంటూనే, మోదీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. అలాగే బీజేపీ వ్యూహాన్ని కాంగ్రెస్ బయటపెట్టింది. "వచ్చే ఏడాది బంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో లబ్ధి పొందడానికే బీజేపీ ఇప్పుడు వందేమాతరం చర్చను తెరపైకి తెచ్చింది. చరిత్రను వక్రీకరించి ఓట్లు దండుకోవాలని చూస్తోంది. దీనికి రాజకీయ రంగు పులుముతోంది" అని విపక్షాలు ఆరోపించాయి. మరోవైపు కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోందని అధికార పక్షం ఎదురుదాడి చేసింది.

## డబ్ల్యూహెచ్ఓకు బకాయిపడిన అమెరికా




కరోనా మహమ్మారిని అదుపు చేయడంలో, సంస్కరణలను అమలు చేయడంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) విఫలమైందని ఆరోపిస్తూ అమెరికా ఆ సంస్థ నుంచి వైదొలిగింది. ఈ మేరకు అమెరికా ఆరోగ్య, మానవ సేవల విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇక నుంచి డబ్ల్యూహెచ్ఓకు అమెరికా నుంచి వెళ్లే అన్ని రకాల నిధులను నిలిపివేస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్యాలయాల నుంచి తమ దేశ సిబ్బందిని వెనక్కి పిలిపించినట్లు తెలిపింది.

డబ్ల్యూహెచ్ఓ సంస్థకు సంబంధించిన సాంకేతిక కమిటీలు, వర్కింగ్ గ్రూపుల నుంచి కూడా వైదొలుగుతున్నట్లు అమెరికా స్పష్టం చేసింది. అయితే, పరిమిత పరిధిలో డబ్ల్యూహెచ్ఓతో కలిసి పని చేయడానికి అవకాశం ఉంటుందని అమెరికా ఆరోగ్య శాఖ అధికారులు వెల్లడించారు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఈ సంస్థ నుంచి వైదొలుగుతామని పలుమార్లు హెచ్చరించారు. తాజాగా, అమెరికా అధికారికంగా డబ్ల్యూహెచ్ఓ నుంచి వైదొలుగుతూ కీలక నిర్ణయం తీసుకుంది.

### డబ్ల్యూహెచ్ఓకు బకాయిపడిన అమెరికా

డబ్ల్యూహెచ్ఓ నుంచి వైదొలిగే సమయానికి అమెరికా ఆ సంస్థకు భారీ మొత్తంలో బకాయి పడింది. 260 మిలియన్ డాలర్ల బకాయిలను అమెరికా డబ్ల్యూహెచ్ఓకు చెల్లించాల్సి ఉందని బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. ఇది భారతీయ కరెన్సీలో సుమారు రూ.2,382 కోట్లు. ఈ బకాయిని పూర్తిగా చెల్లించే వరకు డబ్ల్యూహెచ్ఓ నుంచి అమెరికా ఉపసంహరణ పూర్తి కాదని ఆ సంస్థ అధికారులు పేర్కొన్నారు. అయితే, సంస్థ నుంచి వైదొలగడానికి ముందు బకాయిలు చెల్లించాలనే నిబంధన ఏమీ లేదని అమెరికా అధికారులు స్పష్టం చేశారు.

## ఆ ఊరికి కరెంట్ బిల్లు రాదు
## ప్రభుత్వమే తిరిగి వాళ్లకు డబ్బులిస్తుంది

సాధారణంగా నెల తిరిగేసరికి కరెంట్ బిల్లు చూసి సామాన్యుడు హడలిపోతాడు. విద్యుత్ బిల్లులు కట్టలేక సతమతమవుతాడు. కానీ, ఆ ఊరిలో మాత్రం కరెంట్ బిల్లు శూన్యం. అసలు బిల్లు కట్టే పనే లేదు. పైగా కరెంట్ వాడినందుకు ప్రభుత్వమే ఆ ఊరి జనాలకు ఎదురు డబ్బులు ఇస్తోంది. వినడానికి ఆశ్చర్యంగా ఉంది కదూ? కానీ ఇది నిజం. గుజరాత్‌లోని బనస్కాంత జిల్లాలో ఉన్న 'రూపపుర' గ్రామం ఇప్పుడు దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. అక్కడ సూర్యుడే ఇప్పుడు సిరిసంపదలు కురిపిస్తున్నాడు. ఆ ఊరి తలరాతను సోలార్ పవరే మార్చేసింది. పల్లాన్‌పుర్ తాలూకాలోని రూపపుర గ్రామం బనస్కాంత జిల్లాలోనే పూర్తిగా సౌరశక్తిని వినియోగించుకుంటున్న తొలి గ్రామంగా రికార్డు సృష్టించింది. ఒకరిని చూసి ఒకరు, ఇలా ఊరంతా సోలార్ బాట పట్టింది. ఇప్పుడు గ్రామంలోని 90 శాతం ఇళ్లు, పొలాల వద్ద ఉన్న ఫామ్ హౌస్‌ల పైన సోలార్ ప్యానెల్స్ దర్శనమిస్తున్నాయి. సంప్రదాయ విద్యుత్ స్థానంలో సౌర విద్యుత్ వాడకం అక్కడ సర్వసాధారణమైపోయింది. పెరిగిన ధరలు, కరెంట్ చార్జీలతో సామాన్యుడి బతుకు భారంగా మారింది. ఈ ఆర్థిక భారం నుంచి బయటపడటానికి రూపపుర వాసులు తెలివైన నిర్ణయం తీసుకున్నారు. ఇళ్లపై సోలార్ సిస్టమ్స్ పెట్టుకున్నారు. దీంతో కరెంట్ బిల్లుల బాధ పూర్తిగా తప్పింది. కేవలం బిల్లు మిగలడమే కాదు, తాము వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయిస్తున్నారు. ఫలితంగా ఏడాదికి ఒక్కో కుటుంబం రూ.5,000 నుంచి రూ.7,000 వరకు అదనపు ఆదాయాన్ని పొందుతోంది. వాళ్ల ఖాతాల్లో ప్రభుత్వమే డబ్బులు జమ చేస్తోంది. ఈ మార్పు రాత్రికి రాత్రే రాలేదు. విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామస్థులతో ప్రత్యేకంగా 'గ్రామ సభ' నిర్వహించారు. సోలార్ ఎనర్జీ వల్ల కలిగే లాభాలను వివరించారు. అధికారులు చెప్పిన మాటలు గ్రామస్థులకు నచ్చాయి. ఒక్కొక్కరుగా సోలార్ ప్యానెల్స్ బిగించుకోవడం మొదలుపెట్టారు. ఇప్పుడు ఊరంతా సోలార్ మయమైంది. సాధారణంగా 3.30 కిలోవాట్ల సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోవాలంటే సుమారు రూ.1.50 లక్షల వరకు ఖర్చవుతుంది. అయితే ఇందులో ప్రభుత్వం భారీ సబ్సిడీని అందిస్తోంది. ఏకంగా రూ.78,000 వరకు రాయితీ ఇస్తోంది. దీంతో వినియోగదారుడు కేవలం రూ.70,000 నుంచి రూ.80,000 చెల్లిస్తే సరిపోతుంది. ఇక్కడే 'బనస్ డెయిరీ' రూపంలో రైతులకు అదృష్టం కలిసొచ్చింది. చేతిలో డబ్బులు లేని పాడి రైతుల కోసం డెయిరీ యాజమాన్యం అద్భుతమైన స్కీమ్ తెచ్చింది. గ్రామంలోని పాడి రైతులకు 90 శాతం మొత్తాన్ని రుణం రూపంలో అందించింది.

## ఇరాన్ పై కమ్ముకుంటున్న యుద్ధ మేఘాలు...




మధ్యప్రాచ్యంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయా? అంటే అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో పాల్గొన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇరాన్ లక్ష్యంగా మరోసారి తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ తమ అణు కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే, అమెరికా నుంచి మరోసారి భీకర దాడులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన స్పష్టం చేశారు. అణు ఆయుధాల తయారీకి ఇరాన్ ప్రయత్నిస్తే సహించేది లేదని, అవసరమైతే సైనిక చర్యకు వెనుకాడబోమని ట్రంప్ తేల్చిచెప్పారు.

### సైనిక మోహరింపుతో ఉద్రిక్తత

ట్రంప్ హెచ్చరికలకు తగ్గట్టుగానే క్షేత్రస్థాయిలో అమెరికా సైనిక కదలికలు వేగవంతమయ్యాయి. అత్యాధునిక యుఎస్ఎస్ అబ్రహం లింకన్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ స్ట్రైక్ గ్రూప్‌ను అమెరికా అరేబియన్ సముద్రం/పర్షియన్ గల్ఫ్ దిశగా తరలిస్తోంది. దీనికి తోడు ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగల్ జెట్‌లు, గగనతలంలోనే ఇంధనం నింపే కేసీ-135 ఎయిర్‌క్రాఫ్ట్‌లను అమెరికా సిద్ధం చేసింది. ఇరాన్ క్షిపణి దాడులను సమర్థంగా ఎదుర్కొనేందుకు థాడ్ (ుూూుూఱ), పేట్రియాట్ వంటి శక్తివంతమైన యాంటీ మిస్సైల్ సిస్టమ్స్‌ను మధ్యప్రాచ్యంలో మోహరించారు. ఇజ్రాయెల్, ఖతార్ వంటి మిత్రదేశాల్లో కూడా రక్షణ వ్యవస్థలను అమెరికా మరింత పటిష్టం చేయడం గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతకు అద్దం పడుతోంది.

### అణు కేంద్రాలపై ఆందోళన

గత ఏడాది జూన్‌లో అమెరికా ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు జరిపిన సంగతి తెలిసిందే. ఫోర్డో అణు కేంద్రంపై జరిగిన బంకర్ బస్టర్ దాడుల తర్వాత అక్కడి నుంచి సుమారు 400 కిలోల సుసంపన్న యురేనియం అదృశ్యమైందన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత ఏడు నెలలుగా అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (×ూజూూ) తనిఖీలు నిలిచిపోవడంతో ఇరాన్ రహస్యంగా అణు ఆయుధాలను తయారు చేస్తోందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి.

### శాంతి చర్చలకు అవకాశం ఉందా?

యుద్ధ వాతావరణం కనిపిస్తున్నప్పటికీ, ట్రంప్ 'బోర్డ్ ఆఫ్ పీస్' అనే కొత్త అంతర్జాతీయ సంస్థను ప్రకటించడం ఆసక్తికరంగా మారింది. గాజా సమస్యతో పాటు ప్రపంచ వ్యాప్తంగా శాంతి స్థాపనకు ఈ సంస్థ కృషి చేస్తుందని ఆయన చెప్పారు. అయితే, ఇరాన్ తన ప్రాక్సీల ద్వారా హోర్ముజ్ జలసంధిలో నౌకలను అడ్డుకోవడం లేదా ప్రతీకార దాడులకు దిగడం వంటివి చేస్తే పరిస్థితి చేజారిపోయే ప్రమాదం ఉంది. ఇజ్రాయెల్ కూడా తమ ఐరన్ డోమ్, అరో సిస్టమ్స్‌తో అప్రమత్తంగా ఉంది. మొత్తానికి ట్రంప్ మాటల్లో బెదిరింపులు ఉన్నప్పటికీ, చర్చలకు కూడా దారులు తెరిచే ఉంచినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

## ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధం: ఇరాన్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఇరాన్ ఖండించింది. తన జోక్యం వల్లే ఇరాన్‌లో 800 మందికిపైగా నిరసనకారుల ఉరిశిక్షలు ఆగిపోయాయని ట్రంప్ పేర్కొనడంపై ఇరాన్ న్యాయవ్యవస్థకు చెందిన అగ్ర ప్రాసిక్యూటర్ మొహమ్మద్ మొవాహెది తీవ్రంగా స్పందించారు. ట్రంప్ వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధాలని ఆయన స్పష్టం చేశారు. నిరసనకారులకు సామూహికంగా మరణ శిక్షలు విధించాలనే నిర్ణయమే ఇరాన్ ప్రభుత్వం ఎప్పుడూ తీసుకోలేదని మొవాహెది తెలిపారు. ఎవరికీ ఉరిశిక్షలు విధించలేదని, అరెస్టయిన వారి సంఖ్య కూడా ట్రంప్ చెప్పినంత పెద్దగా లేదన్నారు. ఈ విషయంలో తప్పుడు వార్తలు, తప్పుదారి పట్టించే ప్రకటనలు ప్రచారం చేయొద్దని అంతర్జాతీయ మీడియాను ఆయన కోరారు. ఇదే అంశంపై ట్రంప్ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్‌లో వందల మంది నిరసనకారులకు విధించబోయే ఉరిశిక్షలను అమెరికా ఒత్తిడి కారణంగా అక్కడి అధికారులు రద్దు చేశారని వ్యాఖ్యానించారు. తాను జోక్యం చేసుకోకపోయి ఉంటే 800 మందికి పైగా ప్రాణాలు కోల్పోయేవని, తీవ్ర చర్యలు తీసుకుంటామని హెచ్చరించడంతో ఇరాన్ పాలకవర్గం వెనక్కి తగ్గిందని ట్రంప్ తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను ఇరాన్ ప్రభుత్వం పూర్తిగా ఖండిస్తూ, అవి వాస్తవానికి దూరమని స్పష్టం చేసింది.

## డీఎంకే పార్టీకి కౌంట్‌డౌన్ మొదలైంది



**చెన్నై:** డీఎంకే పార్టీకి కౌంట్‌డౌన్ మొదలైందని.. తమిళ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ప్రధాని మోదీ అన్నారు. శుక్రవారం ఆయన తమిళనాడులో ఎన్డీఏ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. చెన్నై సమీపంలోని మదురాంతకం వద్ద జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ.. తమిళనాడులో ఎన్డీఏ గెలుపు ఖాయం అంటూ ధీమా వ్యక్తం చేశారు. డీఎంకేను సీఎంసీ ప్రభుత్వం(అవినీతి, మాఫియా, క్రైమ్) అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. తమిళనాడు ప్రజలు ఈ పార్టీని వేరులతో సహా పెకిలించి మార్పు కోసం ఓటు వేయాలని నిర్ణయించుకున్నారంటూ మోదీ వ్యాఖ్యానించారు. వారసత్వ రాజకీయాలపై మోదీ మాట్లాడుతూ.. డీఎంకే ప్రభుత్వం కేవలం ఒకే కుటుంబం కోసం పనిచేస్తోందని విమర్శించారు. 2014 కంటే ముందు కేంద్రంలో కాంగ్రెస్, డీఎంకే అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన నిధుల కంటే, తమ ప్రభుత్వం తమిళనాడుకు మూడు రెట్లు ఎక్కువ నిధులు కేటాయించిందని మోదీ గుర్తుచేశారు. స్టాలిన్ ప్రభుత్వంలో డ్రగ్స్, మద్యం మాఫియాలు పెరిగిపోయాయంటూ ఆరోపించారు. ఎన్డీయేకు వేసే ప్రతి ఓటు తమిళనాడును మాదకద్రవ్యాల ముప్పు నుంచి విముక్తి చేస్తుందంటూ మోదీ చెప్పుకొచ్చారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీయే అధికారంలో ఉంటే (డబుల్ ఇంజిన్ ప్రభుత్వం) పెట్టుబడులను ఆకర్షించడం సులభమవుతుందన్నారు. దివంగత నేత జయలలిత హయాంలో శాంతిభద్రతలు, మహిళా రక్షణ బాగుండేదని.. ప్రస్తుత డీఎంకే ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందంటూ ప్రధాని మోదీ ఆరోపించారు.

# ఏఐ ఆవిష్కరణల అమలుకు 'ఐకమ్'

-మొదటిపేజీ తరువాయి

మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, ఐటీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్‌కుమార్, ఐకమ్ వ్యవస్థాపక సీఈవో ఫణి నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ప్రయోగాలతోపాటు ఆయా ఆవిష్కరణల అమలుకు కూడా అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ప్రపంచం ఏఐ పైలట్ దశ నుంచి విస్తృత అమలు దశలోకి మారుతున్న తరుణంలో బాధ్యతాయుతంగా, పారదర్శకంగా కృత్రిమ మేధను ఉపయోగించుకునే వేదికగా తెలంగాణను మేం ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అమలుకు ఒక ప్రయోగ వేదికగా తెలంగాణను నిలిపే లక్ష్యంతో రూపొందించిన తొలితరం సంస్థగా 'ఐకమ్' నిలుస్తుందని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్య సాధనకు వ్యూహాత్మక దిశ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఐకమ్ ద్వారా అది సాధ్యమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది భవిష్యత్ ఉద్యోగాలను సృష్టిస్తుందని రేవంత్ వివరించారు. భారత్‌ను టెక్నాలజీ వినియోగదారుడిగానే కాకుండా సృష్టికర్తగానూ మారుస్తుందని' అని సీఎం రేవంత్‌రెడ్డి విశ్వాసం వ్యక్తంచేశారు.

"ప్రపంచవ్యాప్తంగా అనేక ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) పాలసీలున్నాయి. పలు దేశాలు ఇప్పటికే ఏఐ మిషన్‌లను ప్రకటించాయి. వాటిలో చాలావాటికి సాధారణ లోపం ఒకటుంది. అదే అమలుకు అవసరమైన సంస్థాగత నిర్మాణం లేకపోవడం. 'ఐకమ్' ఆ లోపాన్ని భర్తీ చేస్తుంది. ఇది ఒక డిపార్ట్‌మెంట్ కాదు ఏకీకృత ఎకోసిస్టమ్. ఇది ఒక ల్యాబ్ కాదు విస్తృత జనాభా ప్రాతిపదికన సేవలందించే వేదిక. కృత్రిమ మేధపై ప్రయోగాల దశను దాటి జనాభా స్థాయికి తగ్గట్టుగా ఈ సాంకేతికతను అమలు చేసే సామర్థ్యాన్ని కలిగిన భారత సంస్థగా ఇది గుర్తింపు పొందుతుంది" – రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

**ఆలోచనల నుంచి ప్రపంచ స్థాయి పరిష్కారాల వరకు :**
అనంతరం ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఆలోచనల నుంచి ప్రపంచ స్థాయి పరిష్కారాల దాకా స్పష్టమైన అమలు మార్గాన్ని 'ఐకమ్' అందిస్తుందని వివరించారు. ప్రభుత్వ వ్యవస్థలో ఉండి కూడా స్వయంప్రతిపత్తితో పనిచేసే దీని నిర్మాణం ప్రజల విశ్వాసాన్ని చూరగొంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఎజెంటిక్ ఏఐ యుగంలో బాధ్యతాయుత స్వయంప్రతిపత్తి' అనే అంశంపై నిర్వహించిన చర్చకు ఐకమ్ వ్యవస్థాపక సీఈవో నాగార్జున కోఆర్టినేటర్‌గా వ్యవహరించారు.

**ఇవీ ఐకమ్ లక్ష్యాలు :**
భారీ స్థాయిలో ఏఐ స్కిల్ డెవలప్‌మెంట్
ఏఐ-ఫస్ట్ స్టార్టప్‌ల వేగవంతమైన అభివృద్ధి
పరిశోధన-ఇండస్ట్రీల మధ్య బలమైన అనుసంధానం
భారీ డేటాసెట్‌లు, అత్యాధునిక కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల కల్పన

పలు వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు : ఐకమ్' ఆవిష్కరణ సందర్భంగా దావోస్‌లో ప్రపంచస్థాయి సంస్థలతో కృత్రిమ మేధ ఆధారిత అంశాలపై వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలు కుదిరాయి.

పియర్సన్ : బ్రిటన్‌కు చెందిన ప్రముఖ ఎడ్యుకేషన్, పబ్లికేషన్ సంస్థ ఇది. ప్రపంచ ప్రమాణాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అకాడమీగా దీనికి గుర్తింపు ఉంది. ఈ ఒప్పందం ద్వారా ఏఐ శిక్షణ, పాఠ్యప్రణాళిక, లెర్నింగ్ కంటెంట్, అంచనా విధానాలు, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికేషన్లలో తన స్కిల్స్‌ను పియర్సన్ ఉపయోగించనుంది.

దుబాయ్ మల్టీ కమోడిటీస్ సెంటర్(డీఎంసీసీ) : ఇది తెలంగాణ–దుబాయ్ స్టార్టప్ కారిడార్. ఈ ఎంఓయూ ద్వారా రెండు దేశాల స్టార్టప్‌లకు సంబంధించిన అభివృద్ధికి అవకాశాలను అన్వేషించనున్నారు. రెండు దేశాల మార్కెట్లు, ఎకో సిస్టమ్‌లపై అవగాహన కల్పిస్తారు.

బ్లేజ్ ఇంక్ : అత్యాధునిక ఏఐ కంప్యూటింగ్ ఆర్‌అండ్‌డీ(పరిశోధన అభివృద్ధి) కేంద్రం

ఏఐ కోల్యాబ్(మెడ్‌స్టార్–జార్జ్‌టౌన్) : హెల్త్‌కేర్ అండ్ లైఫ్ సైన్సెస్ పరిశోధన

జర్నీ: ఏఐ ఆధారిత డిజైన్ అండ్ ఇమర్సివ్ డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్

# మేడారం మహాజాతరకు సర్వం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

చెల్లిస్తున్నారు. భక్తులు తరలి వస్తారని అంచనాతో పోలీస్ శాఖ దర్శనం సందర్భంలో భద్రత, రద్దీ నియంత్రణ తదితర అంశాలకు ప్రాధాన్యమిచ్చి మరి ప్రణాళికలు తయారు చేసింది. ఈ ఏడాది జాతర ఏర్పాట్లలో సాంకేతికతకు పెద్దపీట వేయడం గమనార్హం. జాతర విధుల్లో పోలీసు శాఖది కీలక పాత్ర ఉంది. ఈ జాతర ముగిసే వరకు 25 మంది ఐపీఎస్‌ల పర్యవేక్షణలో 13 వేల మంది సిబ్బంది పని చేయనున్నారు. ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో మేడారంలో రామగుండం సీపీ పర్యవేక్షణలో గద్దెలు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, జాతర కోర్ ఏరియాలో భక్తుల రద్దీ నియంత్రణ విభాగాలు పని చేసేలా కసరత్తు చేశారు. అలాగే జాతరలో పాత నేరస్థుల సంచారం, తప్పిపోయిన వారి గుర్తింపు, దర్శన సందర్భంలో రద్దీ, ట్రాఫిక్ సమస్యలను గుర్తించేలా కృత్రిమ మేధతో సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. వీటన్నింటి కోసం 20 డ్రోన్ కెమెరాలు, 450 సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూంతో అనుసంధానించి నిఘా ఉంచుతున్నారు.



**సౌకర్యాలు ఇలా :**
ఇక్కడ గతంలో ఏకకాలంలో అమ్మవార్ల గద్దెలను 2000 మంది దర్శించుకుంటే ప్రాంగణం రద్దీగా మారేది. కాని ఇప్పుడు ప్రాంగణం విస్తరణతో ఒకేసారి 8-9 వేల మంది దర్శించుకునే సదుపాయం అందుబాటులోకి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు.

గతంలో సమ్మక్క-సారలమ్మ గద్దెల పక్కన పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలుండేవి. భక్తులు ఆ ప్రాంగణం లోపల వెనక్కి ముందుకు తిరిగేవారు. పునర్నిర్మాణంతో గద్దెలన్నీ ఒకే వరుసలోకి రావడంతో ఆ సమస్య వస్తుందని చెబుతున్నారు.

జాతరలో భక్తుల రద్దీ అనుగుణంగా ప్రైవేటు వాహనాలకు ఊరట్టం గ్రామం వద్ద 33 పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు. అలాగే గద్దెలకు సమీపంలోనే ఆర్టీసీ బస్టాండ్, వీఐపీ వావానాలకు పార్కింగ్ సౌకర్యం ఉంటుంది. జాతర తేదీల్లో 3 లక్షల వాహనాలొచ్చినా నిలిపేందుకు సుమారుగా 2 వేల ఎకరాల స్థలాన్ని సిద్ధం చేశారు. గత సంవత్సరం కంటే ఈ సారి 500 బస్సులు పెంచనున్నారు. మహిళలకు ఆధార్ గుర్తింపుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగుతుంది.

మొబైల్ సిగ్నల్ కోసం బీఎస్ఎన్ఎల్ 10 తాత్కాలిక టవర్లను ఏర్పాటు చేసింది.

మేడారం మహాజాతరకు చేరుకొనే మార్గంలో 39 చోట్ల రహదారులను అభివృద్ధి చేశారు. అంతేకాదు తాడ్వాయి, పస్రా, బయ్యక్కపేట మార్గాల్లో ఇరుకు రోడ్లను విస్తరించారు. మేడారంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించారు. జంపన్న వాగు వద్ద ఆధునికీకరించారు.


మేడారంలోని రెండు 33/11 కేవీ విద్యుత్తు ఉప కేంద్రాల సామర్థ్యాన్ని పెంచారు. నార్లాపూర్ వద్ద మరో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మించారు. విద్యుత్ కోసం 259 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. జంపన్నవాగు పై నుంచి వెళ్లే లైన్ల కోసం ఎత్తయిన టవర్లను కూడా నిర్మించారు.

ప్రాంతాల వారీగా ఇలా వెళ్తె మరింత సులువుగా :
ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్, మెదక్, వరంగల్ ప్రాంతాల వారంతా ములుగు, పస్రా మీదుగా రావాలి.
ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల వాసులు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాటారం, తాడ్వాయి మండలం కాల్వపల్లి మీదుగా మేడారం సమీప ఊరట్టం స్తూపం వద్దకు చేరుకోవాలి.
మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ సహా భద్రాద్రి కొత్తగూడెం నుంచి వచ్చే వారు ఏటూరునాగారం వైపు నుంచి కొండాయి మీదుగా వెళ్లాలి.
ఇక తిరుగు ప్రయాణంలో వరంగల్ వైపు వెళ్లే వాహనాలు ములుగు మీదుగా కాకుండా బయ్యక్కపేట మీదుగా భూపాలపల్లి వైపు నుంచి మళ్లించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు.

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చొరవ.. మేడారం జాతరకు నిధులు విడుదల**
ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగ మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చొరవతో కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ, గిరిజన మంత్రిత్వశాఖలు రూ.3.70కోట్లు విడుదల చేశాయి. మేడారం చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో పర్యాటకాన్ని ప్రోత్సహించడం కోసం గిరిజన సర్క్యూట్ పేరిట గతంలో రూ. 80 కోట్లతో ఆయా ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించింది. యునెస్కో గుర్తింపు లభించిన రామప్ప దేవాలయ అభివృద్ధి కోసం రూ.140 కోట్లు ఖర్చు చేస్తోంది. అమ్మవార్లకు బంగారం సమర్పించి మొక్కులు తీర్చుకోవడానికి రాష్ట్రం నలుమూలల నుంచి, చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం జాతర జరిగే నాలుగు రోజుల పాటు దక్షిణ మధ్య రైల్వే 30 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది.

# రాజకీయ రంగుపులుముకున్న నైనీ కోల్ మైన్స్

**హైదరాబాద్ :** నైనీ కోల్ మైన్స్ టెండర్ల విషయంలో సింగరేణి కీలక నిర్ణయం తీసుకుంది. ఇవాళ్టి నుంచి తీసుకోవాల్సిన బిడ్స్ ని రద్దు చేస్తు నట్లు ప్రకటించింది. పాలనాపరమైన కారణాలతో టెండర్లు రద్దు చేసినట్లు చెప్పింది. నిబంధనలు, టెండర్లపై పాలక మండలిలో మరోసారి చర్చిస్తామని ఆ తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని సింగరేణి అధికారులు తెలియజేశారు. ఇటు నైనీ కోల్ బ్లాక్ టెండర్ల విషయంలో సింగరేణి పాలక మండలిని కేంద్ర బొగ్గు గనుల శాఖ ప్రశ్నించింది. సంస్థ విధించిన నిబంధనలపై పాలక మండలి ఎందుకు చర్చించలేదని అడిగింది. చర్చించి ఉంటే టెండర్ల విషయంలో అవినీతి ఆరోపణలు ఎందుకు వస్తున్నాయని, టెండర్ వేయాలనుకున్న కంపెనీలకు ఎందుకు సైట్ విజిట్ ధృవీకరణ పత్రాలు ఇవ్వడం లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ అడిగింది. నిబంధనలు, టెండర్లపై పాలక మండలిలో చర్చించి మరోసారి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు సింగరేణి అధికారులు. కాగా.. బొగ్గు బ్లాక్ ల టెండర్ల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. నైనీ కోల్ మైన్స్ టెండర్స్ విషయంలో బీఆర్ఎస్, బీజేపీ సంచలన ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే.తెలంగాణలో బొగ్గు గనుల టెండర్లపై రాజకీయ వివాదం చెలరేగింది. నైనీ బొగ్గు గని టెండర్ నోటిఫికేషన్ ప్రభుత్వం రద్దు చేయడంతో ఒక్కసారిగా కోల్ వార్ మొదలైంది. నోటిఫికేషన్ రద్దుపై సీబీఐ విచారణ జరిపించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. సీఎం రేవంత్ కి, బీజేపీకి చీకటి ఒప్పందం జరిగిందని.. అందుకే రద్దు చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. సీఎం రేవంత్



బావమరిదికి లబ్ధి చేకూర్చేందుకే సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన తెచ్చారని హరీశ్ రావు అంటున్నారు. బొగ్గు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే హరీశ్ రావుకి నోటీసులు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు.సింగరేణి చుట్టూ రాజకీయ వివాదం చెలరేగింది. బొగ్గు గనుల కేటాయింపులపై బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. ఒడిశాలోని నైనీ బొగ్గు గనుల టెండర్లతో వివాదం మొదలైంది. రేవంత్ రెడ్డి బావమరిదికి లబ్ధి కలిగించేందుకే తెలంగాణ ప్రభుత్వం టెండర్ల నిబంధనల్లో మార్పులు చేసిందని బీఆర్ఎస్ ఆరోపించింది. సైట్ విజిట్ సర్టిఫికెట్ అనే కొత్త విధానం తెచ్చి గ్లోబల్ టెండర్లలో పాల్గొంటున్న వారి వివరాలు తెలుసుకుని వారు టెండర్లలో పాల్గొనకుండా చేసి రేవంత్ రెడ్డి బావమరిదికి టెండర్లు దక్కేలా తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని బీఆర్ఎస్ ఆరోపించింది. అందులో భాగంగానే నైనీ బొగ్గు గనుల కేటాయింపు టెండర్లను భట్టి విక్రమార్క రద్దు చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు.నైనీ బొగ్గు గనుల టెండర్ల రద్దుతో పాటు ఇతర బొగ్గు గనుల కేటాయింపులపై సీబీఐ విచారణకు బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ బావమరిది టెండర్ల విషయాన్ని బయటపెట్టినందుకే ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్ రావుకి నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు.

## కాంగ్రెస్‌లో దండుపాళ్యం ముఠా

**హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసు అంతులేని కథలా సాగుతోందని.. నోటీసులు, విచారణ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ డ్రామాలు ఆడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. ఈ కేసులో సిట్ విచారణ బయల్దేరే ముందు తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు, కీలక నేతలతో భేటీ అయ్యారాయన. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వం రాజకీయ డ్రామా ఆడుతోంది. ఉద్యమంలోంచి పుట్టిన పార్టీ బీఆర్ఎస్. ఎన్నికేసులు పెట్టినా భయపడకుండా పోరాడిన నాయకత్వం మా పార్టీది. రాష్ట్రం కోసం రాజీలేని పోరాటాలు చేశాం. అనుక్షణం ప్రజలు, రాష్ట్రం కోసమే పని చేశాం. ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ఘనత కేసీఆర్‌ది. కావాలనే బురద చల్లడం, హింసించడం మేం ఏనాడూ చేయలేదు. మేం ఎప్పుడూ టైం పాస్ కార్యక్రమాలు చేయలేదు అని కేటీఆర్ అన్నారు. పిచ్చోడి చేతిలో రాయిలా.. అసమర్థుడి జీవన యాత్రలా కాంగ్రెస్ పాలన ఉంది. ఒక్కో రోజు ఒక్కో డ్రామాతో నెట్టుకొస్తున్నారు. మేం ఎప్పుడూ తప్పుడు పనులు చేయలేదు. అక్రమ, అనైతిక పనులు చేయలేదు. అయినా నాపై తీవ్ర వ్యక్తిత్వ హననం చేస్తున్నారు. ఇందుకు ఎవరు బాధ్యులు? రేవంతా? అధికారులా?. నేను డ్రగ్స్ తీసుకుంటానని.. హీరోయిన్లతో సంబంధాలు ఉన్నాయని దిక్కుమాలిన వార్తలు రాయిస్తున్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పదేళ్లపాటు రాష్ట్రం కోసం చిత్తశుద్ధితో పని చేశా. ప్రభుత్వం పోలీసులు కలిసి గత రేండేళుగా.. అంతులేని కథలా ఫోన్ ట్యాపింగ్ కేసును నడిపిస్తున్నారు. ఎంక్వైరీలకు భయపడేది లేదు. ఈ కేసుతో నాకేం సంబంధం లేదు. అయినా పిలిస్తే 10సార్లు విచారణకు వెళ్తా.. సింగరేణిలో వేల కోట్ల కుంభకోణం జరిగిందని హరీష్‌రావు చెప్పారు. ఆ కుంభకోణంలో సీఎం రేవంత్‌రెడ్డి బామర్ది సృజన్ రెడ్డిది కీలక పాత్ర. సింగరేణితో సీఎం రేవంత్ ఎలా ఫుట్‌బాల్ ఆడుతున్నారో హరీష్ వివరించారు. అలా మాట్లాడినందుకే నోటీసులు ఇచ్చారు. సిట్ నోటీసులు, విచారణ టైంపాస్ ప్రొగ్రాం అని కేటీఆర్ అన్నారు. మా ప్రభుత్వం ఏం తప్పు చేసిందని అడుగుతున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఫోన్ ట్యాపింగ్ జరగడం లేదని చెప్పగలరా?. కాంగ్రెస్ ప్రభుత్వంలో దండుపాళ్యం ముఠా ఉంది. వాళ్ల దోపిడీ బయటపెడతామనే నోటీసులు, విచారణ పేరిట ఇబ్బంది పెడుతున్నారు. రేవంత్‌కు, ఆయన తొత్తులుగా ఉన్న పోలీసులను వదిలేది లేదు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ విధానాలను ప్రశ్నిస్తూనే ఉంటాం.. అని కేటీఆర్ అన్నారు.

## సొంత పార్టీ నేతల ఫోన్లనూ ట్యాప్ చేసిన ఘనత బీఆర్ఎస్‌దే

-మొదటిపేజీ తరువాయి

చెబుతున్నారు" అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

**బీఆర్ఎస్‌పై దయాకర్ తీవ్ర విమర్శలు**
జైలుకు వెళ్లాలని బీఆర్ఎస్ నేతలకు బాగా ఉబలాటంగా ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఎద్దేవా చేశారు. "తెలంగాణలో ఎన్నికలంటే డబ్బులు, ప్రలోభాలు ఉండాలనే విధంగా బీఆర్ఎస్ తయారు చేసింది. మీరు చేసిన పాపాలు, తప్పిదాలపై మరో ఐదేళ్లు విచారణ చేసినా సమయం సరిపోదు. డ్రోన్ కేసులో రేవంత్‌రెడ్డిని జైలుకు పంపారు. ప్రొఫెసర్ కొదండరామ్ ఇంటి తలుపులు బద్దలు కొట్టి అరెస్ట్ చేశారు. మేమెప్పుడూ రాజకీయ క్షక్ష సాధింపునకు పాల్పడలేదు. సిట్ అధికారులు, పోలీసులను కేటీఆర్ బెదిరిస్తున్నారు. అనైతిక రాజకీయాలు చేస్తున్నారు" అని విమర్శించారు.

**కేటీఆర్, హరీశ్‌పై బల్మూరి వెంకట్ ఫిర్యాదు**
మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ సందర్భంగా పోలీసు అధికారులను వారిద్దరు బెదిరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.


## పెట్టుబడుల వేటలో రేవంత్



**హైదరాబాద్ :** ఏ రాష్ట్రానికి అయినా సరే పెట్టుబడులు చాలా అవసరం. ఎందుకంటే పెట్టుబడుల ద్వారానే ఆదాయం సమకూరుతూ ఉంటుంది. ఉద్యోగాలను కల్పించే అవకాశం ఉంటుంది. ఆర్థికంగా రాష్ట్రాన్ని బలోపేతం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ పెట్టుబడుల కోసమే ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి దావోస్ వెళ్లిపోయారు?దావోస్ ప్రాంతంలో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఆయన పాల్గొంటున్నారు. తెలంగాణలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. స్కిల్ డెవెలప్మెంట్, స్పోర్ట్స్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలతో మూడు జోన్ల నమూనాలను దావోస్ వేదికపై ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు విశ్లేషించారు. క్యూర్, ప్యూర్, రేర్ ఆర్థిక అభివృద్ధి వ్యూహంతో పాటు భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ సిటీ నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుగా, దేశంలో సుస్థిర అభివృద్ధికి రోల్ మోడల్ సిటీగా నిలుస్తుందని శ్రీధర్ బాబు అభిప్రాయం వ్యక్తంచేశారు.తెలంగాణ సమగ్రాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక అద్భుత ఫలితాలను ఇస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఏరోస్పేస్, డిఫెన్స్, బయో-డిజైన్, సాఫ్ట్‌వేర్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్ పరిపూర్ణ అనుకూలతలున్నాయని వివరించారు. కాలుష్యాన్ని తగ్గించే విధంగా ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధనంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టిందని పొంగులేటి శ్రీనివాసరెడ్డి దావోస్ వేదికపై పారిశ్రామిక వేత్తలకు తెలిపారు.తెలంగాణ రైజింగ్ పేరుతో ఆయన పెట్టుబడులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో 23 వేల కోట్ల పెట్టుబడిలను పెట్టేందుకు అనేక సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంది. డక్టైల్ ఐరన్ పైపుల తయారీలో ప్రపంచ వ్యాప్తంగా పేరున్న రష్మీ గ్రూపు తెలంగాణ రాష్ట్రంలో 12,500 కోట్ల పెట్టుబడితో స్టీలు ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేయనుంది. స్లొవేకియ దేశానికి చెందిన న్యూక్లర్ ప్రొడక్ట్ సంస్థ 6000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. స్మాల్ మాడ్యూల్ రియాక్టర్ ఆధారిత విద్యుత్ ప్రాజెక్టు ను తెలంగాణలో ఏర్పాటు చేయబోతోంది.సౌందర్య ఉత్పత్తుల తయారీలో పేరు ఎన్నికల లోరియల్ అనే సంస్థ 3500 కోట్ల పెట్టుబడితో గ్లోబల్ టెక్ హబ్ ను తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయబోతోంది. అమెరికాలో విమానయాన రంగంలో పేరుపొందిన సర్గార్డ్ అనే సంస్థ.. దశలవారీగా 1 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది.. ఇందులో భాగంగా అనేక సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకోనుంది. రష్మీ గ్రూప్ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో 12,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగాలు వస్తాయని తెలుస్తోంది.ప్రపంచవ్యాప్తంగా బీర్లను తయారు చేసే అతిపెద్ద కంపెనీగా పేరు తెచ్చుకున్న ఏబి ఇన్ బెవ్.. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న తన తయారీ యూనిట్ ను మరింత విస్తరించబోతోంది. దీనికోసం భారీగా పెట్టుబడులు పెట్టబోతోంది. తద్వారా వేలాది మందికి ఉపాధి లభించబోతోంది. బ్లైజ్ అనే సంస్థ వ్యవస్థాపకుడు దినకర్ మునగాల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇప్పటికే తమ సంస్థ ఆధ్వర్యంలో రీసెర్చ్ డెవలప్మెంట్ సెంటర్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.. త్వరలోనే హెల్త్ కేర్ డయాగ్నస్టిక్స్, మ్యానుఫ్యాక్చరింగ్, ఆటో మేషన్, ఎనర్జీ ఎఫిషియన్సీ వంటి రంగాలలో పెట్టుబడులు పెడతామని దినకర్ వెల్లడించారు. గత ఏడాది జరిగిన సదస్సులో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం భారీగా పెట్టుబడులను ఆకర్షించింది. ఈసారి కూడా అదే స్థాయిలో పెట్టుబడులను ఆకర్షిస్తున్నది.

ధర్మఘంట

# జీవనశైలిలో ఈ మార్పులే గుండెకు శ్రీరామరక్ష!



నేటి ఉరుకుల పరుగుల జీవితంలో అనారోగ్యం దరిచేరకుండా ఉండాలంటే జీవనశైలిలో మార్పులు తప్పనిసరని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనం పాటించే సరైన అలవాట్ల వల్ల దాదాపు 90 శాతం జబ్బులను దరిచేరకుండా నియంత్రించవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు. కేవలం మందుల ద్వారానే కాకుండా, క్రమశిక్షణతో కూడిన దినచర్యను అలవరచుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని తాజా పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి శారీరక శ్రమ అత్యంత కీలకమైన అంశం. వారానికి కనీసం మూడు నుండి నాలుగు సార్లు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీనితో పాటు ప్రతిరోజూ 10 వేల అడుగుల నడకను లక్ష్యంగా పెట్టుకోవడం వల్ల గుండె సంబంధిత సమస్యలు దరిచేరవు. నడక అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు, అది శరీరంలోని ప్రతి అవయవానికి పునరుత్తేజాన్ని ఇచ్చే ఒక అద్భుతమైన ప్రక్రియ. శరీరానికి అవసరమైన శక్తిని అందించడంలో నిద్ర, సూర్యరశ్మి ప్రధాన పాత్ర పోషిస్తాయి. ప్రతిరోజూ నిర్ణీత సమయానికి నిద్రపోవడం వల్ల మెదడు చురుగ్గా పని చేయడమే కాకుండా, శరీర కణాలు మరమ్మత్తుకు గురవుతాయి. ఉదయాన్నే లేత ఎండలో కొద్దిసేపు నిలబడటం వల్ల శరీరానికి అవసరమైన విటమిన్-డి అందుతుంది. ఇది ఎముకల పుష్టికి, రోగనిరోధక శక్తి పెంపొందించడానికి ఎంతో దోహదపడుతుంది. మనం తీసుకునే ఆహారం, నీరు మన ఆరోగ్యానికి పునాదులు వంటివి. ప్రతిరోజూ పోషకాలతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి కావాల్సిన ప్రోటీన్లు, విటమిన్లు అందుతాయి. అలాగే రోజుకు కనీసం మూడు లీటర్ల నీరు తాగడం వల్ల శరీరంలోని మలినాలు బయటకు వెళ్లిపోయి, చర్మం మరియు అంతర్గత అవయవాలు శుద్ధి చేయబడతాయి. వీటన్నింటితో పాటు మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్రతిరోజూ ధ్యానం (మెడిటేషన్) చేయడం ఎంతో అవసరం.

# అరటిఆకు భోజనం ఎందుకు మంచిది



అరటి ఆకు భోజనం తెలుగు వారికి కొత్తేమీ కాదు. మన దేశంలో ముఖ్యంగా దక్షిణాదిలో అనేక ప్రాంతాలలో ఈ ఆచారం చాలా కాలంగా కొనసాగుతోంది. ముఖ్యంగా దక్షిణ, ఆగ్నేయాసియాలో అరటి ఆకులను ఆహారాన్ని భుజించడానికి విస్తృతంగా ఉపయోగిస్తారు. అరటి ఆకులు సాంప్రదాయకంగానే కాకుండా ఆరోగ్యానికి కూడా చాలా ప్రయోజనకరంగా భావిస్తారు. అరటి ఆకులు పెద్దగా, వెడల్పుగా ఉంటాయి. వేడి ఆహారాన్ని వాటిపై వడ్డించినప్పుడు అవి తేలికపాటి, సహజమైన వాసనను వెదజల్లుతాయి. ఇది ఆహారాన్ని మరింత సువాసనగా, రుచికరంగా చేస్తుంది. ఈ వాసన తినే వారికి ఆనందాన్ని పెంచడమే కాకుండా జీర్ణక్రియకు కూడా సహాయపడుతుంది. అరటి ఆకులలో పాలీఫెనాల్స్ అనే సహజ యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి గ్రీన్ టీ, కొన్ని పండ్లలో కూడా కనిపిస్తాయి. వేడి ఆహారాన్ని ఆకులపై ఉంచినప్పుడు ఈ పోషకాలు ఆహారంలో కరిగిపోతాయి. వీటిల్లోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి సహాయపడతాయి. ఇది క్యాన్సర్, గుండె జబ్బులు, మధుమేహం వంటి తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అరటి ఆకులు యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కూడా కలిగి ఉంటాయి. ఆకుల ఉపరితలంపై ఉండే కొన్ని సహజ సమ్మేళనాలు హానికరమైన బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధిస్తాయి. ఇది ఫుడ్ పాయిజనింగ్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆహారాన్ని సురక్షితం చేస్తుంది. అరటి ఆకుల బయటి పొర జీర్ణక్రియకు సహాయపడే సహజ మైనపు పదార్థాన్ని కలిగి ఉంటుంది. వేడి ఆహారాన్ని ఆకులపై ఉంచినప్పుడు ఈ పొర కొద్దిగా కరిగి, జీర్ణక్రియకు సహాయపడే పదార్థాలను ఆహారంలోకి విడుదల చేస్తుంది. ఈ ప్రక్రియ జీర్ణవ్యవస్థను బలోపేతం చేస్తుంది. కడుపును శుభ్రంగా ఉంచడంలో సహాయపడుతుంది. ప్లాస్టిక్ లేదా సింథటిక్ ప్లేట్లతో పోలిస్తే అరటి ఆకులు పూర్తిగా సహజమైనవి, రసాయన రహితమైనవి. వాటిలో సాధారణంగా ప్లాస్టిక్‌లలో కనిపించే ఃఖం లేదా థాలేట్‌ల వంటి హానికరమైన రసాయనాలు ఉండవు. అందువల్ల ఆహారంలో విషపూరిత రసాయనాలు కలిపే ప్రమాదం లేదు. అరటి ఆకులలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, పాలీఫెనాల్స్ రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడతాయి. అలాగే దాని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు శరీరంలోకి హానికరమైన బ్యాక్టీరియా ప్రవేశించకుండా నిరోధిస్తాయి. తద్వారా ఇన్ఫెక్షన్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. శరీర రక్షణను పెంచుతాయి. అరటి ఆకులు ఆరోగ్యానికి మాత్రమే కాకుండా పర్యావరణానికి కూడా చాలా మేలు చేస్తాయి. అవి పూర్తిగా జీవఅధోకరణం చెందుతాయి. పర్యావరణానికి వ్యర్థాలను మిగిలించవు. అలాగే అరటి ఆకులపై వడ్డించిన వేడి ఆహారం సహజ వాసన తినే అనుభవాన్ని మరింత ఆహ్లాదకరంగా మారుస్తుంది. జీర్ణక్రియను కూడా మెరుగుపరుస్తుంది.

# పండ్లు, జ్యూస్.. ఆరోగ్యానికి ఏది మంచిది?



ఆరోగ్యంగా ఉండాలని మనం ప్రతిరోజూ ఒక గ్లాసు పండ్ల రసం తాగుతుంటాం. పండ్ల నుంచి వచ్చేదే కాబట్టి ఇది మన శరీరానికి ఎంతో మేలు చేస్తుందని నమ్ముతాం. కానీ, నిజంగా జ్యూస్ తాగడం వల్ల పండు తిన్నంత ప్రయోజనం ఉంటుందా? ముఖ్యంగా డయాబెటిస్ ఉన్నవారికి పండ్ల రసం వరం కంటే శాపంగా మారే అవకాశం ఉందా? ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న ఈ రోజుల్లో చాలామంది ఫ్రూట్ జ్యూస్ తాగడం చాలా ఆరోగ్యకరమని భావిస్తుంటారు. ముఖ్యంగా షుగర్ ఉన్నవారు కూడా పండ్ల రసాలను ఎంచుకుంటూ ఉంటారు. అయితే పండ్లను రసంగా తీసుకోవడం కంటే.. పండును నేరుగా తినడమే శరీరానికి వంద రెట్లు మేలు చేస్తుందని డైటీషియన్లు హెచ్చరిస్తున్నారు. రక్తంలో చక్కెర పెరుగుదల: పండ్లను జ్యూస్ చేసినప్పుడు అందులోని సహజ చక్కెరలు శరీరానికి చాలా వేగంగా చేరుతాయి. ముఖ్యంగా మార్కెట్లో దొరికే ప్యాక్డ్ జ్యూస్‌లు తాగినప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలు అకస్మాత్తుగా పెరుగుతాయి. ఇది డయాబెటిస్ రోగులకు అత్యంత ప్రమాదకరం.పీచు పదార్థం కోల్పోవడం: పండ్ల వల్ల కలిగే అతిపెద్ద ప్రయోజనం ఫైబర్. జ్యూస్ తీసే ప్రక్రియలో ఈ ఫైబర్ దాదాపు పూర్తిగా తొలగిపోతుంది. ఫైబర్ లేకపోవడం వల్ల చక్కెర నేరుగా రక్తంలో కలిసిపోయి అనారోగ్యానికి దారితీస్తుంది.అధిక కేలరీలు: ఒక గ్లాసు రసం తయారు చేయాలంటే కనీసం మూడు నాలుగు పండ్లు వాడాల్సి ఉంటుంది. దీనివల్ల శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ కేలరీలు, చక్కెర అందుతాయి. ఫలితంగా బరువు పెరగడం, షుగర్ లెవల్స్ నియంత్రణ తప్పడం వంటి సమస్యలు ఎదురవుతాయి. పండును నేరుగా నమలి తినడం వల్ల శరీరానికి పుష్కలంగా ఫైబర్ అందుతుంది. ఈ ఫైబర్ రక్తంలోకి చక్కెరను నెమ్మదిగా విడుదల చేస్తుంది. దీనివల్ల షుగర్ లెవల్స్ స్థిరంగా ఉంటాయి. పండ్లలోని విటమిన్లు, ఖనిజాలు ఏమాత్రం వృథా కాకుండా శరీరానికి అందుతాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి తోడ్పడతాయి. ఆకలిగా ఉన్నప్పుడు జ్యూస్ కంటే పండు తినడం వల్ల కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది. ఇది జంక్ ఫుడ్ తినకుండా మిమ్మల్ని అడ్డుకుంటుంది. డైటీషియన్ ముస్కాన్ కుమారి ప్రకారం.. ఒకవేళ మీరు జ్యూస్ తాగాలనుకుంటే, ఇంట్లో తయారుచేసిన తాజా రసాలను మాత్రమే చాలా తక్కువ పరిమాణంలో తీసుకోవాలి. ప్యాక్ చేసిన జ్యూస్‌లను పూర్తిగా నివారించడం ఉత్తమం. డయాబెటిస్ ఉన్నవారు ఏవైనా పండ్లు తీసుకునే ముందు తమ వైద్యులను సంప్రదించడం మంచిది.



# గోరు వెచ్చని నీటిలో నిమ్మరసం తాగే అలవాటు ఉందా?

ఫిట్‌నెస్ ప్రియులు ఉదయాన్నే ఖాళీ కడుపుతో నిమ్మ రసం గోరువెచ్చని నీటిలో కలిపి తాగడం తరచూ చూస్తుంటాం. దీనివల్ల కడుపులోని కొవ్వు తొలగిపోతుందని చాలా మంది భావిస్తుంటారు. ఈ పురాతన చిట్కా పలు ఆరోగ్య సమస్యలను కూడా నివారిస్తుందని నమ్ముతారు. ప్రతి ఉదయం గోరు వెచ్చని నీటిలో నిమ్మ రసం కలిపి తాగడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వ్యాధులను దూరంగా ఉంచుతుంది. నిమ్మకాయలోని అధిక విటమిన్ సి కంటెంట్ జలుబును నివారిస్తుంది. నిమ్మకాయలో పొటాషియం కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది నరాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. రక్తపోటును నియంత్రిస్తుంది. శరీర ఆమ్ల స్థాయిని నిర్వహించడానికి కూడా సహాయపడుతుంది. తరచుగా అనారోగ్యానికి గురికాకుండా రక్షణ కల్పిస్తుంది. నిమ్మ నీరు దంత కుహరాలు, పంటి నొప్పి, చిగుళ్ల నొప్పి వంటి దంత సమస్యలను కూడా తక్షణమే పరిష్కరించగలదు. ఉదయాన్నే ఖాళీ కడుపుతో నిమ్మ నీరు తాగడం వల్ల మూత్రవిసర్జన సైతం మెరుగుపడుతుంది. ఇది శరీరం నుంచి విషాన్ని, వ్యర్థాలను తొలగిస్తుంది. అందువల్ల నిమ్మ రసం తాగడం వల్ల మెరిసే చర్మం పొందవచ్చు. ఇది జీర్ణ సమస్యలను పరిష్కరించడంలో కూడా చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఖాళీ కడుపుతో నిమ్మ నీరు తాగడం వల్ల జీర్ణ శక్తి పెరుగుతుంది. అజీర్ణంతో బాధపడేవారికి ఈ నిమ్మ నీరు అద్భుతంగా పనిచేస్తుంది. అయితే ఈ నిమ్మకాయ నీటిని తప్పుడు సమయంలో, తప్పుడు మార్గంలో తాగితే ఆరోగ్యానికి విషం మాదిరి ప్రతికూలంగా పని చేస్తుంది. యాసిడ్ రిఫ్లక్స్ వంటి సమస్యలు ఉన్నవారు ఖాళీ కడుపుతో నిమ్మ నీరు తాగడం అంత మంచిది కాదు. నిమ్మ నీరు తాగడం వల్ల దంతాల ఎనామిల్ దెబ్బతింటుందని నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా నోటిలో పుండ్లు ఉంటే నిమ్మ నీటిని తాగడం వల్ల అవి మరింత తీవ్రతరం అవుతాయి. ఎల్లప్పుడూ గోరువెచ్చని నీటిలో నిమ్మరసం కలిపి తాగడం మంచిది. తాగిన వెంటనే పళ్ళు తోముకోకూడదు. రోజుకు ఒకటి కంటే ఎక్కువసార్లు నిమ్మ నీరు తాగకూడదు. ఈ నీటిని నేరుగా తాగడం కంటే స్ట్రా ద్వారా తాగడం వల్ల ఎనామిల్ సురక్షితంగా ఉంటుంది. అల్సర్లు లేదా తీవ్రమైన అసిడిటీ ఉంటే ఈ నీళ్లు అస్సలు తాగకూడదు. అవసరమైతే వైద్యుడిని సంప్రదించడం మరచిపోకూడదు.

# మాజీ మంత్రి జీవన్ రెడ్డి ని మానసిక క్షోభకు గురి చేయడం సరికాదు

**జగిత్యాల :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి జీవన్ రెడ్డిని మానసిక క్షోభకు గురి చేయడం సరి కాదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. శుక్రవారం నాడు జిల్లా కేంద్రంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పెద్దపెల్లి మాజీ పార్లమెంట్ సభ్యుడు వెంకటేష్ నేత తోపాటు పలువురు పార్టీ నాయకులతో కలిసి ఎంపి అరవింద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ జీవన్ రెడ్డి టఫ్ లీడర్ కాదని, చాలా సౌమ్యుడని, పార్టీలో సయోధ్య చేసుకోవచ్చన్నారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న వ్యవహారంపై తాను జీవన్ రెడ్డిని కలిసి మాట్లాడాలని ఉందని ఎన్నికల వేళ నాకైనా, తనకైనా ప్రస్తుత సమయంలో కలవడం మంచిది కాదన్నారు. తనకు మనస్ఫూర్తిగా మాట్లాడం ఇష్టమని పార్టీలను పక్కన పెట్టాలని, సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి తండ్రితో సమానం అని అన్నారు. ఈ వయసులో ఆయనను హింసించడం దానంత పాపం మరొకటి లేదని అన్నారు. జీవన్ రెడ్డి పట్ల కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న విధానం కరెక్ట్ కాదని, కాంగ్రెస్ పార్టీ మంచితనం కూడా కాదని ఎంపి ధర్మపురి అరవింద్ అన్నారు.కోరుట్ల బీజేపీ పార్టీ లో భారీ చేరికలు కోరుట్ల పట్టణంలోని ప్రముఖ వైద్యుడు డాక్టర్ అనూప్ రావు స్వగృహంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీ పార్టీ లోకి చేరారు.ఈ సంధర్భంగాప్రముఖ వ్యాపారవేత్తఅల్లాడి ప్రవీణ్, మచ్చ శేఖర్, తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, రేగుంట మహీంద్రా తోపాటు సుమారు 150 మందిని ఎంపి అర్వింద్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.ఆనంతరం ఎంపీ అరవింద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు బీజేపీ పార్టీ లోకి చేరుతున్నారని అన్నారు.దేశ ప్రజలకు సమర్థ పాలన అందిస్తున్న బీజేపీ ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. మోదీ దేశంలోని ప్రజలందరికీ



అవినీతి రహిత పాలన అందిస్తూ వారి అభ్యున్నతి కోసం ఆహర్నిశలు పనిచేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ చేయలేని అభివృద్ధిని మోధీ చేసి చూపించారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రచారం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అనేక పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలకుకేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని చెప్పారు.మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకు కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలనీ, గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందాలంటే బీజేపీ తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాద గిరి బాబు,జగిత్యాల జిల్లా ఇంచార్జ్ శ్రీనివాస్,జిల్లా మాజీ అధ్యక్షులు మోరాపెల్లి సత్యనారాయణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్,బీజేపీ రాష్ట్ర నాయకులు, డాక్టర్.రఘు,ఏలేటి నరేందర్ రెడ్డి ,రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, డాక్టర్ అనూప్ రావు ,మాజీ కౌన్సిలర్స్ పెందం గణేష్, కస్తూరి లక్ష్మీనారాయణ,మాడవేణీ నరేష్, గిన్నెల శ్రీకాంత్ ,సుదవేణి మహేష్, ఇందూరి సత్యం, జక్కుల జగదీశ్వర్, తిరుమల వాసు,ఉరుమాండ్ల చరణ్, బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బూత్ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో ఘనంగా వసంత పంచమి వేడుకలు

## సరస్వతి,లలితమాత,ధన్వనీతరి ఆలయాల్లో సరస్వతీ పూజలు

**జగిత్యాల :** జగిత్యాల జిల్లాలో వసంతపంచమి సందర్భంగా ఆలయాలు భక్తులతో పోటెత్తాయి.ముఖ్యంగా సరస్వతి మాతకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.జగిత్యాల సమీపంలోని నూకపల్లిలోనీ సరస్వతి ఆలయంలో అమ్మవారికి చిన్నారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, మాకు మంచి చదువులు అబ్బేలా దీవించాలని పుస్తకాలు పెట్టి మొక్కున్నారు. పొలాస లలితమాత ఆలయంలో ఆలయ ఫౌండరి ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రాలకు కుంకుమ పూజలు చేశారు.లలితసాహస్ర నామ పారాయణం చేసి సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ సూర్య ధన్వాంతరి దేవాలయంలో వసంత పంచమినీ పురస్కరించుకొని శ్రీ సూర్య ఆంజనేయ స్వామి ఉపాలయానికి శుక్రవారం నిర్మాణానికి భూమి పూజ చేశారు. ధనలక్ష్మి ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకము, తామర పువ్వులతో అమ్మ వారికి ధనలక్ష్మి యాగం, కుంకుమ పూజ అనంతరం లక్కి డ్రా తీసి ముగ్గురు మాతలకు చీరలు ఇచ్చారు.అలాగే గుట్ట రాజేశ్వర స్వామి సన్నిధిలో శివ పురాణ ప్రవచనం నాల్గవ రోజు బ్రహ్మశ్రీ బుర్రా భాస్కర్ శర్మ శివ పురాణం గురించి ఆసక్తికరంగా వివరించారు.ఈ కార్యక్రమములో ఫౌండరి ఛైర్మెన్ డాక్టర్ వడ్ల గట్ట రాజన్న, మేనేజింగ్ ట్రస్ట్ గట్టు రాజేందర్, ఆలయ ప్రెసిడెంట్ ముత్యాల రామలింగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వోడ్నాల శ్రీనివాస్, చెల్లం



స్వరూప, మహేందర్, సత్తయ్య, జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, రమేష్ రెడ్డి,తావుట్ రాంచంద్రం, ఉటూరి కళ్యాణి, ఉటూరి హరీష్, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. ప్రధాన కార్యదర్శి వడ్ల గట్ట శంకర్, కోశాధికారి వడ్లగట్ట స్వాతి, సహాయ కోశాధికారి వడ్లగట్ట గోపి, ధర్మకర్తలు వొడ్నాల లత, భారతాల గీత, సభ్యులు జయ శ్రీ, సుజాత, శ్రీ నిజ, రంగ స్వప్న,పాంపట్టి సులోచన, వనజ, ఉటూరి అర్చన, శైలజ, జంగిలి విజయ,రజిత, ప్రసన్న, హర్షిణి, జమున,భాగ్య లక్ష్మి,తిరుపతి, అర్చకులు గుంటి జగదీశ్వర్, అజయ్ శర్మ, ప్రణయ్ కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

**జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలి**

**ఫిబ్రవరి 12న దేశవ్యాప్త జాతీయ సమ్మెలో భారీగా పాల్గొనాలి**

**సిపిఐఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు లేల్లెల బాలకృష్ణ**



**జగిత్యాల :** దేశ. ప్రధాని నరేంద్రమోది పాలనలో ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవాలంబిస్తూ కొత్త సమస్యలను తీసుకువస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు లేల్లెల బాలకృష్ణ ప్రభుత్వ తిరుపై మండిపడ్డారు.సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సమావేశం కోమటి చంద్రశేఖర్ అధ్యక్షతన శుక్రవారం జగిత్యాల పట్టణంలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించగాముఖ్య అతిథులుగా సిపిఐఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు లేల్లెల బాలకృష్ణ హాజరైయారు.ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దుచేసి ఆ స్థానంలో విబిజి రామ్జి అనే కొత్త చట్టాన్ని తీసుకువచ్చారని తెలిపారు.పాత చట్టాన్ని మహాత్మా గాంధీ పేరును తొలగించడమే ప్రధాన ఉద్దేశంతో పలకడానికి వీలు లేనటువంటి హిందీ ఇంగ్లీష్ పదాలతో కూడిన వికాసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) అనే కొత్త చట్టాన్ని తీసుకువచ్చారనీ బాలకృష్ణ ద్వజమేత్తారు.ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడం కొరకు ఈ పథకంలో 100 రోజుల పనిని 125 రోజులకు పెంచుతున్నామని ప్రజలను నమ్మించడం కోసం 125 రోజులకు పెంచారూ. కానీ రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు 200 రోజుల పని దినాలు కల్పించాలని చాలా సంవత్సరాలుగా డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.25 రోజుల పని నోటిఫైడ్ ఏరియాలకు మాత్రమే వర్తిస్తుందని, కేంద్ర ప్రభుత్వము గత చట్టంలో 90 శాతం నిధులు ఇవ్వాల్సి ఉంటే రాష్ట్ర ప్రభుత్వం కేవలం 10% మాత్రమే ఇవ్వాల్సి ఉండే. కానీ ఉపాధి హామీ పనిని నిర్వీర్యం చేయడం కొరకు రాష్ట్రాలు 40 శాతం వాటా చెల్లించాలని ఈ చట్టంలో పొందుపరిచారు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వవు బ్రేక్ అవుతాయన్నారు .ఈ విధంగా ఉపాధి హామీ చట్టం నిర్వీర్యం అవుతుంధోనని ఆందోళన వ్యక్తం చేశారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలని పని దినాలను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు.కార్మిక చట్టాలను రద్దు చేస్తూ నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చారు. దీని ద్వారా కార్మికుడు సంఘం పెట్టుకునే హక్కు నీ సమ్మె చేసే హక్కుని కోల్పోయే పరిస్థితి వచ్చింది. వెంటనే లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చిన నరేంద్ర మోడీ సర్కార్ రైతులు పెద్ద ఎత్తున సంవత్సర కాలంగా పోరాటం చేసి అనేకమంది అమరులై నరేంద్ర మోడీ మెడలు వంచి రెండు చేతుల క్షమాపణ చెప్పించిన ఘనత రైతు పోరాటం ప్రజలది అన్నారు. వెంటనే తప్పుడు చట్టాలను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు ఇందూరి సులోచన, కోమటి చంద్రశేఖర్, సిఐటియు జగిత్యాల జిల్లా,అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొని మాట్లాడారు, సిఐటియు జగిత్యాల జిల్లా కోశాధికారి వెలమలపల్లి వెంకటాచారి జిల్లా కమిటీ సభ్యులు కుంచెం శంకర్ తదితరులు పాల్గొన్నారు...

## చలి తీవ్రతతో గుండె పోటు ప్రమాదం...

## అవగాహన సదస్సులో మెడికవర్ వైద్యులు

**కోరుట్ల :** చలి తీవ్రతతో రక్తం చిక్కబడి, నరాలు కుంచించుకపోయి గుండెపై ఒత్తిడి పెరగడం కారణంగా గుండె పోటు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని మెడికవర్ వైద్యులు తెలిపారు. శుక్రవారం కోరుట్లలోని ఇస్తా హోటల్లో చలికాలం సీజన్లో వచ్చే గుండె జబ్బులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ... మిగతా సీజన్ల కంటే చలికాలంలో నీళ్లు తక్కువగా తాగడం వల్ల రక్తం చిక్కబడడం, ఆస్తమా, స్మోకింగ్ ఊపిరితిత్తుల దారులు మూసుకు పోవడం, ఆల్కహాల్ తీసుకోవడం కారణంగా గుండెపై ఒత్తిడి పెరుగుతుందన్నారు. అదే విధంగా రక్తం చిక్కబడడం, రక్తసరఫరాలో ఇబ్బందుల వల్ల గుండెకు ఆక్సిజన్ అందక గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ప్రమాదముందన్నారు. గుండె వ్యాధిగ్రస్తులు ప్రమాదకర చలిలో బయటకు వెళ్లకూడదని సూచించారు. ముఖ్యంగా షుగర్, కిడ్నీ, బీపీ, కేన్సర్, టీబీ వ్యాదితో బాధపడే వారు మరింత జాగ్రత్తగా ఉంటూ తగినంత నీరు తీసుకుంటూ, వ్యాయామం చేస్తూ వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో కార్డియాలజిస్టులు డాక్టర్ అనీష్ పబ్బ, అనెస్థీషియా హెడ్ డాక్టర్ వినయ్, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్, దాసరి చంద్రశేఖర్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిట్ విచారణ

**సప్త సముద్రాల అవతల దాక్కున్నా వదలం..**

**పోలీసుల అత్యుత్సాహంపై పోలీసు అధికారులకు హరీశ్‌రావు వార్నింగ్**

**హైదరాబాద్ :** పోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సిట్ విచారణకు హాజరైన క్రమంలో పోలీసుల అత్యుత్సాహంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కుట్రపూరితంగా, ఉద్దేశపూర్వకంగా తమపై కేసులు పెట్టారని తెలిపారు. ఈ కేసులో కేటీఆర్ విచారణకు హాజరయ్యారని.. రేవంత్ రెడ్డిని కూడా ఫోన్ ట్యాపింగ్‌పై విచారించాలని డిమాండ్ చేశారు.జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లకుండా బీఆర్ఎస్ నాయకులపై పోలీసుల దౌర్జన్యాన్ని నిరసిస్తూ మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, క్రాంతి నాయక్, ఇతర బీఆర్ఎస్ నాయకులు జూబ్లీహిల్స్‌లోని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పోలీసుల వైఖరిని హరీశ్‌రావు నిలదీశారు. కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు. కావాలనే రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న అధికారులను సిట్ (రామి) లో పెట్టి మా మీద ప్రయోగాలు చేస్తున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. అధికారులు అన్యాయంగా, అక్రమంగా వ్యవహరిస్తే, ఉద్దేశపూర్వకంగా ఇబ్బంది పెట్టాలని ప్రయత్నం చేస్తే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. చట్టాన్ని అతిక్రమించినా, న్యాయబద్ధంగా వ్యవహరించకపోయినా, తప్పుడు లీకులు ఇచ్చినా ఆ పోలీసులను వదిలిపెట్టేది లేదని పేర్కొన్నారు. అంతకు అంత అనుభవిస్తారు.. జాగ్రత్తగా ఆలోచించుకోవాలని సూచించారు. రిటైర్ అయినా మిమ్మల్ని వదిలిపెట్టమని.. ఏ పొక్కలో దాక్కున్నా, సప్త సముద్రాల అవతల ఉన్నా పట్టుకొచ్చి విచారిస్తామని హెచ్చరించారు. రేపు అధికారంలోకి వచ్చే బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా మీకు సహకరించదని అన్నారు. మీ సొంత డబ్బులతో, సొంత లాయర్లను పెట్టుకొని కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. అందుకే చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా వ్యవహరించాలని సూచించారు.దావోస్ నుంచి రేవంత్ రెడ్డి ఇచ్చే డైరెక్షన్‌లో కాదు, చట్ట ప్రకారం వ్యవహరించాలని పోలీసులకు హరీశ్‌రావు హితవు పలికారు. తప్పుడు సూచనలు, తప్పుడు ఆదేశాలను పాటించి చట్టాన్ని అతిక్రమిస్తే దానికి మీరే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వం బీఆర్ఎస్ నేతలపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం దుర్మార్గమని విమర్శించారు. కుట్రలతో బీఆర్ఎస్ నాయకులను బెదిరించాలని చూస్తున్న రేవంత్ పన్నాగం ఇది అని వ్యాఖ్యానించారు. మేం తప్పు చేయలేదు, ఎవరికీ భయపడేది లేదని అందుకే కేటీఆర్ ధైర్యంగా వెళ్లారని స్పష్టం చేశారు. అనేక సందర్భాల్లో బీఆర్ఎస్ నాయకులపై దుష్ప్రచారం జరిగింది.. ఆ రోజు ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. మహిళల ఆత్మాభిమానం దెబ్బతీస్తే, కేటీఆర్ మీద సోషల్ మీడియాలో, టీవీల్లో, పత్రికల్లో వార్తలు రాయిస్తే ఏం చేశారని నిలదీశారు. రేవంత్ రెడ్డి మీద కూడా అధికారులు విచారణ జరిపించాలని.. అన్ని విషయాలు బయటకు రావాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్స్,

## ఎక్సైజ్ శాఖ అధికారులు దిమ్మతిరిగే షాక్

**మూసివేసిన వైన్ షాపులను దగ్గరుండి తెరిపించిన అధికారులు**

**హైదరాబాద్ :** యాదాద్రి భువనగిరి జిల్లా మునుగోడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి ఎన్‌ఫోర్స్‌మెంట్స్, ఎక్సైజ్ శాఖ అధికారులు దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. సంస్థాన్ నారాయణపూర్‌లో రాజగోపాల్ రెడ్డి అనుచరులు మూసివేసిన వైన్ షాపులను అధికారులు దగ్గరుండి తెరిపించారు. ఎక్సైజ్ శాఖ అధికారుల పహారాలో ఉదయం నుండి మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి.కాగా, మా సార్ చెప్పిన టైంకే వైన్ షాపులు తెరవాలి. లేదంటే షాపులు మొత్తానికి మూసేస్తాం అని మునుగోడు నియోజకవర్గంలో వైన్ షాపుల ముందు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అనుచరులు వీరంగం సృష్టించిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో వైన్ షాపులు మధ్యాహ్నం 1 గంటకు.. పర్మిట్ రూమ్ సాయంత్రం 6 గంటలకు తెరవాలని రాజగోపాల్ రెడ్డి హుకుం జారీ చేసినట్లు సమాచారం. దీంతో సంస్థాన్ నారాయణపూర్‌లో తెరిచి ఉన్న వైన్ షాపు నిర్వాహకులపై దాడికి తెగబడి, షాపును ఎమ్మెల్యే కోమటిరెడ్డి అనుచరులు మూసివేయించారు.దీంతో వైన్ షాపు నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన అధికారులు ఉదయం నుంచే మందు బాబుల కోసం దగ్గరుండి షాపులు తెరిపించి ఎమ్మెల్యేకు షాక్ ఇచ్చారు. ఇప్పుడు మునుగోడులో ఇదే హాట్ టాఫిక్‌గా మారింది.

## ఆధార్ కార్డు ఉంటేనే ప్రసూతి చేస్తాం

**ఆధార్ లేదు.. అమ్మను కాలేనా..?.. అంటూ.. మనోవేధనకు గురవుతున్న గర్భిణి**

**పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాలు తిరిగే కుటుంబాల పరిస్థితి అగమ్య గోచరం**

**కరీంనగర్ :** పొట్టకూటి కోసం ఇతర రాష్ట్రాలు తిరిగే కుటుంబాలు తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీ గ్రామంలో ఎన్నో ఉన్నాయి. వారు వారి కుటుంబాలతో ఇతర రాష్ట్రాలకు వెళ్లిన సమయంలో పిల్లలు పుడితే, వారి పేరు నమోదు జాప్యం కావడంతో ఆధార్ లేక పిల్లలు పెద్దయ్యాక సతమతమవుతున్నారు. ప్రస్తుతం బేడ బుడగ జంగం సామాజిక వర్గానికి చెందిన 23 ఏండ్ల ఊబిది రేఖ గర్భవతి. వారి కుటుంబం ఆమె చిన్ననాటి నుంచే ఇతర రాష్ట్రాలలో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. ఈ క్రమంలో ఆమె పుట్టిన సమయంలో అధికారికంగా పేరు ఎక్కడా నమోదు కాలేదు. దీంతో ఆమె ఆధార్ కార్డు తీసుకోవడంలో జాప్యం జరిగింది. అయితే ఆమె గర్భం ధరించిన నుండి ఆసుపత్రిలో చికిత్స కోసం వెళితే ఆధార్ కార్డు లేక ఇబ్బందులు పడుతోంది. ప్రస్తుతం నిండు గర్భిణీ కావడంతో కరీంనగర్ మాతా శిశు ఆసుపత్రిలో ఆధార్ కార్డు ఉంటేనే ప్రసూతి చేస్తామని డాక్టర్లు చెబుతున్నారని, తనకు ఆధార్ కార్డు లేదని ఆమె వాపోతోంది. ప్రైవేట్ దవాఖానకు వెళ్లి డెలివరీ చేయించుకునే ఆర్థిక స్థోమత తమకు లేదని, అధికారులు తనపై కనికరం చూపించి ఆధార్ కార్డు ఇప్పించి, తనకు గుర్తింపు నివ్వాలని కోరుతోంది. తనకు ఆధార్ కార్డు లేకపోతే అమ్మను కాలేనా..? అని వాపోతోంది.

## ఫోన్ ట్యాపింగ్ పై కెటిఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలి

## టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ పై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆత్మపరిశీలన చేసుకోవాలని, వ్యక్తిగత హననం చేస్తున్నారని కెటిఆర్ అనడం హాస్యాస్పదం టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ కక్ష ఉంటే అధికారంలోకి రాగానే చర్యలుండేవని, ఫోన్ ట్యాపింగ్.. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించినట్లేనని చెప్పారు. ఆరోపణలు చేసి పారిపోతామంటే కుదరదని సూచించారు. అలీబాబా 420 దొంగల మాదిరి మాజీ సిఎం కెసిఆర్ కుటుంబం దోపిడి చేశారని మండిపడ్డారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను చెల్లెలుగా ఎప్పుడూ గౌరవిస్తానని, వాటాల పంపకాల్లో తేడా వల్లే కెసిఆర్ కుటుంబంలో గొడవలు అని తెలియజేశారు. ఇప్పటికైనా కవిత నిజాలు మాట్లాడటాన్ని స్వాగతిస్తున్నానని, ఎఐసిసి ఇన్ చార్జ్ మార్పు ఉండదని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు

ధర్మఘంట

# బిజినెస్

## అనంత్ అంబానీ పేరుతో రూ. 14 కోట్ల స్పెషల్ వాచ్



ప్రముఖ లగ్జరీ వాచ్‌ల తయారీ సంస్థ జాకబ్ అండ్ కో సరికొత్త వాచ్‌ను విడుదల చేసింది. దీని ఖరీదు సుమారు 1.5 మిలియన్ డాలర్లు, అంటే మన కరెన్సీలో ఏకంగా రూ.13.7 కోట్లు ఉంటుంది. ఒపెరా వంతారా గ్రీన్ కామో పేరుతో తెచ్చిన ఈ వాచ్‌కు ఓ ప్రత్యేకత ఉంది. ఈ వాచ్‌ను రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ, నీతా అంబానీల చిన్న కుమారుడు అనంత్ అంబానీ గుజరాత్‌లో నిర్వహిస్తున్న వన్యప్రాణుల సంరక్షణ కేంద్రం వంతారాకు అంకితమిస్తూ రూపొందించారు. దీని ధర కోట్లలో ఉన్నప్పటికీ, వన్యప్రాణుల సంరక్షణకు గుర్తుగా తీసుకురావడం అంతకు మించి విలువైనదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఒపెరా వంతారా గ్రీన్ కామో కేవలం సమయాన్ని మాత్రమే సూచించదు, ఇది ఒక కథను చెబుతుందని జాకబ్ అండ్ కో కంపెనీ అభిప్రాయపడింది. డిజైన్ పరంగా ఈ వాచ్ డయల్ మధ్యలో చేత్తో చిత్రించిన అనంత్ అంబానీ అతిచిన్న బొమ్మ ఉంటుంది. దానికి ఇరువైపులా చిన్న సైజ్ సింహం, బెంగాల్ పులి శిల్పాలు ఉన్నాయి. ఇక, ఈ వాచ్ కేస్, డయల్‌పై డెమంటాయిడ్ గార్నెట్‌లు, సవోరైట్‌లు, ఆకుపచ్చ నీలమణి, తెల్లటి వజ్రాలతో సహా మొత్తం 21.98 క్యారెట్ల బరువున్న 397 రత్నాలను పొదిగారు. ఈ రత్నాలు కళాత్మకంగా డయల్, కేస్ చుట్టూ ఒక చిన్న అటవీ ప్రకృతి దృశ్యంలా డిజైన్ చేసినట్టు కంపెనీ వెల్లడించింది.

## 78 శాతం క్షీణించిన ఇండిగో లాభాలు



గత నెలలో పెద్ద ఎత్తున విమానాలను రద్దు చేసిన నేపథ్యంలో ఎయిర్‌లైన్ కంపెనీ ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ డిసెంబర్ త్రైమాసికంలో భారీగా లాభాలను కోల్పోయింది.గురువారం కంపెనీ ప్రకటించిన త్రైమాసిక ఫలితాల్లో రూ. 549.1 కోట్ల లాభాలను పేర్కొంది. ఇది గతేడాది వచ్చిన రూ. 2,448.8 కోట్ల లాభాలతో పోలిస్తే ఏకంగా 78 శాతం క్షీణత కావడం గమనార్హం. కేంద్రం ప్రభుత్వం తెచ్చిన కొత్త లేబర్ కోడ్స్, డిసెంబర్‌లో కంపెనీ ఎదుర్కొన్న విమాన సేవల్లో అంతరాయం వల్ల కంపెనీ లాభాలకు గండిపడింది.కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం, కొత్త లేబర్ కోడ్స్ అమలు చేసేందుకు రూ. 969 కోట్లు, గత నెలలో ఏర్పడిన కార్యకలాపాల అంతరాయం వల్ల మరో రూ. 577 కోట్లు ఖర్చు చేశామని ఇండిగో తెలిపింది. తద్వారా ఈ త్రైమాసికంలో కంపెనీకి రూ. 1,546 కోట్ల భారం పడింది. ఇక, ఈ త్రైమాసికంలో ఇండిగోకు రూ. 24,540.6 కోట్ల ఆదాయాన్ని వెల్లడించింది. ఇది గతేడాది వచ్చిన రూ. 22,992.8 కోట్లతో పోలిస్తే పెరిగింది.

# భవిష్యత్తు బంగారం 'వెండి'నే

# టెక్నాలజీ యుగంలో తిరుగులేని శక్తిగా వైట్

ప్రస్తుత ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వెండి కేవలం ఒక ఆభరణంగానో లేదా పెట్టుబడిగానో మాత్రమే కాకుండా, అంతకు మించిన కీలక పాత్రను పోషిస్తోందని ప్రముఖ ఇన్వెస్టర్ రాబర్ట్ కియోసాకి విశ్లేషించారు. గతంలో వెండిని కేవలం డబ్బుకు ప్రత్యామ్నాయంగా మాత్రమే చూసేవారని, కానీ ఇప్పుడు అది ఒక "స్ట్రక్చరల్ మెటల్"గా రూపాంతరం చెందిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ వెండికి ఉండే డిమాండ్ ఊహించని రీతిలో పెరుగుతోందని, ఇది మున్ముందు ఆర్థిక మార్కెట్లలో పెను మార్పులకు దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు.పరిశ్రమల పరంగా చూస్తే, వెండి వినియోగం ఇప్పుడు అడ్డూఅదుపు లేకుండా విస్తరిస్తోంది. ముఖ్యంగా పర్యావరణ హితమైన ఇంధన వనరుల తయారీలో, అంటే సోలార్ ప్యానెల్స్‌లో వెండి వినియోగం అత్యంత కీలకంగా మారింది. దీనితో పాటు ఎలక్ట్రానిక్ వస్తువులు, స్మార్ట్‌ఫోన్లు మరియు సెమీకండక్టర్ల తయారీలో వెండికి మరే ఇతర లోహం సాటిరాదు. ఎలక్ట్రిక్ వాహనాల (ఇవి) రంగం



పుంజుకుంటున్న తరుణంలో, వాటి బ్యాటరీలు మరియు సర్క్యూట్లలో వెండి వాడకం పెరగడం వల్ల ఈ లోహానికి భవిష్యత్తులో కొరత ఏర్పడే అవకాశం కూడా ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.గత శతాబ్దంలో జరిగిన పారిశ్రామిక విప్లవం సమయంలో ఇనుము ఏ విధంగానైతే దేశాల పురోగతిని నిర్దేశించిందో, ప్రస్తుత డిజిటల్ మరియు టెక్ యుగంలో వెండి అదే స్థాయి ప్రాధాన్యతను సంతరించుకుందని కియోసాకి పోల్చారు. ఇనుము లేకుండా అప్పట్లో భవనాలు, యంత్రాల నిర్మాణం ఎలా సాధ్యం కాలేదో, ఇప్పుడు వెండి లేకుండా హైటెక్ పరికరాల తయారీ అలాగే అసాధ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వెండిని కేవలం విలువైన లోహంగా కాకుండా, ఆధునిక ప్రపంచ నిర్మాణానికి పునాదిగా భావించాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. పెట్టుబడిదారుల దృక్కోణంలో చూస్తే, రాబోయే రోజుల్లో వెండి ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి. పారిశ్రామిక అవసరాలు పెరగడం మరియు భూగర్భంలో వెండి నిల్వలు పరిమితంగా ఉండటం వల్ల దీని విలువ బంగారాన్ని మించి వృద్ధి చెందే అవకాశం ఉంది. అందుకే స్మార్ట్ ఇన్వెస్టర్లు వెండిని ఒక దీర్ఘకాలిక ఆస్తిగా పరిగణించాలని, ఇది కేవలం సంపదను కాపాడటమే కాకుండా టెక్నాలజీ అభివృద్ధిలో భాగస్వామిగా మారుతుందని కియోసాకి తన విశ్లేషణలో వెల్లడించారు.

## అమెజాన్‌లో రెండో విడత ఉద్యోగాల తొలగింపునకు సన్నాహాలు

ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి భారీ ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోంది. మొత్తం 30,000 మంది కార్పొరేట్ ఉద్యోగులను తగ్గించుకోవాలన్న లక్ష్యంలో భాగంగా వచ్చే వారం రెండో విడత తొలగింపు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలుస్తోం ది. ఈసారి కూడా దాదాపు 15,000 మందిని తొలగించే అవకాశం ఉందని సమాచారం.ఈ లేఆఫ్స్ ప్రభావం అమెజాన్ వెబ్ సర్వీసెస్ , రిటైల్, ప్రైమ్ వీడియో, హ్యూమన్ రిసోర్సెస్ విభాగాలపై పడనుం దని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అయితే, ఈ ప్రణాళికల్లో మార్పులు ఉండొచ్చని కూడా పేర్కొన్నా యి. గతేడాది అక్టోబర్‌లో అమెజాన్ సుమారు 14,000 మంది ఉద్యోగులను తొలగించింది. వారికి కల్పించిన 90 రోజుల గడువు సోమవారంతో ముగియనున్న నేపథ్యంలో మంగళవారం నుంచే కొత్త లేఆఫ్స్ ప్రక్రియ మొదలుకావచ్చని అంచనా వేస్తున్నారు.గత తొలగింపుల సమయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెరుగుదలే కారణమని కంపెనీ అంతర్గతంగా తెలిపింది. అయితే, సీఈఓ ఆండీ జెస్సీ మాత్రం ఇది ఆర్థిక లేదా ఏఐ ప్రేరేపిత నిర్ణయం కాదని, కంపెనీలో పెరిగిన బ్యూరోక్రసీని, అనవసరమైన లేయర్లను తగ్గించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.మొత్తం 30,000 ఉద్యోగాల కోత పూర్తయితే, ఇది అమెజాన్ మూడు దశాబ్దాల చరిత్రలోనే అతిపెద్ద తొలగింపు అవుతుంది. 2022లో కంపెనీ సుమారు 27,000 మందిని తొలగించింది. ఈ 30,000 మంది కార్పొరేట్ ఉద్యోగుల్లో దాదాపు 10శాతం అయినప్పటికీ, సంస్థ మొత్తం 15.8 లక్షల మంది ఉద్యోగులతో పోలిస్తే ఇది చాలా తక్కువ.

## అంతరిక్షంలో ఏఐ డేటా సెంటర్లు: దావోస్‌లో ఎలాన్ మస్క్



ప్రపంచంలోనే అత్యంత సంపన్ను డు, స్పేస్‌ఎక్స్ అధినేత ఎలన్ మస్క్ దావోస్ కేంద్రంగా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూఈఎఫ్) కార్యక్రమంలో తొలిసారిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలను మస్క్ ప్రస్తావించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్(ఏఐ), రోబోల భవిష్యత్తు గురించి మాట్లాడిన ఎలన్ మస్క్.. ఈ సాంకేతికతలు త్వరలో మనం జీవించే, పని చేసే విధానాన్ని మారుస్తాయి. ఏఐ భూమ్మీద ఉన్న మానవుల కంటే తెలివైనదిగా మారగలదని, ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాలు, పరిశ్రమలను పునర్నిర్మించగల దని అన్నారు. ఈ సందర్భంగా.. సమీప భవిష్యత్తులో ఏఐ ఆధారిత డేటా సెం టర్‌లను అంతరిక్షంలో నిర్మించవచ్చని మస్క్ అన్నారు. ప్రస్తుతం, ఏఐ వ్యవస్థల కు భారీ మొత్తంలో ఎనర్జీ, కూలింగ్ అవసరం, వీటిని భూమిపై అందించడం కష్టం. అంతరిక్షంలో అన్నివేళలా లభించే సూర్యకాంతి, నేచురల్ కూలింగ్‌తో ఏఐ కంప్యూటర్లు మరింత చౌకగా, ప్రభావవంతంగా పనిచేయగలవని మస్క్ అభిప్రాయపడ్డారు. చాలామంది శాస్త్రవేత్తలు ఇది ఇప్పటికీ భవిష్యత్తుకు సంబంధించినదని చెబుతున్నప్పటికీ, మరో కొన్ని సంవత్సరాలలో ఇది జరగవచ్చని నమ్ముతున్నట్టు మస్క్ తెలిపారు. తన కంపెనీలు 'ఆప్టిమస్' అనే హ్యూమనాయిడ్ రోబోట్ల తయారీలో వేగంగా పురోగతి సాధిస్తున్నాయని మస్క్ స్పష్టం చేశారు. ఈ రోబోట్లను నిజ జీవితంలో ఉపయోగించడానికి సిద్ధంగా ఉన్నాయి. ఫ్యాక్టరీలలో పనిచేయడం, దుకాణాలలో సహాయం చేయడం లేదా సాధారణ రోజువారీ పనులు చేయడం వంటి మనుషుల పనులను చేయడానికి ఆప్టిమస్‌ను నిర్మిస్తున్నాం. ఈ రోబోట్లు త్వరలోనే రోజువారీ జీవితంలోకి వస్తాయని, ప్రజలకు వారి రోజువారి పనులలో సహాయపడతాయని వెల్లడించారు.

# స్పోర్ట్స్

# ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌కు పాక్ జట్టు ప్రకటన..

# స్టార్ ప్లేయర్ల రీఎంట్రీ



టీ20 వరల్డ్‌కప్‌కు ముందు స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరుగబోయే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం 16 మంది సభ్యుల పాకిస్తాన్ జట్టును ఇవాళ (జనవరి 23) ప్రకటించారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా సల్మాన్ అఘా కొనసాగనున్నాడు. ఈ సిరీస్‌తో స్టార్ ప్లేయర్లు బాబర్ ఆజమ్, షాహీన్ అఫ్రిది రీఎంట్రీ ఇచ్చారు. వీరిద్దరు ఇటీవల జరిగిన శ్రీలంక సిరీస్‌కు దూరంగా ఉండి, బిగ్‌బాష్ లీగ్‌లో పాల్గొన్నారు. మరో స్టార్ పేసర్ హారీస్ రౌఫ్‌కు ఈ జట్టులో చోటు దక్కలేదు. ఆల్‌రౌండర్ షాదాబ్ ఖాన్ తన స్థానాన్ని నిలబెట్టుకోగా.. స్పిన్ విభాగంలో అబ్రార్ అహ్మద్, మొహమ్మద్ నవాజ్, ఉస్మాన్ తారిక్‌కు చోటు దక్కింది. లాహోర్‌లోని గద్దాఫీ స్టేడియంలో జరుగబోయే ఈ సిరీస్ కోసం పాక్ జట్టు శనివారం (జనవరి 24) లాహోర్‌కు చేరుకుంటుంది. మ్యాచ్‌లు జనవరి 29, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో జరుగనున్నాయి. పాక్ గడ్డపై ఆస్ట్రేలియా ఆడబోతున్న రెండో టీ20 సిరీస్ ఇది. చివరిగా ఆసీస్ 2022లో పాక్‌లో పర్యటించి, ఏకైక టీ20 ఆడింది. ప్రపంచకప్ నేపథ్యంలో ఇరు జట్లకు ఈ సిరీస్ అత్యంత కీలకంగా పరిగణించబడుతోంది. ఈ సిరీస్ ముగిసిన వారం రోజుల్లోపే ప్రపంచకప్ మొదలవుతుంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఈ మెగా టోర్నీలో పాక్ గ్రూప్-ఏలో ఉంది. ఈ గ్రూప్‌లో అమెరికా, నమీబియా, నెదర్లాండ్స్, భారత్ మిగతా జట్లుగా ఉన్నాయి. మరోవైపు ఆస్ట్రేలియా గ్రూప్ బిలో ఉంది. ఈ గ్రూప్‌లో శ్రీలంక, ఐర్లాండ్, ఒమాన్, జింబాబ్వే జట్లు ఉన్నాయి.

ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌కు పాక్ జట్టు

సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), బాబర్ ఆజమ్, షాహీన్ షా అఫ్రిదీ, నసీమ్ షా, మొహమ్మద్ వసీమ్ జూనియర్, మొహమ్మద్ సల్మాన్ మిర్జా, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, సైమ్ అయూబ్, సహిబ్జాదా ఫర్హాన్ (వికెట్ కీపర్), ఉస్మాన్ ఖాన్ (వికెట్ కీపర్), ఖ్వాజా మొహమ్మద్ నఫాయ్ (వికెట్ కీపర్), షాదాబ్ ఖాన్, అబ్రార్ అహ్మద్, మొహమ్మద్ నవాజ్, ఉస్మాన్ తారిక్

## మహిళల బ్యాడ్మింటన్ గతిని మార్చినందుకు ధన్యవాదాలు.. హ్యాపీ రిటైర్మెంట్..!



౹ాం ౹ాఱఅఅస్ట్రఙ : భారత బ్యాడ్మింటన్‌పై చెరగని ముద్ర వేసిన సైనా నెహ్వాల్‌తన సుదీర్ఘ కెరీర్‌ను ముగించింది. ఒలింపిక్ పతకంతో పాటు పలు టోర్నీల్లో విజేతగా నిలిచిన సైనా ఎందరో అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచింది. వారిలో ఒకరైన పీవీ సింధు (౹ాం ౹ాఱఅఅస్ట్రఙ) సంచలన ఆటతో దేశం గర్వించదగ్గ క్రీడాకారిణిగా ఎదిగింది. ఈమధ్యే సింగిల్స్‌లో 500 విజయంతో చరిత్ర సృష్టించిన తెలుగు తేజం.. ఒకప్పటి తన ప్రత్యర్థి సైనా వీడ్కోలుపై స్పందించింది. ప్రకాశ్ పదుకొనే, పుల్లెల గోపిచంద్‌లు పురుషుల బ్యాడ్మింటన్‌లో దిగ్గజాలు. మరి, మహిళల విభాగంలో వీరి మాదిరిగా ఉన్నత శిఖరాలకు చేరిన తొలి షట్లర్ సైనా నెహ్వాలే. చైనా కోటను బద్దలు కొడుతూ విజేతగా నిలిచిన తను.. రెండుసార్లు వరల్డ్ ఛాంపియన్‌షిప్ గెలుపొందింది. 2019లో జాతీయ ఛాంపియన్‌షిప్‌లో సింధును ఓడించి టైటిల్ సాధించింది సైనా. రాకెట్ పట్టి గొప్ప విజయాలు సాధించేందుకు ప్రేరణగా నిలిచిన ఈ సీనియర్‌కు సింధు అభినందనలు తెలిపింది. 'బ్యాడ్మింటన్‌లో వీడ్కోలు పలికినందుకు అభినందనలు సైనా. భారత బ్యాడ్మింటన్‌కు విశేష సేవలందించినందుకు నీకు ధన్యవాదాలు. నీ జీవితంలో తదుపరి దశ ప్రశాంతత, సంతోషంతో సాగిపోవాలని కోరుకుంటున్నా' అని ఎక్స్ పోస్ట్‌లో వెల్లడించింది సింధు.

### ఒలింపిక్స్ కాంస్యంతో

'గత రెండేళ్లుగా నేను బ్యాడ్మింటన్ ఆడడం లేదు. నాకు నేనుగా ఈ ఆటలోకి వచ్చాను. అలానే నాకు నేనుగా వైదొలిగాను. కాబట్టి.. వీడ్కోలు ప్రకటించాల్సిన అవసరం లేదు' అని ఒక పాడ్‌కాస్ట్‌లో చెప్పింది సైనా. గణాంకాలు గమనిస్తే.. సింధుపై సైనాదే పైచేయి. వీరిద్దరూ నాలుగుసార్లు తలపడగా.. మూడు దఫాలు సైనా గెలుపొందింది. 2012 లండన్ ఒలింపిక్స్‌లో కాంస్యంతో చరిత్ర సృష్టించింది సైనా. భారత్‌లో మహిళల బ్యాడ్మింటన్ అభివృద్ధికి ఆమె విజయం టర్నింగ్ పాయింట్ అనే చెప్పాలి. అబ్బురపరిచే విజయాలతో భావి తారగా ఎదిగిన సింధు.. 2016 రియో ఒలింపిక్స్‌లో రతజం, ఆపై 2020 టోక్యోలో కాంస్యంతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది. వరుసగా రెండు విశ్వక్రీడల్లో పతకాలతో ఎవరికీ సాధ్యమవ్వని రికార్డు నెలకొల్పింది సింధు.

## డెత్ ఓవర్లలో రింకూ యమా డేంజర్.. స్ట్రయిక్ రేటు మూడొందలపైనే!



ఐపీఎల్‌తోనే టీ20ల్లో విధ్వంసక ఆటగాడిగా నిరూపించుకున్న రింకూ సింగ్ ఇప్పుడు టీమిండియా ఫినిషర్ పాత్రలో ఒదిగిపోతున్నాడు. నాగ్‌పూర్‌లో న్యూజిలాండ్ బౌలర్లను ఉతికారేసిన రింకూ.. జట్టుకు కొండంత స్కోర్ అందించాడు. డెత్ ఓవర్లలో సుడిగాలి ఇన్నింగ్స్ ఆడిన ఈ లెఫ్ట్ హ్యాండర్ కేవలం 20 బంతుల్లోనే 44 రన్స్ సాధించాడు. తద్వారా.. పొట్టి క్రికెట్‌లో 300లకు పైగా స్ట్రయిక్ రేటుతో 'సరిలేరు నాకెవ్వరు' అని మరోసారి చాటాడీ చిచ్చరపిడుగు. భారీకాయం, ఆరడగుల ఎత్తు లేకుంటేనేం.. అలవోకగాబంతిని అమాంతం స్టాండ్స్‌లోకి పంపే రింకూ సింగ్‌ను చూస్తే 'టీ20ల కోసమే పుట్టాడా?' అనిపించకమానదు. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ తురుపుముక్కగా అవతరించిన రింకూ.. భారత జెర్సీతోనూ అభిమానులకు పూనకాలు తెప్పిస్తున్నాడు. డెత్ ఓవర్లలో ఆకాశమే హద్దుగా విరుచుకుపడే ఈ పవర్ హిట్టర్ స్ట్రయిక్ రేటులో ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్నాడు. స్కూప్, లాగ్స్, ర్యాంప్స్ స్వీప్ షాట్లతో చెలరేగే అతడు19, 20 ఓవర్లలో 287.8 స్ట్రయిక్ రేట్ నమోదు చేశాడు. ఇక 20వ ఓవర్ తీసుకుంటూ రింకూ స్ట్రయిక్ రేటు 302.63 కావడం విశేషం. భారత సారథి సూర్యకుమార్ యాదవ్ 321.42తో మొదటి స్థానంలో కొనసాగుతున్నాడు. టీ20 స్పెషలిస్ట్‌గా ముద్రపడిన సూర్య స్ట్రయిక్ రేటు 19, 20 ఓవర్లలో 261.3 మాత్రమే. ఒకప్పుడు బౌలర్లను వణికించిన బ్రెండన్ మెక్‌కల్లమ్(న్యూజిలాండ్) 260.4తో మూడో ప్లేస్ సాధించాడు. ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ అరోన్ ఫించ్ 251.4తో నాలుగు, శ్రీలంక వెటరన్ తిలకరత్నే దిల్షాన్ (246.8) ఐదో ర్యాంక్‌లో నిలిచారు. డెత్ ఓవర్లలో బ్యాటింగ్ సగటులోనూ రింకూ 42.6తో అగ్రస్థానంలో ఉండడం విశేషం.

### వరల్డ్‌కప్‌లో ఫినిషర్

డెత్ ఓవర్లు కాకుండా మొత్తంగా చూస్తే రింకూ స్ట్రయిక్ రేటు 165గా ఉంది. ఓపెనర్ అభిషేక్ 190.92తో టాప్‌లో ఉన్నాడు. నాగ్‌పూర్‌లో 13.4 ఓవర్లకే ఐదు వికెట్లు పడిన దశలో క్రీజులోకి వచ్చిన రింకూ తన మార్క్ షాట్లతో చెలరేగాడు. అజేయంగా నిలిచిన అతడు.. భారత్‌కు 238 రన్స్ సాధించి పెట్టాడు. 'క్రీజులోకి రాగానే దంచాలనుకోను. సింగిల్స్, డబుల్స్ తీయడం గురించే ఆలోచిస్తా. ఆ తర్వాత బౌండరీలు బాదడమే పనిగా పెట్టుకుంటా' అని రింకూ మ్యాచ్ అనంతరం వెల్లడించాడు. న్యూజిలాండ్ సిరీస్‌లో అతడు ఇలానే సంచలన ఇన్నింగ్స్‌లు ఆడితే త్వరలో స్వదేశంలో జరుగబోయే వరల్డ్‌కప్‌లో ఫినిషర్ పాత్ర పోషించడం ఖాయమంటున్నారు విశ్లేషకులు.

ధర్మఘంట



## నేతాజీకి నివాళులర్పించిన 'డేవిడ్ రెడ్డి' చిత్ర బృందం!

మంచు మనోజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'డేవిడ్ రెడ్డి' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వెలువడింది. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని చిత్ర బృందం ఆయనకు నేడు ఘనంగా నివాళులు అర్పించింది. దేశభక్తి నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా నేతాజీ ఆశయాలకు అనుగుణంగా ఉంటుందని, అందుకే ఆయన స్ఫూర్తిని చాటనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రం 1897 నుంచి 1922 మధ్య కాలంలో సాగే పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. బ్రిటిష్ వారిపై పోరాటం చేసిన భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి వీరుల తరహాలోనే 'డేవిడ్ రెడ్డి' అనే యోధుడు దేశం కోసం ఎలా పోరాడాడు అనే అంశాన్ని దర్శకుడు హనుమరెడ్డి యక్కంటి చాలా పవర్‌ఫుల్‌గా తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'వార్ డాగ్' గ్లింప్స్‌లో వినిపించిన సంభాషణలు, మంచు మనోజ్ మేకోవర్ ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచాయి. ఈ సినిమాకు కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ సంగీతం అందిస్తుండగా, ఉజ్వల్ కులకర్ణి ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. మంచు మనోజ్ తన సెకండ్ ఇన్నింగ్స్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి మరిన్ని వివరాలు త్వరలోనే రానున్నాయి.




## 'భర్తపై భార్య తిరగబడితే..'.. ఆసక్తిగా ట్రైలర్

తరుణ్ భాస్కర్, ఈషారెబ్బా జంటగా వస్తోన్న తాజా చిత్రం ఓం శాంతి శాంతి శాంతిః. ఈ సినిమాకు ఎ.ఆర్ సజీవ్ దర్శకత్వం వహించారు. జయ జయ జయహే అనే మలయాళ చిత్రానికి రీమేక్‌గా ఈ మూవీని రూపొందించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ చిత్రం థియేటర్లలో సందడి చేసేందుకు వచ్చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఓం శాంతి శాంతి శాంతిః మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ చేతుల మీదుగా ట్రైలర్ విడుదల చేశారు. ఈ మూవీ ట్రైలర్ చూస్తుంటే భార్య, భర్తల మధ్య జరిగే ఫ్యామిలీ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌లా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. కామెడీ సీన్స్ అలరిస్తున్నాయి. భార్యపై భర్త డామినేషన్ చేయడం.. ఆ తర్వాత జరిగే సీన్స్ ఈ సినిమాపై ఆసక్తి మరింత పెంచుతున్నాయి. ఈ చిత్రం జనవరి 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇంకెందుకు ఆలస్యం ట్రైలర్ చూసేయండి.



## ఆ సీన్ సరదాగా చేశాం.. దయచేసి దానిని ఎవరు చేయొద్దంటూ అనిల్ రిక్వెస్ట్

మెగాస్టార్ చిరంజీవి డైరెక్టర్ అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో తెరకెక్కిన సంక్రాంతి స్పెషల్ చిత్రం 'మన శంకర వర ప్రసాద్ గారు' బాక్సాఫీస్ వద్ద సూపర్ డూపర్ హిట్‌గా దూసుకుపోతోంది. జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా, మొదటి రోజు నుంచే హౌస్‌ఫుల్ షోస్‌తో రికార్డ్ స్థాయి వసూళ్లను నమోదు చేస్తూ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. విక్టరీ వెంకటేష్ కీలక పాత్రలో మెరిసిన ఈ చిత్రంలో నయనతార కథానాయికగా నటించారు. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మించిన ఈ సినిమాను శ్రీమతి అర్చన సమర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో దర్శకుడు అనిల్ రావిపూడి సినిమా విజయం వెనుక ఉన్న అనుభూతులు, చిరంజీవితో పనిచేసిన అనుభవాలను పంచుకున్నారు. సినిమాను చూసి పవన్ కళ్యాణ్ అభినందించడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని అనిల్ తెలిపారు. పవన్ కళ్యాణ్ గారు మాత్రమే కాదు, ఇండస్ట్రీలోని పలువురు దర్శకులు, హీరోలు వ్యక్తిగతంగా ఫోన్ చేసి, మెసేజెస్ పంపారు. ఈ విజయం కేవలం మా టీమ్‌ది మాత్రమే కాదుడ ఇండస్ట్రీ మొత్తం కలిసి సెలబ్రేట్ చేసిన ఫీలింగ్ కలిగింది" అని చెప్పారు. చిరంజీవి లుక్ గురించి మాట్లాడుతూ .. ఫస్ట్ ఫోటోషూట్‌లోనే చిరంజీవి గారి లుక్ చూసి స్టన్నింగ్ అనిపించింది. గ్లామర్, ఫిట్‌నెస్, బాడీ లాంగ్వేజ్ అన్నీ పర్ఫెక్ట్‌గా కుదిరాయి. ఈ లుక్‌తో సినిమా అంతా ఉంటే ఆడియన్స్ ఫిదా అయిపోతారని అప్పుడే అనిపించింది. వింటేజ్ మెగాస్టార్‌ను మళ్లీ తెరపై చూపించే అవకాశం రావడం నా కెరీర్‌లో ఒక గొప్ప గిఫ్ట్ అని తెలిపారు. "నేను చిరు, వెంకీ సినిమాలు చూసి పెరిగాను. అలాంటి స్టార్‌లను డైరెక్ట్ చేయడం మాత్రమే కాదుడ వాళ్లతో కలిసి డాన్స్ చేయడం మైండ్ బ్లోయింగ్ ఎక్స్‌పీరియన్స్. బెల్ట్ స్టెప్‌ను పర్ఫెక్ట్‌గా చేయమని చిరంజీవి గారు నన్ను ఎంకరేజ్ చేసిన క్షణం ఎప్పటికీ గుర్తుండిపోతుంది అని గుర్తు చేసుకున్నారు. సినిమాలో చిరంజీవి నటించిన మందు సీన్ సోషల్ మీడియాలో వైరల్ కావడంపై స్పందించిన అనిల్‌డ చిరంజీవి గారి ప్రతి సినిమాలో ఒక స్పెషల్ సీక్వెన్స్ ఉంటుంది. ఈ సీన్ ఆయన మేనరిజమ్స్‌తో పాటు వెంకటేష్‌తో ఉన్న కనెక్షన్‌ను కూడా చూపిస్తుంది. థియేటర్‌లో ఆ సీన్ అదిరిపోయింది. అయితే ఇది సరదా కోసమేడ పిల్లలు ఇలాంటి వాటికి దూరంగా ఉండాలి" అని స్పష్టం చేశారు.




## అప్పుడు యాత్ర, ఇప్పుడు 'పాదయాత్ర'.. సీనియర్ స్టార్ కొత్త ప్రయోగం

మలయాళం సినీ పరిశ్రమలో తరతరాలుగా తన నటనతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోన్న సీనియర్ స్టార్ హీరో మమ్ముట్టి ఇప్పటికీ అదే జోరుతో సినిమాలు చేస్తూ వరుస విజయాలు సాధిస్తున్నారు. వయసుతో సంబంధం లేకుండా కథ, పాత్ర బలంగా ఉంటే చాలు అన్నట్టుగా విభిన్నమైన సినిమాలు ఎంచుకుంటూ యువ హీరోలకు గట్టి పోటీ ఇస్తున్నారు. తాజాగా మమ్ముట్టి తన నెక్స్ట్ సినిమాను అధికారికంగా ప్రకటించగా, ఆ సినిమా టైటిల్‌నే ఇప్పుడు పెద్ద చర్చకు దారి తీసింది. మమ్ముట్టి నటించబోయే తాజా సినిమా పేరు 'పాదయాత్ర'. ఈ సినిమాకు మలయాళం సినిమా ప్రపంచంలో లెజెండరీ ఫిల్మ్‌మేకర్‌గా పేరొందిన అదూర్ గోపాలకృష్ణన్ దర్శకత్వం వహించబోతున్నారు మలయాళంలో వాస్తవికత, లోతైన భావోద్వేగాలతో సినిమాలు తెరకెక్కించే దర్శకుడిగా అదూర్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అలాంటి దర్శకుడితో మమ్ముట్టి కలవడం సినీ అభిమానుల్లో భారీ అంచనాలు పెంచుతోంది. ఈ సినిమా టైటిల్ ప్రకటించగానే తెలుగు రాష్ట్రాల్లో కూడా ఆసక్తి ఒక్కసారిగా పెరిగింది. దీనికి కారణం గతంలో మమ్ముట్టి నటించిన 'యాత్ర', 'యాత్ర 2' సినిమాలే. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవితంలోని కీలక ఘట్టం అయిన పాదయాత్రను ఆధారంగా తీసుకొని తెరకెక్కిన 'యాత్ర' సినిమా మంచి విజయం సాధించింది. ముఖ్యంగా మమ్ముట్టి నటనకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభించాయి. అయితే అదే సిరీస్‌లో వచ్చిన 'యాత్ర 2' మాత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఇలాంటి నేపథ్యంలో ఇప్పుడు మమ్ముట్టి మరోసారి 'పాదయాత్ర' అనే టైటిల్‌తో సినిమా ప్రకటించడంపై సహజంగానే రాజకీయ కోణంలో చర్చ మొదలైంది. అంతేకాదు, రెండు రోజుల క్రితమే మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి త్వరలో పాదయాత్ర చేస్తానని ప్రకటించడంతో ఈ సినిమా టైటిల్‌కి, రాజకీయ పరిణామాలకు లింక్ పెట్టి సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే సినీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమా పూర్తిగా మలయాళ సినిమా కాగా, దీనికి ఏపీ రాజకీయాలతో లేదా సమకాలీన రాజకీయ పరిణామాలతో ఎలాంటి సంబంధం లేదని తెలుస్తోంది. అదూర్ గోపాలకృష్ణన్ సినిమాలు సాధారణంగా రాజకీయ బయోపిక్‌లకంటే మానవ సంబంధాలు, సామాజిక అంశాలు, వ్యక్తిగత పోరాటాల చుట్టూ తిరుగుతాయి. అందుకే 'పాదయాత్ర' కూడా ఒక వ్యక్తి జీవిత ప్రయాణం, ఆత్మ అన్వేషణ లేదా సమాజంతో అతడి సంబంధాన్ని ప్రతిబింబించే కథగా ఉండే అవకాశముందని ఫిల్మ్ క్రిటిక్స్ అభిప్రాయపడుతున్నారు.

## మళ్ళీ కలిసిన హిట్ కాంబో.. 'తుడరుమ్' దర్శకుడితో మోహన్‌లాల్ కొత్త చిత్రం



మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ మరియు సెన్సేషనల్ డైరెక్టర్ తరుణ్ మూర్తి కాంబినేషన్‌లో మరో భారీ చిత్రం అధికారికంగా ప్రారంభమైంది. వీరిద్దరి కలయికలో 2025లో వచ్చిన 'తుడరుమ్' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘనవిజయం సాధించింది. అయితే ఇప్పుడు మళ్లీ వీరిద్దరూ జత కడుతుండటంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై కేరళతో పాటు సౌత్ ఇండియా అంతటా భారీ అంచనాలు నెలకొన్నాయి. చూ366 అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ ప్రాజెక్ట్ నేడు అధికారికంగా పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. ఈ విషయాన్ని మోహన్‌లాల్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. ఈ చిత్రంలో మోహన్‌లాల్ ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడు. చాలా కాలం తర్వాత ఆయన పూర్తిస్థాయి ఖాకీ దుస్తుల్లో నటిస్తుండటం సినిమాపై క్యూరియాసిటీని పెంచుతోంది. సీనియర్ నటి మీరా జాస్మిన్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, ఆషిక్ ఉస్మాన్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. రతీష్ రవి కథను అందించిన ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ సంగీతం, షాజీ కుమార్ ఛాయాగ్రహణం సమకూరుస్తున్నారు. ఒకవైపు ఈ చిత్రం ప్రారంభం కాగా, మరోవైపు మోహన్‌లాల్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'దృశ్యం 3' కూడా షూటింగ్ పూర్తి చేసుకుని ఏప్రిల్ 2, 2026న విడుదలకు సిద్ధమవుతుంది.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

ధర్మఘంట

# ఘనంగా మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు

## - పెద్ద ఎత్తున పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

గన్నవరం




స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులతో కలిసి ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు కేక్ కట్ చేసి మంత్రి నారా లోకేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోసం సామూహిక భోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 3 వేల మందికి బోజన ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలకు పెద్ద ఎత్తున కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు. అనంతరం రూ.46 లక్షల 61,221 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కలను 99 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ 43 ఏళ్ల వయస్సులోనే యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన లక్ష్యంగా మంత్రి నారా లోకేష్ దావోస్‌లో పర్యటిస్తున్నారని, జన్మదినం నాడుకూడా రాష్ట్ర ప్రయోజనాల కోసం విదేశీ పర్యటనలో ఉన్నారని పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న ఎన్టీఆర్ విగ్రహాన్ని త్వరలోనే మంత్రి నారా లోకేష్‌తో కలిసి ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్ కుటుంబంతో తమ కుటుంబానికి అనుబంధం ఉందని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గంలో 91,413 ఓట్ల భారీ మెజారిటీతో నారా లోకేష్ విజయం సాధించారని, తెలుగుదేశం పార్టీ గతంలో గెలవని నియోజకవర్గం నుంచే గెలిచి చూపించారని అన్నారు. యువగళం పాదయాత్ర అనంతరం నారా లోకేష్‌లో నాయకత్వంలో స్పష్టమైన మార్పు కనిపించిందని వ్యాఖ్యానించారు. పాదయాత్ర చేస్తాను అంటున్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి తన పాదయాత్ర ను అమరావతి నుంచే ప్రారంభించాలని సూచించారు. నారా లోకేష్ రాష్ట్రానికి గూగుల్ వంటి అంతర్జాతీయ కంపెనీలను తీసుకువచ్చారని పేర్కొన్నారు. గత ఐదేళ్ల పరిపాలనలో జగన్మోహనరెడ్డి రాష్ట్ర అభివృద్ధికి ఏమి చేశారో చెప్పగలరా అంటూ నిలదీశారు. నారా లోకేష్‌తో కూడా జగన్మోహనరెడ్డి పోటీ పడలేదని విమర్శించారు. గతంలో జగన్మోహనరెడ్డి తన ఫోటోతో పాస్‌బుక్స్ ఇచ్చారని, ప్రస్తుతం ప్రభుత్వం ప్రభుత్వ రాజముద్రతో పాస్‌బుక్స్ అందిస్తోందని తెలిపారు. తాను ప్రతి క్షణం గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి కోసమే పని చేస్తున్నానని ఎమ్మెల్యే యార్లగడ్డ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏపీపీఎస్సీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

## - జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

విజయవాడ




ఈ నెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 17 నోటిఫికేషన్లకు సంబంధించి జరగనున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియ.. ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ ఎస్.నాగూర్ షరీఫ్, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహంతో కలిసి సమన్వయ శాఖల అధికారులు, పరీక్ష కేంద్రాల సూపర్‌వైజర్లు, లైజన్ కమ్ ఇన్‌స్పెక్టింగ్ అధికారులు తదితరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జూనియర్ లెక్చరర్ (లైబ్రేరియన్ సైన్స్), ఏఈఈ (సివిల్), హార్టికల్చర్ ఆఫీసర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఇలా 17 నోటిఫికేషన్లకు సంబంధించి ఆఫ్‌లైన్ విధానంలో విజయవాడలో పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది ఎదురుకాకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, వీఎంసీ, విద్యుత్, వైద్య ఆరోగ్యం, రవాణా, పోలీస్ తదితర శాఖలు అవసరమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం ఉండేలా చూడాలని.. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని, ప్రత్యేకంగా బస్సులు నడపాలని సూచించారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు.

# రక్తదానంతో నిండు ప్రాణాలను కాపాడుదాం





## రక్తదానం మహా యజ్ఞ ఫలం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ

రక్తదానం మహా యజ్ఞఫలంతో సమానమని రక్తదానం చేయడం ద్వారా ఒక నిండు ప్రాణాన్ని కాపాడడం అదృష్టంగా ప్రతి ఒక్కరూ భావించాల్సిన అవసరం ఉందని రక్తదానానికి మించిన మరొక దానం లేదని రక్తదానం చేసేలా యువతను ప్రోత్సహించాలల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అన్నారు. స్వాంతంత్ర సమరయోదుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ, నలంద విద్యా సంస్థల సంయుక్త అధ్వర్యంలో నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నందు గల నలంద డీగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం ఒక మహా యజ్ఞఫలం లాంటిదన్నారు. రక్తదానం అనేక మంది రోగులకు నూతన జీవితాన్ని ప్రసాదిస్తుందని అన్నారు. రక్తదానం చేసిన వారిలో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయన్నారు. రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి ప్రాణాలను కాపాడడంలో కలిగిన అనందం మరొకటి ఉండదన్నారు. రక్తదానం చేయడం మానవత్వానికి మరో రూపంగా భావించాలన్నారు. ప్రాణాపాయి స్థితిలో ఉన్నప్పుడు సకాలంలో రక్తం లభించకపోవడం వలన ఎంతో మంది ప్రాణాలను కోల్పోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. అనేక మంది రక్త హీనతతో భాదపడుతున్నారని తలసీమియా వ్యాధికి గురైన వారి ప్రాణాలను కాపాడేందుకు నిరంతరం రక్త మార్పిండి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రక్తదానం అనేది ప్రాణదానం లాంటిద అన్నారు. ప్రమాదానికి గురి అయినప్పుడు, అత్యవసర శస్త్ర చికిత్సల సమయంలో రక్త అవసరం వుంటుందన్నారు. రక్తాన్ని దానం మాత్రమే చేయవచ్చునని ఉత్పత్తి చేయలేమన్నారు. రక్త అపసరమయ్యే జీవితాలకు రక్తదాతలే ప్రాణదాతలన్నారు. 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల వయస్సు వరకు రక్తదానం చేయవచ్చునని, జీవిత కాలంలో ఒక వ్యక్తి దాదాపు 168 సార్లు రక్తాన్ని దానం చేయవచ్చునన్నారు. రక్తదానంతో నీరసించి పోతామనే అపోహను తొలగించి రక్తదానం చేసిన ప్రతీ సారి ఆరోగ్యవంతమైన కొత్త రక్తాన్ని పొందగలుగుతామనే విషయాన్ని యువతకు తెలియ చెప్పి రక్తదాసం వైపు మొగ్గు చూపేలా కృషి చేయాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ జి. సమరం మాట్లాడుతూ అత్యవసర సమయంలో అవసరమైన రక్తం లభించక ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఇలా జిల్లాలో జరగకుండా ఉండటానికి రెడ్ క్రాస్ తరపున అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అన్ని రకాల బ్లడ్ నమూనాలు సేకరించి అందుబాటులో ఉంచుతామని, అత్యవసర సమయంలో రెడ్ క్రాస్ ద్వారా రక్తాన్ని అందుబాటులో ఉంచి మనిషి విలువైన ప్రాణాన్ని కాపాడటానికి తమవంతు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. దీనికి జిల్లా కలెక్టర్ పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సోసైటీ వైస్ చైర్మన్ డా. వెలగా జోషి, సెక్రటరి సిహెచ్ చిట్టిబాబు, నలంద కళాశాల కర్స్పాండెంట్ ఏ. విజయబాబు, ప్రిన్సిపాల్ అనురాధ, కళాశాల ఉపాధ్యాయులు, భోదనేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్యం

### - మంత్రి కొలుసు పార్థసారథి



గన్నవరం

స్థానిక విద్యానగర్ లో వర న్యూరో అండ్ కార్డియాలజీ హాస్పిటల్ ను పౌర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ యువ నాయకుడు లోకేష్ జన్మదినం రోజున నూతనంగా ఏర్పాటు చేసిన వర హాస్పిటల్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గన్నవరంలో ఈ హాస్పిటల్ నిర్మించి పేద ప్రజలకు అందుబాటులో నాణ్యమైన వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినందుకు డాక్టర్లకు అభినందనలు తెలుపుతున్నట్లు తెలిపారు. లాబా పేక్షను దృష్టిలో పెట్టుకోకుండా ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని డాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్క కార్యకర్తకు న్యాయం జరగాలని ఉద్దేశంతో తెలుగుదేశం పార్టీలో ప్రమాద బీమాను ప్రవేశపెట్టి ప్రతి ఒక్క కార్యకర్తకు భద్రత కల్పించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరు బసవరావు, జాస్తి వెంకటేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది కలపాల వెంకటరమణ, కాసరనేని గోపాలరావు, రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి, నాగనబోయిన గిరీష్ రాజు(నాని), నిడమర్తి బుజ్జారావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు




గన్నవరం

మండల పరిధిలోని చిక్కవరం గ్రామంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యా, ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిక్కవరం గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో కేక్ కట్ చేసి మంత్రి నారా లోకేష్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మలింగాయ చెరువు నీటి సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, వడ్డు చెరువు నీటి సంఘం అధ్యక్షుడు పాండురంగ రావు, గ్రామ టీడీపీ పార్టీ కార్యదర్శి నళిని, గంటా పాములు, నువ్వుల సురేశ్‌తో పాటు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మంత్రి సేవలు రాష్ట్ర అభివృద్ధికి మరింత తోడ్పడాలని ఆకాంక్షిస్తూ పార్టీ శ్రేణులు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

## బీజేపీ మాజీ జాతీయ సంఘటన మంత్రి శ్రీరామ్ మాధవ్‌కు ఘన స్వాగతం

గన్నవరం




ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకులు, బీజేపీ మాజీ జాతీయ సంఘటన మంత్రి శ్రీరామ్ మాధవ్‌కు విమానాశ్రయంలో బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి బుచ్చిరాజు, కృష్ణా జిల్లా మాజీ అధ్యక్షులు రాజబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి శేషుకుమార్, గన్నవరం బీజేపీ నాయకులు నిడమర్తి నాగేశ్వరావు, మోర్ల మహీధర్ శ్రీనివాస్ తదితరులు కలిసి శ్రీరామ్ మాధవ్‌కు పుష్పగుచ్చాలు అందజేసి ఆత్మీయంగా అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలపై, రాజకీయ పరిణామాలపై శ్రీరామ్ మాధవ్‌తో నాయకులు స్వల్పంగా చర్చించినట్లు సమాచారం. పార్టీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు.

## సీఎం చంద్రబాబుకు స్వాగతం పలికిన యార్లగడ్డ

గన్నవరం



దావోస్ పర్యటనను ముగించుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు ఉదయం ఉండవల్లికి చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా ఉండవల్లిలోని తన నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, సహచర మంత్రులు, శాసనసభ్యులతో కలిసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి దావోస్ పర్యటనను విజయవంతంగా పూర్తి చేసినందుకు అభినందనలు తెలిపారు. నాలుగు రోజుల పాటు సాగిన ఈ పర్యటనలో సీఎం చంద్రబాబు 36కి పైగా కీలక సమావేశాల్లో పాల్గొన్నారని యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులు, పరిశ్రమల ప్రతినిధులతో విస్తృతంగా చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. ఈ దావోస్ పర్యటన ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించే దిశగా కీలక ముందడుగు పడిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను గ్లోబల్ బ్రాండ్‌గా నిలిపే లక్ష్యంతో చేపట్టిన సీఎం దావోస్ పర్యటన విజయవంతమైందని ఎమ్మెల్యే యార్లగడ్డ తెలిపారు.

## తెలంగాణ వాణి 2026 క్యాలెండర్ ఆవిష్కరణ

**ఆవిష్కరించిన బూర్గంపాడు ఎస్సై మేడ ప్రసాద్, ఎంపిడిఓ జమాల రెడ్డి**

**బూర్గంపహాడ్**



బూర్గంపాడు మండలం, బూర్గంపాడు ఎస్సై మేడ ప్రసాద్, ఎంపీడీవో జమాల్ రెడ్డి చేతుల మీదుగా తెలంగాణ వాణి – 2026 నూతన సంవత్సర క్యాలెండర్ను ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా బూర్గంపాడు ఎస్ఐ మేడ ప్రసాద్ మాట్లాడుతూ.. సమాజ హితమే మన బాధ్యతగా, నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రభుత్వానికి ప్రజలకు వారధిల పని చేస్తూ, ప్రభుత్వ ఫలాలను పేద ప్రజలకు అందేలా తమ వంతు కృషి చేస్తున్న మీడియా మిత్రుల పత్రికలు సమాజానికి దిక్సూచిలా పని చేయాలని, నిష్పక్షపాతంగా పనిచేస్తూ వార్తాపరంగా ప్రజలను చైతన్య పరచాలని, సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావాలని, వాటి పరిష్కార దిశగా తమ వంతు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా తెలంగాణ వాణి పత్రిక భవిష్యత్తులో మరింత అత్యున్నత స్థాయిని అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు అదనపు ఎస్ఐ ఇసనపల్లి నాగ భిక్షం, ట్రైని ఎస్సై దేవ్ సింగ్, బూర్గంపహాడ్ ప్రెస్ క్లబ్ మీడియా డెవలప్మెంట్ సొసైటీ (రి.నెం 259/2025) అధ్యక్షులు యడారి శివరామకృష్ణ (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి), సెక్రటరీ కేసుపాక రాజు, గౌరవ అధ్యక్షులు వనదాసు సాలయ్య, ఆర్ వెంకట్, యండి బాబాజీ, యం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం**

రానున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా పాల్వంచ పట్టణంలో ఉన్న అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు కోసం ఎంపిక చేసిన గదులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు అనుగుణంగా గదుల ఏర్పాటు, స్థల వినియోగం, అంతర్గత ఏర్పాట్లు, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి విభాగానికి కేటాయించే గదులను స్పష్టంగా గుర్తించి, నిర్వహణలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ మరియు రిసీవింగ్ ప్రక్రియలు క్రమబద్ధంగా జరిగేలా స్థల ఏర్పాట్లు ఉండాలని, కౌంటింగ్ నిర్వహణకు అనువైన విధంగా సరిపడ స్థలం, వెలుతురు, గాలి ప్రసరణ కల్పించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ సుజాత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వజ్రాయుధం

**– జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**కొత్తగూడెం**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైన వజ్రాయుధమని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత గల పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకుని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఐ డి ఓ సి కార్యాలయ సమావేశ మందిరంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు ఎంతో విలువ ఉందని, ఆ విలువను ప్రతి ఓటరు తెలుసుకొని తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఓటు హక్కుపై విస్తృత అవగాహన కల్పించడం ద్వారా సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన పాలనను ఏర్పాటు చేసుకోవచ్చని అన్నారు. అధికారులు, యంత్రాంగం 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హత గల యువత ఓటరుగా నమోదు చేసుకునేలా, అలాగే తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తూ విస్తృత స్థాయిలో ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఓటర్లను ఎన్నికల ప్రక్రియలో విధిగా పాల్గొనేలా ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం జనవరి 25న దేశవ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఓటు హక్కు కోసం గతంలో ఎన్నో త్యాగాలు, పోరాటాలు జరిగాయని, ఆ విలువను గుర్తించి అర్హత గల ప్రతినిధులను ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఓటరిపై ఉందని అన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ఉద్యోగులతో కలిసి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ భారతదేశ పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో మన దేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల నిర్వహణను పరిరక్షిస్తామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఓ సంజీవరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లేనినా, బీసీ సంక్షేమ శాఖ అధికారిని విజయలక్ష్మి, ఏ ఓ అనంత రామకృష్ణ ఎన్నికల సూపరిటెంట్ రంగ ప్రసాద్, అన్ని శాఖల జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బంది నవీన్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# కక్ష సాధింపే ప్రజా పాలనగా కోనసాగిస్తున్న నయవంచన రేవంత్ రెడ్డి

**వందసార్లు కేటీఆర్ పేరుతో విచారణకు పిలిచినా భయపడేది లేదు**

**రామన్న నిప్పు.. ఎప్పటికైనా సత్యమే గెలుస్తుంది.. బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు**



**మంగపేట, మన భద్రాద్రి న్యూస్, జనవరి 23**

నీవు చేస్తున్న కుంభకోణాలు బొగ్గు కుంభకోణం, భూముల కుంభకోణం, హైడ్రా కుంభకోణం, ఫార్మాసిటీ కుంభకోణం బయటికి వస్తాయని భయంతోనే ఈరోజు మా బీఆర్ఎస్ పార్టీ అగ్ర నాయకత్వం పైన విచారణ పేరుమీద కాలయాపన తప్ప దీని వల్ల రాష్ట్రానికి ఒరిగేది ఏమీ లేదు. నిన్న హరీష్ రావు, నేడు కేటిఆర్ ఇద్దరు మాజీ మంత్రులు, ఇద్దరు ఎమ్మెల్యేలు కనీసం ఒక్క రోజు కూడా సమయం ఇవ్వకుండా నోటీసులు ఇచ్చి విచారణకు రమ్మనడమే రాజకీయ కక్ష సాధింపు కాదా.. మీ తప్పులు మీ కుంభకోణాలు ప్రజలకు తెలుసు అన్నీ గమనిస్తున్నారు. వాటి నుండి ప్రజల దృష్టి మళ్లించడం కోసం ఇలాంటి చిల్లర పనులు చేసినా ప్రజలు మర్చిపోరు. మీ అవకతవకల మీద గళం ఎత్తడం కూడా ఆగదు. మీరు ఎన్ని కేసులు పెట్టినా ఎన్ని అక్రమ నిర్బంధాలు విధించిన మీ మోసాలను మీ కుట్రలను మీ కుంభకోణాలను ప్రజలలోకి తీసుకుపోతాం, పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## రంజాన్ మాసంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు





**కొత్తగూడెం**

ఫిబ్రవరి 18వ తేదీ నుండి ప్రారంభమయ్యే పవిత్ర రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకొని, జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధ్యక్షతన రంజాన్ మాసంలో చేపట్టవలసిన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని మసీదుల పరిసరాల్లో పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని, మసీదు ఆవరణల్లో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించి పరిశుభ్రతను కాపాడాలని పంచాయతీ రాజ్ మరియు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అలాగే త్రాగునీటి సరఫరా నాణ్యతను మెరుగుపర్చేందుకు బావులు, నీటి ట్యాంకులను శుభ్రపరచి బ్లీచింగ్ పౌడర్ వినియోగించాలని సూచించారు. రంజాన్ మాసంలో ప్రార్థన సమయాలను దృష్టిలో ఉంచుకొని రెండు పూటలా త్రాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ప్రార్థన సమయాల్లో విద్యుత్ అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రతి మసీదు పరిధిలోని లైన్‌మన్ ఫోన్ నంబర్లను మసీదు పెద్దలకు అందుబాటులో ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ప్రార్థనా మందిరాల వద్ద అత్యవసర పరిస్థితుల కోసం అంబులెన్సులు అందుబాటులో ఉండే విధంగా పర్యవేక్షణ చేపట్టాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే ప్రార్థనా మందిరాల వద్ద శాంతిభద్రతలు కాపాడేందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని పోలీస్ శాఖ అధికారులకు సూచించారు. రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని పాలు తదితర నిత్యావసర వస్తువులు సరిపడా అందుబాటులో ఉండేలా డైరీ అభివృద్ధి శాఖ అధికారులతో సమన్వయం చేసి తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలాగే జిల్లాలో ఉన్న అన్ని మసీదులు, వాటి మత పెద్దల పూర్తి వివరాలను సంబంధిత శాఖలు సమర్పించాలని కోరారు. రంజాన్ మాసం సందర్భంగా ప్రజలు అవసరమైన వస్తువులు కొనుగోలు చేయడంలో ఇబ్బందులు కలగకుండా దుకాణాలు ఎక్కువ సమయం తెరిచి ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని కార్మిక శాఖ అధికారులకు సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో, సామరస్యంతో ప్రజలందరూ ఆనందంగా రంజాన్ పండుగను జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆకాంక్షించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సంజీవరావు, కార్మిక శాఖ అధికారి షర్ఫుద్దీన్, పోలీస్ శాఖ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు,జిల్లా అదనపు వైద్య అధికారి, కొత్తగూడెం పాల్వంచ ఇల్లందు మణుగూరు మున్సిపల్ కమిషనర్లు, మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ చేయడంలో

# మీసేవ కేంద్రాలు కీలక పాత్ర పోషించాలి





**కొత్తగూడెం**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో చేరువ కావడంలో మీసేవ కేంద్రాలు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మెగా ఆధార్ క్యాంపుల ద్వారా ప్రజలకు విశేష సేవలు అందించిన మీసేవ కేంద్ర నిర్వాహకులకు కలెక్టర్ ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవ్వాలంటే ప్రజలకు అవసరమైన ఆదాయ, కుల, జనన, మరణ ధృవీకరణ పత్రాలు, నివాస ధృవీకరణ పత్రాలు తదితర ముఖ్యమైన సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ వేగవంతంగా జరగాలని అన్నారు. అలాగే విద్యార్థులకు స్కాలర్షిప్‌ల మంజూరు, వివిధ ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తుల స్వీకరణ, ఆధార్ సంబంధిత సేవలు వంటి అంశాల్లో మీసేవ కేంద్రాలు ప్రజలకు మొదటి సంప్రదింపు కేంద్రాలుగా పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రజలు వివిధ అవసరాల కోసం మీసేవ కేంద్రాలకు వస్తున్న నేపథ్యంలో, కేంద్ర నిర్వాహకులు పూర్తి అవగాహనతో సేవలు అందించడంతో పాటు, అవసరమైన పత్రాలు, విధానాలు, గడువులు తదితర అంశాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, వేగవంతమైన సేవల అందజేత లక్ష్యంగా మీసేవ వ్యవస్థ పనిచేయాలని, ప్రజల సమస్యలను సానుకూలంగా పరిష్కరించే దిశగా నిర్వాహకులు కృషి చేయాలని అన్నారు. మెగా ఆధార్ క్యాంపుల నిర్వహణ ద్వారా వేలాది మందికి ఆధార్ నమోదు, సవరణ సేవలు అందించడం అభినందనీయమని పేర్కొంటూ, ఇదే విధంగా భవిష్యత్తులో కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ మీసేవ కేంద్ర నిర్వాహకులను కోరారు. ప్రభుత్వప్రజల మధ్య వారధిగా మీసేవ కేంద్రాలు పనిచేస్తూ, సంక్షేమ పథకాల విజయవంతమైన అమలుకు తోడ్పడాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు, టి జి టి ఎస్ కృష్ణ మూర్తి, మీసేవ కేంద్ర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా కాంగ్రెస్ అధ్వర్యంలో శానిటైజర్ పాడ్స్ పంపిణీ

ఏఐసీసీ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అలకలంబ ఆదేశానుసారం, టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునితారావు ఆదేశానుసారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోట దేవి ప్రసన్న అధ్యక్షతన మహిళా కాంగ్రెస్ అధ్వర్యంలో పాల్వంచ మండలం, జగన్నాధపురం గ్రామంలో మహిళా కాంగ్రెస్ (నారి న్యాయ్) లో బాగంగా శానిటైజర్ పాడ్స్ ను జగన్నాధపురంలోని ఆడపిల్లలకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ రజినీ , ప్రధాన కార్యదర్శి జ్యోతి,కార్యదర్శులు సరిత, దివ్య, చెంచమ్మ, బ్లాక్ అధ్యక్షులు నాగమణి, కమలా భాయ్, లక్ష్మి, పద్మ శ్రీ, మండల అధ్యక్షులు జయసుధ, స్వరూప, ప్రియాంక, కృష్ణవేణి, రమణారెడ్డి, జయమ్మ భవాని, హైమావతి, మహిళా కాంగ్రెస్ మణులు తదితరులు పాల్గొన్నారు.



# జూలూరుపాడు క్లస్టర్ స్థాయి వాలీబాల్ పోటీల నిర్వహణ





**జూలూరుపాడు**

సీఎం కప్పులో భాగంగా మూడవ రోజు జూలూరుపాడు క్లస్టర్ స్థాయిలో జరిగినటువంటి వాలీబాల్ పోటీలు కాకర్ల గ్రామంలో వ్యవసాయ రైతు వేదిక నందు చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ క్లస్టర్ స్థాయి క్రీడల్లో సుమారుగా 40 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారి మధ్య వాలీబాల్ పోటీలు నిర్వహించుకోవడం జరిగింది. కావున ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి బి.జుంకీలాల్, మండల ఎంపీవో తులసిరాం, స్కూల్ ప్రిన్సిపాల్ సంజీవరావు, పిఈటి యుగేంద్ర మరియు కాకర్ల మాజీ ఎంపీటీసీ పొన్నెకంటి సతీష్ కుమార్, కాకర్ల గ్రామ సర్పంచ్ బానోత్ బుల్లి, ఉప సర్పంచ్ రాచబంటి కోటేశ్వరరావు, జూలూరుపాడు మండల యువజన కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ జిడుగు రాఘవ, గ్రామ పెద్దలు చెరుకుమల్లి నవీన్ కుమార్, పాతర్లపాటి వెంకయ్య, బానోత్ దశరథ్, బానోతు శ్రీను, జల్లికి రాధాకృష్ణ, సోబ్బన్ని లాలయ్య, కంచిపోగు రాజేశేఖర్, పల్లపు కొండల రావు, కంపసాటి వెంకట నారాయణ, ముక్తేశ్వరరావు, ఉదారి రాము, మంద రమేష్, త్రినేష్, పీట్ల వెంకటేష్, వెంకట కృష్ణ, చర్ల నాగరాజు, యహన్, కూనపురి రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత మేడారం అందరి లక్ష్యం

## జిల్లా ఎస్పీ సుధీర్ రామనాధ్ కేకన్ ఐపిఎస్

**మంగపేట**

ఆసియా ఖండంలోని అతి పెద్ద జాతర సమ్మక్క సారలమ్మ వన దేవతల పుణ్యక్షేత్రం మేడారం ప్లాస్టిక్ ను నివారించుదాం.

అరణ్యమే ఆలయంగా ప్రకృతే దేవతలు అనే భావనకు ప్రతీకగా నిలిచే మేడారం మహా జాతరలో ఈసారి ప్లాస్టిక్ నివారణపై జిల్లా ఎస్పీ సుదీర్ రామనాద్ కేకన్ ప్రత్యేక దృష్టి సారించారు. వన దేవతల సన్నిధిలో ప్రకృతిని కలుషితం చేయరాదన్న సంకల్పంతో ప్లాస్టిక్ రహిత మేడారం లక్ష్యంగా పోలీస్ అధికారులు స్వచ్ఛందగా తమ శాఖా సమన్వయంతో చర్యలు చేపట్టారు. ప్లాస్టిక్ కవర్లతో కూడిన బఫ్ ప్లేట్లు, గ్లాసులు, బాటిళ్ల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. వాటి స్థానంలో ప్రకృతి వరప్రసాదితమైన ఆకులతో తయారు చేసిన విస్తారాకుల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ క్రమంలో మేడారంలోని పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ లో శ్రీ వినాయక గ్రామైఖ్య సంఘం ములుగు మండలం జగ్గన్న పేట మహిళల ఆధ్వర్యంలో ఆకులతో తయారు చేసిన విస్తారాకులను పరిశీలించారు. అందరి సహకారంతోనే ప్లాస్టిక్ రహిత మేడారం లక్ష్యం సాధ్యమని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్, ఆదివాసి నవనిర్మాణం సేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కొర్స నరసింహామూర్తి, వార్త జిల్లా



బ్యూరో గంగాధర్ రెడ్డి, జిల్లా క్రైమ్ బ్యూరో వాసం నాగరాజు, జిల్లా సమ్మక్క మేనేజర్ కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వడంపై మండిపడ్డ భూక్య జంపన్న

**మంగపేట**

బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు భూక్యా జంపన్న విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు ఖబర్దార్ రాజకీయ కక్ష సాధింపులో భాగమే వరుస నోటీసులు అని భూక్య జంపన్న, బీఆర్ఎస్ ములుగు జిల్లా నాయకులు అన్నారు. నిన్న హరీష్ రావుకు, నేడు కేటీఆర్ కు నోటీసులతో కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుంది. బొగ్గు స్కాంపై సమాధానం చెప్పలేరు ఆరు గ్యారంటీ ల అమలు చేయరు వీటి నుండి ప్రజల దృష్టి మరలించటానికే ఇలాంటి చర్యలు నోటీసులు కేసులు విచారణలు అంటూ అటెన్షన్ డైవర్షన్ తో ఎన్ని రోజులు తప్పించుకుంటారు? ఇలా ఎన్ని సార్లు నోటీసులు ఇచ్చిన ఎంత మందికి నోటీసులు ఇచ్చినా భయపడేది లేదు. రాబోయే రోజులలో అధికారం మా చేతిలోకి వస్తుంది. మీరు ఎన్ని ఇబ్బందులు పెట్టిన, ఏమి చేసిన భయపడేది లేదు. కాంగ్రెస్ పార్టీ ఇలాంటి అక్రమాలు ఆపివేయాలి. బీఆర్ఎస్ సైనికులు భయపడరు అనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ తెలుసుకోవాలి. కేసులు కొత్త కాదు.. కోట్లాట కొత్త కాదు అని ఆయన అన్నారు.




# మేడారం జాతరకు టీజీఎస్ ఆర్టీసీ భారీ ఏర్పాట్లు..!

**మేడారం జాతరకు ప్రత్యేకంగా 4 వేల బస్సులు**

**జనవరి 25 నుండి పీబ్రవరి 01 వరకు 20 లక్షల మంది భక్తులను తరలించే లక్ష్యం**

**మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం**

**మంగపేట**

తెలంగాణలో ఆసియా కండంలో అతి పెద్ద జాతర వన దేవతల కుంభమేలాగా పేరు పొందిన మేడారం సమ్మక్క సారలమ్మ మహా జాతర 2026కు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విస్తృత స్థాయిలో ఏర్పాటు చేసింది. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 1 వరకు మేడారం జాతరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టిసి అధికారులు తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణం రూపొందించింది. హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి దాదాపు 4000 ప్రత్యేక బస్సులను జాతరకు కేటాయించారు. భక్తుల రద్దీని బట్టి అవసరమైతే బస్సుల సంఖ్యను మరింత పెంచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం మేడారం లో సరిపడా ప్రాంతాల్లో తాత్కాలిక బస్ స్టేషన్లు క్యూ లైన్లు వేచి ఉండే షెడ్లు విచేత పార్కులు సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రద్దీ ఎక్కువగా ఉండే సమయంలో అదనపు బస్సులు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మేడారం జాతర నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని



మార్గాలలో సాధారణ బస్సు సర్వీసులను తాత్కాలికంగా తగ్గిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. మేడారంకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సులు ఏర్పాటు చేస్తామని తెలియజేయడం జరిగింది.

# ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత పాటించండి

- కుటుంబాలను క్షేమంగా ఉంచుకోండి
- పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు**

ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, తమ కుటుంబాలతో క్షేమంగా ఉండాలని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం కిన్నెర కళ్యాణ మండపంలో రోడ్డు భద్రత మాసోత్సవాలు ముగింపు సమావేశం నిర్వహించారు. మణుగూరు ఆటో, ట్రాక్టర్ , మరియు ఇతర వాహనదారుల సమావేశం నిర్వహించారు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు అన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రతి ఒక్కరూ ప్రాణాలు కాపాడుకోవచ్చునని శాసనసభ్యులు తెలిపారు. సెల్ ఫోన్, మద్యపానాలు సేవించరాదన్నారు. మత్తు పదార్థాలకు, గంజాయి కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం డి.ఎస్.పి రవీంద్ర రెడ్డి మాట్లాడుతూ.. వాహనం నడిపేవారు సెల్ఫ్ డిఫెన్స్ తో పరిసరాలను పరిశీలిస్తూ డ్రైవ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగబాబు, ఎస్సై లు నగేష్ కుమార్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్ ఆర్థిక సహాయం

**మంగపేట**

గంగారం మండలంలోని మడగూడ గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్తో మండల యూత్ అధ్యక్షుడు రూప కిరణ్ ఇల్లు కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న శ్రీ రామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బాడిస నాగ రమేష్, కొత్తగూడ మండల అధ్యక్షులు కొమ్మనబోయిన వేణు యాదవ్ చేతుల మీదుగా 5 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. కొత్తగూడ మండల బీఆర్ఎస్ పార్టీ తరఫున సహాయాన్ని అందజేయగా బాడిశ నాగ రమేష్, మండల అధ్యక్షులు కొమ్మనబోయిన వేణు యాదవ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడ బీఆర్ఎస్ మండల నాయకులు, మాజీ ఎంపీటీసీ సర్పంచ్ భూపతి తిరుపతి, వేలు బెల్లి ఎంపిటిసి మోకాళ్ళ సంతోష రాణి, వెంకటేష్, సీనియర్ నాయకులు ఈసం సురేష్, సోలెం శ్రావణ్, సంగి మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




# రోడ్డుపై ప్రకటన బోర్డులను పెడితే కఠిన చర్యలు..!

## - మున్సిపల్ కమిషనర్ ప్రసాద్

**మణుగూరు**

రోడ్డు మీద ప్రకటన బోర్డులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం మణుగూరు సిఐ నాగబాబు ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్ మరియు సిబ్బంది రోడ్డుపై ఉన్న ప్రకటన బోర్డులను తొలగించారు. మేడారం జాతర సందర్భంగా ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉన్నదని, ప్రమాదాలు పొంచి ఉన్నాయని, అందుకే ప్రకటన బోర్డులను తొలగిస్తున్నామన్నారు. మణుగూరు పట్టణంలో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా ఉండేందుకు వ్యాపారస్తుల ప్రకటన బోర్డులు తొలగిస్తున్నామని మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రకటన బోర్లు రోడ్డుమీద పెట్టడం వల్ల ప్రజలకు ఇబ్బందికరంగా మారిందన్నారు. దీంతో బోర్డలను తొలగించే తొలగిస్తున్నామని తెలిపారు. మూడు రోజుల్లో స్పెషల్ డ్రైవ్ ద్వారా మొత్తం బోర్డులను తొలగిస్తామన్నారు.

# సమ్మక్క సారలమ్మ లకు సారే సమర్పించిన రామాలయ ఆలయ కమిటీ చైర్మన్ లేళ్ళ అప్పిరెడ్డి







**జూలూరుపాడు**

పడమట నరసాపురం గ్రామ పంచాయతీ నందు ఆదివాసి అడవి బిడ్డలైన సమ్మక్క సారలమ్మ ల జాతర ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పడమట నరసాపురం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయ కమిటీ చైర్మన్ లేళ్ల అప్పిరెడ్డి సమ్మక్క సారలమ్మ లకు సారె ప్రత్యేకంగా సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమం పడమట నరసాపురం గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి - చినరాజు దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెల్లబోయిన మల్లికార్జున రావు, వెలగా రాంబాబు, వెలగా తిరుపతి రావు, సంఘం నాగరాజు, పుప్పాల శ్రీను, లేళ్ళ నవీన్ రెడ్డి , తెల్లబోయిన నరసింహా రావు, దారబోయిన రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

ధర్మఘంట

# వ్యవసాయ కార్మికుల శ్రమతోనే ఉత్పత్తి - సీఐ రాజు వర్మ

## - వ్యవసాయ కార్మిక సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

**చర్ల**

ఆహారాన్ని పండించి మానవాళి ఆకలిని తీర్చే రైతు కూలీలు జీవనానికి వెన్నుముక వంటి వారిని కష్టపడి పంటలు పండించే వారు లేకపోతే జీవించటం అసాధ్యమని సిఐ రాజు వర్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో వ్యవసాయ కార్మిక సంఘం క్యాలెండర్ ను సిఐ రాజు వర్మ ఆవిష్కరించారు.క్యాలెండర్ ఆవిష్కరణలో ఎస్సై లు ఆర్,నర్సిరెడ్డి, పి,కేశవ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ రాజు వర్మ మాట్లాడుతూ.. రైతు కూలీలు ప్రకృతితో మమేకమై జీవించటం, గ్రామీణ ప్రాంతాలకు ఆధారంగా నిలవడం, పేదరికంలో కూడా సంతృప్తితో పని చేయడం, రైతు విత్తనం నాటిన నుంచి రైతు కూలీలు పంట చేతికి వచ్చేవరకు ఎన్నో కష్టాలను గూర్చి సహనంతో పని చేస్తారని రైతు కూలీల శ్రమతోనే ఉత్పత్తి జరుగుతుందని, వ్యవసాయ కార్మికులు రైతుల వల్ల దేశ ప్రజలందరికీ తినడానికి తిండి దొరుకుతుందని వారి శ్రమను అందరూ గౌరవించాలని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బందెల చంటి మాట్లాడుతూ మండలంలోని పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, వి బి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్పొరేట్ వ్యవస్థకు కాంట్రాక్టర్లు




ఇచ్చి యంత్రాలతో పనిచేసే పరిస్థితి కనబడుతుందని దీనివల్ల గ్రామాల్లో ఉన్న నిరుపేద ప్రజలకు పని దొరకటం కష్టంగా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షురాలు ఊడుగుల షారును, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు, మాజీ మండల కార్యదర్శి కారం నరేష్, గణేష్ ఆటో యూనియన్ అధ్యక్షులు పామర్ బాలాజీ, రైతు సంఘం నాయకులు బి నవీన్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు శ్యామల చంద్రం తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మీ సేవ కేంద్రం సమగ్ర మరమ్మతులు పూర్తి

## - నూతన హంగులతో ప్రజలకు అందుబాటులోకి : జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**మణుగూరు**

మణుగూరు పట్టణంలో ఉన్న ప్రభుత్వ మీ-సేవ కేంద్రం భవనం సమగ్ర మరమ్మతులు పూర్తి చేసుకుని నూతన హంగులతో ప్రజలకు అందుబాటులోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనాలో తెలిపారు. గత కొంతకాలంగా భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మీ-సేవ కేంద్రంలో సేవలు పొందేందుకు వచ్చే ప్రజలు, అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. మరమ్మతులకు ముందు మీ-సేవ కేంద్ర భవనంలో గోడలపై తీవ్రమైన తేమ, పైకప్పు స్లాబ్ ఊడిపోవడం, ఇనుప రాడ్లు బయటకు కనిపించడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. వర్షాకాలంలో పైకప్పు నుంచి నీరు లీక్ కావడంతో కొన్ని గదుల్లో తాత్కాలిక ఏర్పాట్లతోనే సేవలు కొనసాగించాల్సి వచ్చిందని, దీనివల్ల ప్రజలకు అసౌకర్యం కలిగిందని జిల్లా కలెక్టర్ వివరించారు.ఈ పరిస్థితిని గమనించిన జిల్లా యంత్రాంగం, తక్షణమే స్పందించి ప్రభుత్వ మీ-సేవ కేంద్రం పునరుద్ధరణకు చర్యలు చేపట్టిందని తెలిపారు. మరమ్మతులలో భాగంగా దెబ్బతిన్న పైకప్పులు, గోడలను పూర్తిగా సరిచేయడంతో పాటు నీటి లీకేజీ సమస్యలను శాశ్వతంగా నివారించినట్లు చెప్పారు. అదేవిధంగా భవనం అంతటా నూతనంగా పెయింటింగ్ చేపట్టి, అవసరమైన నిర్మాణ పనులు పూర్తి చేసి భవనాన్ని మరింత సురక్షితంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. పునరుద్ధరణ అనంతరం ప్రభుత్వ మీ-సేవ కేంద్రం పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణంలో ప్రజలకు వివిధ ప్రభుత్వ సేవలను అందిస్తోందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ మార్పుతో ప్రజలు సౌకర్యవంతంగా సేవలు పొందే అవకాశం ఏర్పడిందని, ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, సులభంగా అందుతున్నాయని స్థానిక ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ మీ-సేవ కేంద్రం పునరుద్ధరణకు సకాలంలో చర్యలు తీసుకున్న సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ప్రజల కోసం ప్రభుత్వ సేవా మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరచాలన్న జిల్లా పరిపాలన నిబద్ధతకు ఈ చర్య నిదర్శనంగా నిలుస్తోందని ఈ సందర్భంగా తెలిపారు.




# సొసైటీ సబ్ స్టాప్ ఉద్యోగి తడిక సదానందంకు జోహార్లు

**ఇల్లందు**

ఇల్లందు సొసైటీలో సబ్ స్టాప్ ఉద్యోగిగా పనిచేస్తున్న తడిక సదానందం, నిన్న రాత్రి రొంపేడులో తన ఇంటి వద్ద ఆత్మహత్య చేసుకోవడంతో వైద్యం నిమిత్తం, ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల నుండి ఖమ్మం హాస్పటల్ తీసుకువెళ్లగా అక్కడ చనిపోయాడు. ఈరోజు తన డెడ్ బాడీని ఇల్లందు పోస్టుమార్టం నిమిత్తం తీసుకురాగా అక్కడికి చేరుకున్న, ఐఎఫ్టియు, టియుసిఐ నాయకులు, తోడేటి నాగేశ్వరరావు, షేక్ యాకుబ్ షావలి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లాలో 500 మంది కార్మికులు ఈ సొసైటీలలో అత్యంత కీలకంగా గొడ్డు చాకిరీ చేస్తూ పనిచేస్తున్నారని అన్నారు. గత మూడు నెలలుగా వారికి వేతనాలు అందడం లేదని ఆవేదన చెందారు. కుటుంబాలు గడవక అప్పులు చేసి తెచ్చిన పులు కట్టలేక మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నారని వారన్నారు. రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం ఎన్నో హామీలతో ముఖ్యమంత్రి అయి కనీసం జీతాలు ఇవ్వలేనటువంటి దౌర్భాగ్య పరిస్థితిలో ఉన్నదని అన్నారు. సదానందం 30 సంవత్సరాల నుండి 7,000 జీతంతో పని చేశారన్నారు. 2023లో జీవో నెంబర్ 44 ద్వారా రెగ్యులర్ అయ్యారని అన్నారు. కుటుంబ యజమాని చనిపోవడంతో ఆ కుటుంబం దిక్కులేనిది అయిందన్నారు. సదనందానికి ఇద్దరు కొడుకులు ఇద్దరు కొడుకులు ఉన్నారని, ఈ జీతం మీదనే వారి కుటుంబాన్ని పోషిస్తున్నారని అన్నారు. సొసైటీ ఉన్నటి ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని ఆ కుటుంబంలో ఒకరికి వెంటనే ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తనకు రావాల్సిన ఇతర బెనిఫిట్స్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దహన సంస్కారాలకు సొసైటీ నుండి 15 వేల రూపాయలు మేనేజర్, నాగరాజు, సీఈఓ వీరలాల్, సిబ్బంది కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కిన్నెర నర్సయ్య, సిపిఐ ఎంఎల్, న్యూ డెమోక్రసీ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి నాయిని రాజు, మాజీ సర్పంచ్ సంతు మోతిలాల్, ఐఎఫ్టియు సీనియర్ రాష్ట్ర నాయకులు ఎండి రాసుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



# పాఠశాలకు ప్రహరీ నిర్మించండి

**ములకలపల్లి**

మండల పరిధిలోని పొగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ గోడను మంజూరు చేయాలని కోరుతూ నెహ్రూ బాలసభ సభ్యులు శుక్రవారం పొగళ్లపల్లి సర్పంచి మడకం రవికి వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో చాలా నిర్మించిన మరుగుదొడ్లు వినియోగించే విధంగా లేదని, ప్రహరీ గోడ లేని కారణంగా ఆకతాయిలు పాఠశాల ఆవరణను అపరిశుభ్రం చేయడంతో పాటు వర్షాకాల సమయంలో పొలాలు వెళ్లే ట్రాక్టర్లు సైతం స్కూల్ ఆవరణ నుంచి వెళ్తుండటంతో ఆటస్థలం ధ్వంసం అవుతుంది అని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అవసరాలకు వినియోగించే విద్యుత్ స్తంభం పాఠశాల గ్రౌండ్ లో మధ్యలో ఉండడంతో ఆటలు ఆడుకునేందుకు సైతం ఇబ్బందిగా తయారైందని ఈ సందర్భంగా సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై సానుకూలంగా స్పందించిన సర్పంచ్ రవి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



## అంగరంగ వైభవంగా సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రతిష్ట మహోత్సవం, ఊరేగింపు



**ఇల్లందు**

ఇల్లందు పట్టణంలోని 13వ వార్డులో నూతనంగా అంగరంగ వైభవంగా జనవరి 21 నుండి 23 వరకు సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రతిష్ట మహోత్సవ మినీ మేడం జాతరను దండ సారయ్య (శివశక్తి) ఆధ్వర్యంలో బుధవారం నూతనంగా ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది. శుక్రవారం ఊరేగింపు కార్యక్రమం చేయడం జరిగింది 13వ వార్డు 5వ లైన్ లో సమ్మక్క సారక్క గద్దెల ప్రతిష్ఠోత్సవం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అమ్మవారి పసుపు కుంకుమ ఒడిబియ్యం బోనాలతో ఊరేగింపు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సమ్మక్క సారలమ్మ జాతరకు భక్తులందరూ విచ్చేయాలని అమ్మ వాళ్ళ ఆశీస్సులు కరుణ కటాక్షం పొందాలని సారయ్య కోరారు. ఈ కార్యక్రమం లో నిర్వాహ సభ్యులు మేకల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రావిటి ప్రీమియర్ స్కూల్ లో వసంత పంచమి సరస్వతీ దేవి జయంతి వేడుకలు



**టేకులపల్లి**

శుక్రవారం టేకులపల్లి గ్రావిటి ప్రీమియర్ స్కూల్ లో వసంత పంచమి సరస్వతీ దేవి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండంట్ బోడ పూనియా నాయక్, తమ అధ్యాపక బృందంతో పాటు విద్యార్థులందరితో కలిసి చదువుల తల్లికి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పిల్లలకు అక్షర అభ్యాసం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ బొడ్డుపల్లి బ్రహ్మచారి మాట్లాడుతూ.. చదువుల తల్లి సరస్వతీ దేవి అనుగ్రహం ఉంటే విద్యలో రాణించి ఉన్నత ఉన్నతశిఖరాలను అధిరోహించ గలుగుతారని, వారి అనుగ్రహం కొరకు నిత్యం కృషి చెయ్యాలని, అందరు కష్టపడి చదివి ఉన్నత స్థాయి లో స్థిరపడాలని ఆకాంక్షించారు.అనంతరం పిల్లలకు స్వీట్స్, చాకోలేట్స్ పంచి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ బోడ పూనియా నాయక్, డైరెక్టర్ గంగా, ప్రిన్సిపాల్ బొడ్డుపల్లి బ్రహ్మచారి, వైస్ ప్రిన్సిపాల్స్ లలిత మరియు భవాని , అధ్యాపక బృందం సునీత, సుచిత్ర, జ్యోతిక, సరస్వతీ, కావ్యా, సుమిత్ర, సుధాకర్, శివ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యుల 24వ మహా సభను జయప్రదం చేయండి

### - గుండాల మండల గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు గొల్లపెల్లి రమేష్



**గుండాల**

గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మంలోని కృష్ణా ఫంక్షన్ హాల్లో నిర్వహించబోయే గ్రామీణ వైద్యుల 24వ మహా సభకు సంబంధించిన కర పత్రాన్ని శుక్రవారం గుండాల మండల కేంద్రంలో గ్రామీణ వైద్యుల సంఘం అధ్యక్షుడు గొల్లపెల్లి రమేష్ చేతుల మీదుగా విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా గొల్లపెల్లి రమేష్ మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం, సంక్షేమం కొరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి గ్రామీణ వైద్యులు అధిక సంఖ్యలో పాల్గొని మహా సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా కార్యదర్శి టి. రాము, జిల్లా కమిటీ సభ్యులు కె. రాములు, కె. భాస్కర్, ఎస్. సత్యం, ఎం.డి. మహమూద్ , మండల ప్రధాన కార్యదర్శి సోలం సతీష్, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## శిశుమందిర్ లో సామూహిక అక్షరాభ్యాసం

**ములకలపల్లి**



వసంత పంచమిని పురస్కరించుకొని ములకలపల్లి సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు తమ చిన్నారులతో ఈ కార్యక్రమంలో పాల్గొని అక్షరాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ అధ్యక్షులు నరసింహారావు, కార్యదర్శి తాండ్ర ప్రభాకర్ రావు, కోశాధికారి గాడి తిరుపతి రెడ్డి, కమిటీ సభ్యులు పువ్వాల శ్రీనివాస్, హెచ్ఎం మడకం కమల కుమారి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.